
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

నల్లగొండ : fb.com/vaartha Digital

Published from Nalgonda, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Tadepalligudem, Srikakulam

13-10-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 254 పేజీలు: 8+16 వెల: 6.50

అగ్రరాజ్యాల్లో పేదల ఆదాయమే ఎక్కువ! 5

చిన్నారి హత్య కేసులో నిందితుని అరెస్టు 7



## ఓటరు కార్డు తప్పనిసరి కాదు..

### పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎస్ఇఒ సుదర్శన్‌రెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు12,ప్రభాతవార్త:** పట్టభద్రుల నియోజవకవర్గంలో ఓటు నమోదు కోసం ఓటరు కార్డు వివరాలు తప్పనిసరి కాదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్‌తో పాటు వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఓటు నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో >>2



## ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్

### స్థూల ఆర్థిక స్థిరత్వంపై రాబర్ట్ ఇ. హాల్, మైఖేల్ వుడ్ ఫోర్డ్ పరిశోధనలకు పురస్కారం

**స్టాక్‌హోమ్, అక్టోబరు 12:** ఇతర సాంప్రదాయ నోబెల్ బహుమతుల మాదిరిగా.. 2026 సంవత్సరానికి ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని అమెరికాకు చెందిన ఆర్థిక వేత్తలు రాబర్ట్ ఈ. హాల్, మైఖేల్ >>2

# సర్‌ను ఆపండి



సోమవారం న్యూఢిల్లీలో నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తదితరులు

## సుప్రీంలో 'ఇండి' కూటమి పిటిషన్

### నేడు విచారణకు వచ్చే అవకాశం

### ర్యాలీని అడ్డుకొన్న పోలీసులు

### సమయం మించకుండా లీగల్ టీమ్‌తో పిటిషన్ సమర్పించిన రాహుల్

### కాంగ్రెస్ సిఎంలు, పిసిసి చీఫ్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలతో భారీ ర్యాలీ

### పోలీసులు నిరోధించినా ఆగని ఆందోళన

### అప్రూవర్‌గా మారాలని సిఇసికి రాహుల్‌గాంధీ సూచన

**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** ఎన్నికల ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఓటర్ల పేర్లను పెద్ద సంఖ్యలో తొలగిస్తున్నారని, ఎన్నికల జాబితాల సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై విచారణకు సుప్రీంకోర్టు సిద్ధమైంది. రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారమే పరిశీలించి, అందులోని లోపాలు ఉంటే సరిచేసి మంగళవారం విచారణకు జాబితా చేయాలని కోర్టు రిజిస్ట్రీని ఆదేశించినట్లు సమాచారం. కేంద్ర ఎన్నికల ప్రధానకమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌తోపాటు ఇద్దరు కమిషనర్లను ఈ పిటిషన్‌లో పార్టీలుగా చేసారు. దాదాపుగా ఇండియా కూటమి నేతలు అందరూ కూడా ఈ ర్యాలీలో పాల్గొని సుప్రీం >>2




న్యూఢిల్లీలో నిర్వహించిన ర్యాలీలో సిఎం రేవంత్, మంత్రులు శ్రీధర్‌బాబు, వాకిటి, అడ్లూరి తదితరులు

## జ్ఞానేశ్ గోబ్యాక్

### సైమన్ గో బ్యాక్ తరహాలో ఉద్యమం

### సర్ పేరుతో ఓటు చోరీకి మోడీ, షా, జ్ఞానేశ్ కుట్ర

### దళిత, గిరిజన, పేద ఓట్ల తొలగింపునకు యత్నం

### రాహుల్ నేతృత్వంలో భారీ పోరాటం

### మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు సిఎం రేవంత్ దిశానిర్దేశం

2



## పండుగ దోపిడి!

### హైదరాబాద్ - విజయవాడ రూ. 1700

### ఛార్జీలు భారీగా పెంచిన ట్రావెల్స్

### చోద్యం చూస్తున్న అధికారులు

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** బతుకమ్మ, దసరా పండుగ సెలవులు కావడంతో డిమాండ్ పెరి. ఒక పక్క ఆర్టీసీ, మరోపక్క ప్రైవేటు ట్రావెల్స్ టికెట్ ధరలు భారీగా పెంచి ప్రయాణీకుల జోబులకు చిల్లు పెడుతున్నాయి. ఇక ప్రైవేటు ట్రావెల్స్ పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. భారీగా టికెట్లు రేట్లు పెంచి అందినకాడికి దండుకున్నాయి. అయితే రవాణాశాఖ అధికారులు మాత్రం ప్రేక్షక పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. చూసీచూడనట్లు వదలివేస్తున్నారి బహిరంగంగా ప్రయాణీకులు చెబుతున్నారు. ప్రైవేటు ఆపరేటర్లు కొందరు టికెట్ల ధరలను భారీ పెంచారు. బస్ స్టేషన్లు రద్దీగా మారినప్పుడు లేదా బుకింగ్ వెబ్‌సైట్లలో డిమాండ్ పెరిగినప్పుడు చార్జీలు భారీగా పెంచడం ప్రైవేటు ట్రావెల్స్‌కు సర్వసాధారణమైంది. దీంతో ధరలు ఎప్పుడు, ఎంత పెరుగుతాయో ననేది టిక్కెట్ బుకింగ్ ఏజెంట్లకు కూడా స్పష్టత లేకుండా పోతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఒకప్రైవేటు ట్రావెల్స్ కంపెనీ నడుపుతున్న ఎసి స్లీపర్ బస్సు, కూకట్‌పల్లి నుండి విజయవాడకు ప్రయాణించడానికి ఒకని వద్ద రూ.1,700వసూలు చేసింది. సాధారణ రోజుల్లో అదే ప్రయాణానికి చార్జి రూ.580 నుండి 700 వరకూ >>2

## ఇక దేశమంతా జంతర్ మంతర్!

### సిజెపి చీఫ్ అభిజిత్ దీప్కే

**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** దేశ రాజధానిలో దశాబ్దాలుగావివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నిరసనలకు ప్రధాన కేంద్రంగా నిలుస్తూ వచ్చిన జంతర్ మంతర్ ఇకపై ధర్నా వేదికగా అం



దుబాటులో ఉండదు. ఈ ప్రదేశాన్ని అధికారిక నిరసన ప్రదేశాల జాబితా నుంచి తొలగించింది. డీనోటిఫై చేసింది. ప్రజా ఆందోళనల నిర్వహణ కోసం ప్రత్యామ్నాయ స్థలాలను అన్వేషించడానికి ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ సమర్పించిన నివేదిక, సిఫార్సుల ప్రాతిపదికన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్రం తీసుకున్న ఈ >>2



సోమవారం హిరోషిమా ప్రతినిధులతో భేటీ అయిన సిఎస్ సంజయ్ జాజు

## తెలంగాణ-హిరోషిమా ఆర్థిక బంధం!

### పెట్టుబడులు, ఉపాధి అవకాశాల విస్తరణకు కృషి

### హిరోషిమా ప్రభుత్వ ప్రతినిధులతో సిఎస్ సంజయ్ జాజు భేటీ

**హైదరాబాద్,అక్టోబరు12,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రానికి, జపాన్‌లోని హిరోషిమా ప్రభుత్వానికి మధ్య పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన రంగాల్లో పరస్పర భాగస్వామ్యానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో హిరోషిమా ప్రభుత్వ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలు, భవిష్యత్ ఆర్థిక లక్ష్యాలు, పెట్టుబడులకు అనుకూలమైన రంగాల గురించి వివరించారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న కార్యక్రమాలను ప్రధాన కార్యదర్శి వివరించారు. ముఖ్యంగా కింది రంగాల్లో ఉన్న అవకాశాలను ప్రతినిధి బృందం దృష్టికి తీసుకువచ్చారు.

**క్యూర్:** హైదరాబాద్ ప్రధాన పట్టణ ప్రాంతంలో సమగ్ర పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ.

**ప్యూర్:** నగర పరిసర ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, పారిశ్రామిక, ఆర్థిక కార్యకలాపాలకు ప్రోత్సాహం.

**రేర్:** గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయ ఆధారిత రంగాలు, విలువ ఆధారిత పరిశ్రమల అభివృద్ధి. ఔటర్ రింగ్ రోడ్ పరిసరాల్లో రవాణా అనుసంధానం, పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధికి అవకాశాలు.

**భారత్ ఫ్యూచర్ సిటీ:** ఆధునిక నగర నిర్మాణం, అంతర్జాతీయ పెట్టుబడులు, సాంకేతికత ఆధారిత అభివృద్ధికి ప్రాధాన్యం.

**డేటా సెంటర్లు:** డిజిటల్ మౌలిక సదుపాయాలు, డేటానిల్వ, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాల్లో >>2

### ఆర్టీసీ-మెట్రో ఉమ్మడి పాస్ చార్జీల

## పునఃపరిశీలన

### బిజెపి డ్రామాలు, డైవర్షన్లు పక్కనపెట్టి

### అర్హులైన పౌరులకు ఓటువాక్కు ఇవ్వండి

### రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

6



### తమిళనాడు కొత్త గవర్నర్‌గా

## అర్లేకర్

### కర్ణాటకకు డా. సుధాయాదవ్

### మరో 4 రాష్ట్రాలకూ మార్పులు

**న్యూఢిల్లీ,అక్టోబరు 12:** దేశంలోని వివిధ రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి భవన్ సోమవారం కీలక ప్రకటన జారీ చేసింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను ఖరారు చేస్తూ ఆమోదం తెలిపారు. వివిధ రాష్ట్రాల మధ్య పరిపాలనా సౌలభ్యం,సర్దుబాటులో భాగంగా ఈ నియామకాలు, బదిలీలు జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సిక్కిం గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఓం ప్రకాశ్ మాథుర్‌ను కేరళ గవర్నర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది.అలాగే కేరళ గవర్నర్‌గా ఉన్న రాజేంద్ర >>2

### బీరు ఫ్యాక్టరీలపై ప్రేమ

## ప్రజలపై ఏదీ?

### నీటి నిల్వలు, కరెంట్ ఒప్పందాలపై సర్కార్ నిర్లక్ష్యం: హరీష్ రావు



**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కోట్ల మంది ప్రజల తాగు నీటి అవసరాలను పక్కన పెట్టి, బీర్ ఫ్యాక్టరీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... ప్రభుత్వం నీటి, విద్యుత్ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. సింగూరు ప్రాజెక్టు అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ మరమ్మతుల పేరుతో ప్రాజెక్టు నుంచి 29 టీఎంసీల నీటిని ఖాళీ చేసి, పనులను అసంపూర్తిగా వదిలేశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 3 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నా, దానిని బీర్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ చర్య వల్ల హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రజల తాగునీటి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యాల వల్లే రాష్ట్రంలో కరెంట్ కోతలు పెరిగాయని, ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని హరీశ్ రావు >>2

### 7.52 మీటర్ల లోతుకు పడిపోయిన నీటిమట్టాలు

### ముంచుకొస్తున్న మంచినీటి సంక్షోభం

### ఇప్పటికే ఎండిపోయిన పంటపొలాలు




## నీటి జాడలు అదృశ్యం!

### అడుగంటుతున్న భూగర్భ జలాలు

### ఖరీఫ్ నష్టం రూ. 20 వేలకోట్లు 3

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం కారణంగా అసాధారణమైన నీటి సంక్షోభం నెలకొంది. ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం, జలాశయాలు నిండకపోవడం వల్ల భూగర్భ జలాలు ఎన్నడూ లేనంతగా అడుగంటిపోతున్నాయి. భూగర్భ జలవనరుల శాఖ తాజా నివేదిక ప్రకారం రాష్ట్ర సగటు భూగర్భ జల మట్టం 7.52 మీటర్ల లోతుకు పడిపోయింది. ఇది గతేడాది సెప్టెంబర్‌తో పోలిస్తే 3.11 మీటర్ల తగ్గుదల, ఇది సమస్య తీవ్రతను స్పష్టం చేస్తోంది. ప్రధానంగా ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రుతుపవనాలు ఆలస్యం కావడంతో దాదాపు 18 >>2



గురుగ్రామ్‌లో సోమవారం భారీ వర్షం కురవడంతో వరద నీటిలోనే రాకపోలు సాగిస్తున్న వాహనాలు

## నీటి జాడలు అదృశ్యం!

>> శాతం వర్షపాత లోటు నమోదైంది. సాధారణంగా రుతుపవనాల సమయంలో వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలను రీఛార్జ్ చేస్తుంది. కానీ ఈ ఏడాది అటువంటి అవకాశం చాలా తక్కువ. భూగర్భ జలవనరుల శాఖ రాష్ట్రంలోని 33 జిల్లాల్లోని 1,771 పీజోమీటర్ల ద్వారా నీటిమట్టాలను అధ్యయనం చేస్తోంది. ఆ నివేదిక ప్రకారం, 7 జిల్లాల్లో సగటు భూగర్భ జలమట్టం 10 నుంచి 15 మీటర్లకు, 19 జిల్లాల్లో 5 నుంచి 10 మీటర్లకు, మిగతా 7 జిల్లాల్లో 5 మీటర్ల కంటే తక్కువకు పడిపోయాయి. వికారాబాద్ జిల్లాలో అత్యధికంగా 11.96 మీటర్లకు నీటిమట్టాలు పడిపోయాయి. గతేడాది కాలంలో అక్కడ 6.17 మీటర్ల మేర నీటిమట్టాలు తగ్గాయి. అలాగే హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి వంటి జిల్లాల్లో కూడా భూగర్భ జలాలు 10 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు పడిపోయాయి. అత్యంత తక్కువ లోతులో (3.50 మీటర్లు) ఖమ్మం జిల్లా ఉంది. ఇక పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో విపరీతంగా బోర్లు వేయడం, నీటిని విచ్చలవిడిగా వినియోగించడం భూగర్భ జలాల పతనానికి ప్రధాన కారణాలు. ఒకప్పుడు 300 నుండి 500 అడుగుల లోతులో నీరు లభించేది. ప్రస్తుతం గచ్చిబౌలి, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో 2 వేల అడుగుల లోతులో కూడా నీరు దొరకడం లేదు. భూగర్భ జలవనరుల శాఖ నిబంధనల ప్రకారం గరిష్టంగా 120 నుంచి 150 అడుగుల లోతు వరకు మాత్రమే బోర్లు వేయాల్సి ఉన్నా వాటిని ఖాతరు చేయడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రమాదకర పరిణామాలు ఎదుర్కోనాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఈ సంక్షోభం తాగు, సాగునీటి కష్టాలను తీవ్రతరం చేస్తోంది. ఇప్పటికే పలుచోట్ల వరిపొలాలు ఎండిపోయి, పశువులకు మేతగా మారాయి. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అనేక ఎకరాల పంట ఎండిపోయింది. భూగర్భ జలమట్టాలు తగ్గితే వ్యవసాయంతో పాటు పరిశ్రమలపైనా తీవ్ర ప్రభావం పడుతుంది, వేలాది మంది ఉపాధిని కోల్పోయే ప్రమాదం ఉంది. 2027 మే నెలాఖరు వరకు తాగునీటికి తీవ్ర సమస్యలు ఎదురవుతాయని జలవనరుల నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## కొత్త గవర్నర్‌గా అర్లేకర్

>> విశ్వనాథ్ ఆర్లేకర్‌ను తమిళనాడు నూతన గవర్నర్‌గా నియమించారు. ఇప్పటికే ఆయన అదనపు బాధ్యతలునిర్వహిస్తున్నారు. ఇకపై పూర్తికాలపు గవర్నర్‌గా ఆయన బాధ్యతల్లో కొనసాగుతారు. ఈ నియామకాల పరంపరలో బ్రజ్ మోహన్ రామ్‌కు ఒడిశా గవర్నర్‌గా బాధ్యతలు కేటాయించగా, డాక్టర్ సుధా యాదవ్‌ను కర్ణాటక గవర్నర్‌గా నియమిస్తూ రాష్ట్రపతి భవన్ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు డాక్టర్ ధాల్ సింగ్ బిసేన్‌కు ఉత్తరాఖండ్ గవర్నర్‌గా బాధ్యతలు అప్పగించగా, దుష్యంత్ గౌతమ్‌ను సిక్కిం నూతన గవర్నర్‌గా నియమించారు. వివిధ రాష్ట్రాల్లో పరిపాలనాపరమైన అనుభవం కలిగిన నేతలకు సర్వోన్నత రాజ్యాంగ పదవులను కట్టబెట్టడం ద్వారా ప్రభుత్వ యంత్రాంగాన్ని మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఈ మార్పులు దోహదపడతాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. త్వరలోనే వీరంతా కొత్త రాష్ట్రాల్లో తమ బాధ్యతలను అధికారికంగా స్వీకరించనున్నారు.

## పండుగ దోపిడి!

>> ఉంటుంది. టికెట్ చార్జీలు అంతగా పెంచినా తప్పనిసరి పరిస్థితుల్లో అంత భారీగా ఖర్చు చేయక తప్పడం లేదని, రేటు ఎక్కువగా ఉందని ఆలోచిస్తే మరింత పెంచి చెబుతున్నారని ప్రయాణీకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సర్వీసులు కూడా ప్రత్యేక సర్వీస్ కేటగిరీ కింద రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్నాయి. మహబూబ్‌నగర్, వరంగల్, కరీంనగర్ వైపు ప్రయాణించే ప్రైవేటు బస్సులు తమ సాధారణ చార్జీల కంటే రెండింతలకు పైగా వసూలు చేస్తున్నాయి. టికెట్లు కొనుగోలు ఆలస్యం చేస్తే చార్జీలు మరింత పెరుగుతాయనే భయంతో కొందరు అయిష్టంగానే టికెట్లు కొనుగోలు చేస్తున్నారని ఒక టిక్కెట్ బుకింగ్ ఏజెంట్ చెప్పారు.

పలువురు ప్రయాణీకులు వెల్లడించిన వివరాలు ప్రకారం హైదరాబాద్ నుండి బయులుదేరే ప్రైవేటు బస్సు చార్జీలను చూస్తే హైదరాబాద్ నుండి విజయవాడకు నాన్ ఎసి సర్వీసుకు రూ.900, ఎసి లేని స్లీపర్‌కు 1,200, ఎసి స్లీపర్‌కు 1,400 వసూలు చేస్తున్నారు. విశాఖపట్నంకు హైదరాబాద్ నుండి రూ.1,470, ఎసి లేని స్లీపర్‌కు రూ. 1,980, ఎసి స్లీపర్‌కు రూ.2,600 వసూలు చేస్తున్నారు. సీట్లకు ఇంకా డిమాండ్ పెరిగే కొద్దీ వాటిని కూడా మరింత పెంచి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

## తప్పనిసరి కాదు..

>> ఓటరు కార్డు నంబరు, ఇతర వివరాలు తప్పనిసరిగా కావాలని ఎన్నికల అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సీఈఓ తెలిపారు. కేవలం ఓటరు కార్డు నంబరు, వివరాలు లేవన్న కారణంగా ఓటు నమోదు కోసం గ్రాడ్యుయేట్లు సమర్పించిన ఫారం18 తిరస్కరించడానికి వీల్లేదని కలెక్టర్లు, ఈఆర్‌వోలకు స్పష్టతనిస్తూ సీఈఓ సుదర్శన్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని వరంగల్-ఖమ్మం-నల్గొండతో పాటు మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల పదవీకాలం 2027 మార్చిలో ముగియనుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు గత నెల 17న ఓటర్ల జాబితాకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ ఎన్నికల్లో ఓటు వేయడానికి అర్హత పొందాలంటే, పట్టభద్రులు తమ డిగ్రీని పూర్తి చేసి ఈ ఏడాది నవంబర్ 1 నాటికి మూడేళ్లు పూర్తయి ఉండాలి. దీంతో పాటు ముందుగా పట్టభద్రుల ఓటర్లుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో భాగంగా వారి వివరాలతో ఫారం18ను నింపాల్సి ఉంటుంది.

**ఓటరు నమోదు కోసం డీఈఓ, ఈఆర్ఓ, ఏఈఆర్**

ఓ కార్యాలయాల్లో ఫారం18 పత్రాలు అందుబాటులో ఉంటాయి. దరఖాస్తులను పోస్ట్ ద్వారా కూడా ఈఆర్ ఓలు, ఏఈఆర్ ఓలకు పంపొచ్చు. లేదా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫారమ్‌ను సమర్పించే సదుపాయం కూడా ఉంది. అయితే, గత పట్టభద్రుల ఎన్నికల సమయంలో ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నా ఇప్పుడు మళ్లీ ఫారం18 ద్వారా కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందే. ఈ ఓటర్ల నమోదు ప్రక్రియ నవంబర్ 6 వరకు కొనసాగుతుందని ఎన్నికల అధికారులు ప్రకటించారు.

## ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్

>> వుడ్‌ఫోర్డ్ సంయుక్తంగా గెలుచుకున్నారు. ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచేందుకు ఉపయోగపడే సిద్ధాంతపరమైన పరిశోధనలకు గుర్తింపుగా వీరికి ఈ పురస్కారం ప్రకటించారు. అక్టోబర్ 12న స్టాక్‌హోమ్‌లో రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఈ ప్రకటన చేసింది. ఈ యేడాది ఆర్థిక శాస్త్ర పురస్కారానికి ఎంపికైన ఇద్దరు ప్రముఖ ఆర్థికవేత్తలు తమ పరిశోధనలతో ప్రపంచ ఆర్థిక విధానాల రూపకల్పనకు కీలకమైన సహకారం అందించారు. కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంతో అనుబంధం కలిగిన ఆర్థికవేత్త రాబర్ట్ ఈ హాల్. కాగా, మైఖేల్ వుడ్‌ఫోర్డ్.. న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వవిద్యాలయంతో అనుబంధం కలిగిన ఆర్థికవేత్త. వీరిద్దరూ చేసిన పరిశోధనలు వ్యక్తులు, కుటుంబాలు, వ్యాపార సంస్థలు తీసుకునే ఆర్థిక నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థపై ఎలా ప్రభావం చూపుతాయో అర్థం చేసుకోవడానికి సహాయపడతాయి. స్థూల ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణకు సూక్ష్మ ఆర్థిక పునాదులు అనే అంశంపై చేసిన కృషికి వీరికి నోబెల్ పురస్కారం వరించింది. సులభంగా చెప్పాలంటే ప్రజల వినియోగం, పొదుపు, పెట్టుబడులు, వ్యాపార సంస్థల నిర్ణయాలు వంటి అంశాలు దేశవ్యాప్తంగా ద్రవ్యోల్బణం, ఉత్పత్తి, ఆర్థిక వృద్ధిపై ఎలాంటి ప్రభావం చూపుతాయో వివరించే ఆర్థిక నమూనాలను అభివృద్ధి చేయడంలో వీరి పరిశోధనలు కీలక పాత్ర పోషించాయి. ఈ పరిశోధనలు కేంద్ర బ్యాంకులు, ప్రభుత్వాలు ఆర్థిక విధానాలను రూపొందించే టప్పుడు ఉపయోగపడతాయి. ముఖ్యంగా ఇంధన సంక్షోభాలు, ప్రజల వినియోగంలో ఆకస్మిక మార్పులు వంటి పరిస్థితుల్లో ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావాలను అర్థం చేసుకోవడానికి ఇవి తోడ్పడతాయి. ఆర్థిక శాస్త్రం పురస్కారం కింద మొత్తం 12 మిలియన్ స్వీడిష్ క్రోనాలు నగదు బహుమతిగా ప్రకటించారు. ఇది సుమారు 1.2 మిలియన్ అమెరికన్ డాలర్లకు సమానం. ఈ పురస్కారాన్ని ఇద్దరు విజేతలు సంయుక్తంగా అందుకోనున్నారు. రాబర్ట్ ఈ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌లకు లభించిన ఈ గుర్తింపు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మరింత సమర్థవంతంగా అర్థం చేసుకోవడంలో వారి పరిశోధనల ప్రాముఖ్యతను తెలియజేస్తోంది. ద్రవ్యోల్బణం, ఆర్థిక ఒడిదుడుకులు, ప్రజల వినియోగ ధోరణులు వంటి అంశాలపై ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు నిర్ణయాలు తీసుకునేందుకు వీరి సిద్ధాంతాలు ఉపయోగపడుతున్నాయి.

## వారం - వర్జ్యం

13-10-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వీయుజ మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, చిత్త కార్తె,
తి.తదియ రా.11.30
న. విశాఖ రా.1.44
వ. ఉ.5.56-ఉ.7.39
దు.1. ఉ.8.21-ఉ.9.08
దు.2. రా.10.31-రా.11.18
రాహు మ.3.00-సా.4.30
శుభ ఉ.10.00-11.00

## వార్తాఫలం

**మేషం :** మీ వైఖరిలో మార్పులు ఏర్పడతాయి. అనాలోచితంగా వ్యవహరిస్తారు. వృత్తి, ఉద్యోగాల పరంగా అధికంగా శ్రమిస్తారు.

**వృషభం :** సహోదర, సహోదరీ వర్గంతో కలిసి ఇష్టాగోష్టిని సాగిస్తారు. ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తారు.

**మిథునం :** ధనాన్ని ఇచ్చిపుచ్చుకునే విషయమై జాగ్రత్తలు అవసరం. అనుకూలమైన ఉత్తర్వులు చేతికందుతాయి.

**కర్కాటకం :** పుస్తక పఠనం సాగిస్తారు. నిష్కారణంగా నిందారోపణలకు గురి చేస్తున్న వారిని గుర్తిస్తారు.

**సింహం :** బహుమతులను అందుకుంటారు. ఉపయుక్తమని భావించిన ప్రతి అంశం పట్ల శ్రద్ధను కనబరుస్తారు.

**కన్య :** జీవితభాగస్వామితో కలిసి సమాలోచనలు సాగిస్తారు. ఉద్యోగస్తులకు అనుకూలంగా ఉంది.

**తుల :** దీర్ఘాలోచనలు సాగిస్తారు. ఉపకరించే సమాచారాన్ని తెలుసుకుంటారు. ప్రకటనలు లాభిస్తాయి.

**వృశ్చికం :** రాజకీయరంగంలోని వారితోటి పరిచయాలు ఏర్పడతాయి. క్రమశిక్షణకు అధిక ప్రాముఖ్యతనిస్తారు.

**ధనుస్సు :** సంస్కృతి సాంప్రదాయాల పట్ల ఆసక్తిని కనబరుస్తారు. లౌక్యంగా వ్యవహరిస్తారు. ఋణాలను తీరుస్తారు.

**మకరం :** మంచి నైపుణ్యాన్ని కనబరుస్తారు. ఉచిత సలహాలకు దూరంగా ఉంటారు. ఆదాయ వ్యయాలు సరిసమానంగా ఉంటాయి.

**కుంభం :** అందరి మేలు కోరుకునే వ్యక్తిగా మంచి పేరును సంపాదించుకుంటారు. ఆర్థిక స్థితి బాగుంటుంది.

**మీనం :** ఇరువర్గాలతోటి సఖ్యతను ఏర్పరచుకుంటారు. దైనందిన కార్యక్రమాలలో మార్పులను చేస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# జ్ఞానేశ్ గోబ్యాక్

### సైమన్ గో బ్యాక్ తరహాలో ఉద్యమం
### సర్ పేరుతో ఓటు చోరీకి మోదీ, షా, జ్ఞానేశ్ కుట్ర
### దళిత, గిరిజన, పేద ఓట్ల తొలగింపునకు యత్నం
### రాహుల్ నేతృత్వంలో భారీ పోరాటం
### మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు12:** దేశ ప్రజల ఓటు హక్కును కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకత్వంలో ఈ పోరాటం కొనసాగుతోందని తెలిపారు. బ్రిటిష్ పాలన నుంచి దేశానికి స్వేచ్ఛ, స్వపరిపాలన కల్పించేందుకు ఆనాడు కాంగ్రెస్ నాయకులు పోరాడారని, ఇప్పుడు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకునేందుకు పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీఎం తెలిపారు. ఓటు బచావో.. దేశ్ బచావో ఆందోళనలో భాగంగా ఢిల్లీ తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఆనాడు స్వాతంత్ర్యం కోసం 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం సాగిందని, ఇప్పుడు ఓటు హక్కును కాపాడుకునేందుకు 'జ్ఞానేశ్ గో బ్యాక్' 'ఎస్ఐఆర్ గో బ్యాక్' నినాదాలతో ఉద్యమించాల్సిన అవసరం వచ్చిందని సీఎం అన్నారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ముందుపెట్టి, ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని సీఎం ఆరోపించారు. 'సైమన్ గో బ్యాక్' ఉద్యమ సమయంలో లాలా లజపతిరాయ్ లాఠీచార్జీలో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఎందరో నాయకుల త్యాగాలు, పోరాటాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని పేర్కొన్నారు. అయితే, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం దేశ ప్రజలకు ఓటు అనే శక్తిమంతమైన ఆయుధాన్ని అందించిందన్నారు. రాజరిక, కుటుంబ పాలనలకు ముగింపు పలికి ప్రజల చేతిలో అధికారం పెట్టడంలో ఓటు హక్కు కీలక పాత్ర పోషించిందని సీఎం తెలిపారు. దేశ యువత ఓట్లను తొలగించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని సీఎం మండిపడ్డారు. సోషల్ మీడియాలో బీజేపీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టేవారిని లక్ష్యంగా చేసుకుని వారి ఓటు హక్కులను తొలగించే యోచనలో ఉందని సీఎం విమర్శించారు. ఈ ప్రమాదాన్ని తొలుత గుర్తించి దేశ ప్రజల దృష్టికి తీసుకొచ్చింది రాహుల్ గాంధీయేనని సీఎం వెల్లడించారు. మొదట్లో ప్రతిపక్ష పార్టీలు ఈ అంశంపై తగినంతగా దృష్టి పెట్టలేదని, తాజా పరిణామాలతో పరిస్థితి తీవ్రత అందరికీ అర్థమవుతోందన్నారు. 2014లో నరేంద్ర మోదీ తొలిసారి ప్రధానమంత్రి పదవికి పోటీ చేసిన సమయంలో దేశంలో సుమారు 81 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. 2019లో ఈ సంఖ్య సుమారు 91 కోట్లకు, 2024 ఎన్నికల నాటికి సుమారు 97 కోట్లకు చేరిందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. 2026లో ఇప్పటికే 13 కోట్ల ఓట్లను తొలగించారని ఆరోపించారు. ఈ తొలగించే ఓట్ల సంఖ్యను 20 కోట్లకు పెంచే కుట్ర ప్రయత్నం జరుగుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. 2014లో దేశ జనాభా ఎంత? ప్రస్తుతం ఎంత? అనే వివరాలను పరిశీలించాలన్నారు. జనాభా పెరుగుతున్నప్పుడు ఓటర్ల సంఖ్య తగ్గడానికి కారణమేంటని సీఎం ప్రశ్నించారు. జనాభా పెరిగితే ఓటర్ల సంఖ్య పెరగాలా? తగ్గాలా? అన్నది సాధారణ ప్రశ్నేనని, దీనికి ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానం చెప్పాలని సిఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ అంశంపై రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్పందించాలని కోరారు. ప్రజలను శ్రీమంతులు, పేదలు అనే వర్గాలుగా విడదీసి, పేదల ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని సీఎం ఆరోపించారు. సంపన్నులు బీజేపీకి మద్దతుగా ఉంటారని, పేదలు ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉంటారనే రాజకీయ లెక్కలతో ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారనే అనుమానాలు ఉన్నాయన్నారు. ఓటు హక్కును తొలగించడం ద్వారా కొన్ని వర్గాల ప్రజలను రెండో తరగతి పౌరులుగా మార్చే ప్రయత్నాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులు ప్రతి పౌరుడికీ అందాలని, పేదలు, దళితులు, గిరిజనులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఓటు హక్కు ఉండాలని స్పష్టం చేశారు. ఆనాడు 'సైమన్ గో బ్యాక్' నినాదం స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఊపునిచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు రాహుల్‌గాంధీ నేతృత్వంలో సాగుతున్న 'జ్ఞానేశ్ గో బ్యాక్' ఉద్యమం దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు, ఓటు హక్కును కాపాడేందుకు దోహదపడుతుందన్నారు. గాంధీ కుటుంబం దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిందని, ఇప్పుడు అదే కుటుంబానికి చెందిన రాహుల్‌గాంధీ 'ఓట్ చోరీ' ప్రచారం ద్వారా ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు పోరాటం చేస్తున్నారని సీఎం తెలిపారు. అందులో భాగంగానే తాము ఢిల్లీకి వచ్చి నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని చెప్పారు. ఈ పోరాటాన్ని మరో స్వాతంత్ర్య ఉద్యమం మాదిరిగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పేదలు, దళితులు, గిరిజనులకు ఓటు హక్కు ఉండకూడదనే అభిప్రాయాలను బీజేపీ, దాని సైద్ధాంతిక గురువైన ఆర్ఎస్ఎస్ నాయకులు గతంలో వ్యక్తం చేశారని సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అయితే, బాబాసాహెబ్ అంబేద్కర్ అన్ని వర్గాల ప్రజలకు ఓటు హక్కు కల్పించారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీఎం అన్నారు. ఓటర్ల జాబితా నుంచి అర్హులైన వారి పేర్లను తొలగించే ప్రయత్నాలను తక్షణమే నిలిపివేయాలని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్, ఇండియా కూటమి తమ పోరాటాన్ని కొనసాగిస్తాయని సీఎం స్పష్టం చేశారు.



న్యూఢిల్లీలో ర్యాలీలో పాల్గొన్న సిఎం రేవంత్



సోమవారం సుప్రీం కోర్టుకు బస్సులో వెళ్తున్న కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్ తదితరులు

# సర్‌ను ఆపండి

>> కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధం అయ్యారు. సాయంత్రంలోపు దాఖలుచేసేందుకు వీలుగా రాహుల్‌గాంధీ తన లీగల్‌టీమ్‌ను ముందు పంపించి పిటిషన్ దాఖలుచేయించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సవాలు చేస్తూ పిటిషన్ దాఖలుకు ర్యాలీగా వెళుతున్న ఇండియా కూటమి బృందాన్ని భగవాన్‌పూర్‌వద్ద పోలీసులు అడ్డుకోవడంతో సమయం మించిపోతోందని భావించిననేతలు రాహుల్ న్యాయవాదబృందంతో పిటిషన్ దాఖలుచేయించారు. ఓటర్ల పేర్ల తొలగింపులు, జాబితాల తయారీలో చోటుచేసుకున్నట్లు చెబుతున్న అవకతవకలపై కాంగ్రెస్ న్యాయ బృందం ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ పిటిషన్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, తృణమూల్ కాంగ్రెస్ నేత సౌగతా రాయ్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ ప్రసాద్ యాదవ్ తదితర విపక్ష నాయకులు కూడా భాగస్వాములుగా ఉన్నారు. శివసేన నేత సంజయ్ రౌత్, సీపీఎం నేత ఎం.ఏ. బేబీ, సీపీఐ నేత డి. రాజా, జేఎంఎం నేత మహువా మాఝీ, ఎన్సీపీ (శరద్‌చంద్ర పవార్) నేత సుప్రియా సూలే, ఐయూఎంఎల్ నేత ఈటీ మహమ్మద్ బషీర్ తదితరులు కూడా పిటిషన్‌లో ఉన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను మంగళవారం విచారించనున్నట్లు కాంగ్రెస్‌నేతలు వెల్లడించారు. సోమవారం సాయంత్రంలోగా పిటిషన్ దాఖలైతే మరుసటి రోజు విచారణకు తీసుకుంటామని గతంలో ప్రధాన న్యాయమూర్తి సూచించినట్లు సమాచారం. అయితే, పిటిషన్‌పై విచారణ జరగడం, అందులో చేసిన ఆరోపణలు నిజమని కోర్టు నిర్ధారించడం రెండూ వేర్వేరు విషయాలు. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చే ఆదేశాలు కీలకంగా మారనున్నాయి. సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా, ఓటు చోరీ ఆరోపణలను ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు ఇండియా కూటమి నేతలు సోమవారం ఢిల్లీలో మార్చ్ ఫర్ డెమోక్రసీ పేరుతో ర్యాలీ నిర్వహించారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ఈ ర్యాలీకి నాయకత్వం వహించారు. కాంగ్రెస్ ఎంపీలు ప్రియాంక గాంధీ వాద్రా, శశి థరూర్, సచిన్ పైలట్, ముకుల్ వాస్నిక్‌తో పాటు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక సీఎం డికె శివకుమార్, హిమాచల్‌సిఎం సుఖ్వీందర్ సుఖు, అఖిలేశ్ యాదవ్, తేజస్వీ యాదవ్, సుప్రియా సూలే, సంజయ్ రౌత్, డి. రాజా, దీపాంకర్ భట్టాచార్య తదితర నాయకులు పాల్గొన్నారు. వందలాది మంది మద్దతుదారులు, కార్యకర్తలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత రాజ్యాంగ క్లబ్ వద్ద సమావేశమైన నేతలు, అక్కడి నుంచి బారాఖంబా రోడ్ జంక్షన్ వైపు వెళ్లి సుప్రీంకోర్టు దిశగా ర్యాలీగా బయలుదేరారు. అయితే, భగవాన్ దాస్ రోడ్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్ల దగ్గర ర్యాలీని అడ్డుకున్నారు. ఈ సమయంలో రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్ సహా కొందరు నేతలు వాహనంపైకి ఎక్కి నిరసన తెలిపారు. ర్యాలీకి ముందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రభుత్వం రక్షిస్తోందని ఆరోపించారు. నిరసనలపై ఢిల్లీలో విధించిన ఆంక్షలను కూడా ప్రశ్నించారు. జ్ఞానేశ్ కుమార్ తప్పును అంగీకరించి తన పదవికి రాజీనామా చేసి, ఈ వ్యవహారంలో నిజాలు వెల్లడించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. మా పోరాటం ఆయనపై కాదని ఆయన వెనుక ఉన్న పెద్ద శక్తులపై తమ పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్యానించారు. ఎన్నికల కమిషన్ వ్యవహారాలపై ప్రభుత్వంలోని కొందరు అధికారులు ప్రతిపక్షానికి సమాచారం అందిస్తున్నారని కూడా ఆరోపించారు. ఢిల్లీలో నిరసనలు నిర్వహించే ప్రాంతాల విషయంలోనూ వివాదం నెలకొంది. జంతర్ మంతర్‌ను నిరసనల కోసం గుర్తించిన ప్రదేశాల జాబితా నుంచి తొలగించి, ప్రదర్శనలకు మరో మూడు ప్రదేశాలను గుర్తించినట్లు ఢిల్లీ పోలీసుల చర్యపై విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో సర్ ప్రక్రియ, ఓటర్ల జాబితాల్లో పేర్ల తొలగింపు ఆరోపణలు, ఎన్నికల కమిషన్ బాధ్యతలపై రాజకీయ చర్చ మరింత వేడెక్కింది.

## తెలంగాణ-హిరోషిమా ఆర్థిక బంధం!

>> పెట్టుబడులకు అవకాశాలు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ: పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించి, ఉపాధి అవకాశాలను పెంపొందించడం. డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ కార్యక్రమంలో హిరోషిమా ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పాల్గొనాలని ప్రధాన కార్యదర్శి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలను అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేయడంతో పాటు, జపాన్ సంస్థలతో దీర్ఘకాలిక భాగస్వామ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. తెలంగాణ, హిరోషిమా మధ్య సన్నిహిత సంబంధాలు రెండు ప్రాంతాల ఆర్థిక అభివృద్ధికి, సాంకేతిక సహకారానికి, యువతకు నూతన ఉపాధి అవకాశాల కల్పనకు దోహదపడతాయని ప్రధాన కార్యదర్శి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, టిజిఐఐసి శశాంక, తదితరులు పాల్గొన్నారు.

## దేశమంతా జంతర్ మంతర్!

>> నిర్ణయం పట్ల కాక్రోచ్ జనతా పార్టీ, ఇండియా బ్లాక్ నాయకులు మండి పడ్డారు. అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య హక్కులపై దాడిగా అభివర్ణించారు. ఈ నిర్ణయాన్ని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే ఖండించారు. ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును అణచివేయడానికే ఈ రకమైన చర్యలకు కేంద్రం పాల్పడుతోందని ఆరోపించారు. నిరసనల వేదికను రద్దు చేసినంత మాత్రాన ప్రజల గొంతుకను నొక్కడం సాధ్యం కాదని, ఇకపై దేశమంతా జంతర్ మంతర్‌లా మారుతుందని హెచ్చరించారు. ఇదే అంశంపై సీజేపీ నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా కూడా స్పందించారు. పోలీసుల చర్యను తప్పుపట్టారు. పౌర సమాజం, వివిధ నిరసన సంఘాలతో ఎలాంటి ముందస్తు సంప్రదింపులు జరపకుండానే హోం మంత్రిత్వ శాఖ ఏకపక్షంగా ఈ నిర్ణయం తీసుకుందని సౌరవ్ దాస్ విమర్శించారు. ప్రభుత్వం సూచించిన కొత్త ప్రత్యామ్నాయ ప్రాంతాలు ప్రజలకు అందుబాటులో ఉండవని, ఇటువంటి నిర్ణయాలు పౌరుల భావప్రకటనా స్వేచ్ఛను దెబ్బతీస్తాయని అశుతోష్ రంకా అభిప్రాయపడ్డారు.

## ప్రేమ ప్రజలపై ఏదీ?

>> అన్నారు. ఎల్ నినో ప్రభావంపై ముందుగానే హెచ్చరికలు ఉన్నప్పటికీ, దేవాదుల, కల్వకుర్తి వద్ద నీటిని లిఫ్ట్ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, ఇది కృత్రిమ కరవుకు దారితీసిందని దుయ్యబట్టారు. మద్యం కంపెనీలకు నీటి కొరత రాకూడదని ఎక్సైజ్ మంత్రి వ్యాఖ్యానించడాన్ని ఆయన తప్పుపట్టారు. బీరు ఫ్యాక్టరీలపై ఉన్న ప్రేమ,కోట్ల మంది ప్రజలపై లేదు, లిక్కర్ కంపెనీలకు నీటి కొరత రావొద్దని అబ్కారీ మంత్రి చెబుతున్నారు. తాగునీటిని బీరు కంపెనీలకు ఇస్తోన్న మిమ్మల్ని ఏం చేయాలి అని ధ్వజమెత్తారు. 'చంద్రబాబు నాయుడు కృష్ణానదీ జలాలను 700 కిలోమీటర్లు తీసుకెళ్లి కుప్పంలో తన నియోజకవర్గంలో నీళ్లు పారిస్తున్నడు. మరి అదే కృష్ణాలో నువ్వెందుకు నీళ్లు ఎత్తుతలేవు రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. నువ్వు విడిచిపెడితే చంద్రబాబు ఒడిసి పడ్తున్నడు. 700 కిలోమీటర్ల దూరంలో ఇవాళ కుప్పంలో గళగళా కృష్ణానదీ జలాలుపారుతున్నాయి. కుప్పంలో చంద్రబాబు నాయుడు జలహారతి ఇస్తున్నాడు. అంటే నీ గురువు గారికి గురుదక్షిణ చెల్లిస్తున్నవా..? రేవంత్ రెడ్డి అని ఫైర్ అయ్యారు. నిన్న చంద్రబాబు ట్వీట్.. గోదావరి నుంచి 500 టీఎంసీల నీళ్లు నేను పట్టిసీమ ద్వారా ఇప్పటిదాకా ఎత్తిన అని.. పట్టిసీమ నీళ్లెత్తి కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాలకు, డెల్టాకు ఇవాళ ఏపీ నీళ్లు పారిస్తుంది.. ఎందుకు అక్కడనేమో కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ బంద్ పెడితే.. కిందికెళ్లి ఆయన శ్రీశైలంకెళ్లి వెలిగొండకు తీసుకెళ్తున్నడు. కుప్పం తీసుకుపోతున్నడు అని చెప్పారు. 'ఇక్కడ గోదావరిలో కన్నెపల్లిలో కటుక ఒత్తుమంటే.. నిన్నటిదాకా ఎన్‌డీఎస్‌ఏ పేరు చెప్పి తప్పించుకున్నవ్. దేవాదుల దగ్గర కేసీఆర్ కట్టించిన ప్రాజెక్టు ఉంది.

24 గంటలు మోటార్లు నడపవయా అంటే నేను 8 గంటలే మోటార్లు నడుపుతా అంటడు. నీళ్లు లేక కాదు ఇది.. ఈ ప్రభుత్వం వైఫల్యం వల్ల. చిత్తశుద్ధి లేకపోవడం వల్ల ఇవాళ కరువు పరిస్థితులు ఈ రాష్ట్రంలో ఉన్నాయి' అని విమర్శించారు.

పాలమూరు ద్రోహి రేవంత్ రెడ్డి. పాలమూరులో నువ్వు శ్రీశైలంలో నీళ్లు ఎత్తకపోవడం వల్ల పోతిరెడ్డి పాడు ద్వారా నీళ్లు పోతున్నయి. వెలిగొండకు నీళ్లు పోతున్నయి. కుప్పంకు నీళ్లు పోతున్నయ్.. ఎందుకు 24 గంటలు మోటార్లు నడుపుతలేవు అని ప్రశ్నించారు. ఏపీలో లేని కరువు తెలంగాణలో ఎందుకు ఉంది..? కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకనే ఈరోజు తెలంగాణలో కరువు పరిస్థితులు ఉన్నాయి. తెలంగాణ నుంచి కృష్ణా, గోదావరి నదులు పారుతుంటే రేవంత్ రెడ్డి నీటిని వదిలిపెడుతున్నాడు, చంద్రబాబు ఒడిసిపడుతున్నాడని అన్నారు. ఎల్ నినో ఉందని ముందే తెలిసినా రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు లిఫ్ట్ చేసి పెట్టుకోలేదని ఆరోపించారు. దేవాదుల, కల్వకుర్తిలో నీళ్లు లిఫ్ట్ చేసి ఉంటే కరువే ఉండేది కాదని అన్నారు.



న్యూఢిల్లీలో సోమవారం ఎన్‌హెచ్‌ఎఐ ఛైర్మన్ సంతోష్‌కుమార్‌యాదవ్‌తో సమావేశమైన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

# హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్-65 విస్తరణ పనులను వేగవంతం చేయాలి

### ఎన్‌హెచ్‌ఎఐ ఛైర్మన్ సంతోష్‌కుమార్‌యాదవ్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వినతి

### నవంబరు 11 వరకు టెండర్ల దాఖలుకు గడువు

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** హైదరాబాద్-విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారి65 విస్తరణ పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా ప్రారంభించాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఛైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్‌ను కోరారు. ఈ మేరకు న్యూఢిల్లీలో ఎన్‌హెచ్‌ఏఐ ఛైర్మన్‌తో పాటు సభ్యులు (ప్రాజెక్టులు) విప్నేష్ శర్మతో మంత్రి సమావేశమై ఈ కీలక ప్రాజెక్టుపై చర్చించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అత్యంత కీలకమైన ఈ జాతీయ రహదారిపై రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ, తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ రహదారి విస్తరణకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను కోరారు. విజయవాడ నాలుగు లేన్ల నుంచి ఆరు లేన్లు+2సర్వీస్ రోడ్ల విస్తరణ ప్రతిపాదిత ప్రాజెక్టులో ఇరువైపులా సర్వీస్ రోడ్లు, నియంత్రిత ప్రవేశ సౌకర్యాలను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు.

ఈ విస్తరణ పూర్తయితే వాహనాల రాకపోకలు సులభతరమవడంతో పాటు ట్రాఫిక్ రద్దీ తగ్గి, ప్రయాణ సమయం ఆదా అవుతుందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రమాదాల నివారణకు, రహదారి భద్రతను మెరుగుపరచడానికి ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని వివరించారు. 2027 జనవరి నాటికి పనులు ప్రారంభిస్తామనీ తెలిపారు. ఎన్‌హెచ్‌ఏఐ ఛైర్మన్ ఛైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ స్పందిస్తూ ఈ ప్రాజెక్టుకు సంబంధించి టెండర్ల దాఖలుకు 2026 నవంబర్ 11 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు.

2027 జనవరి నాటికి పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ప్రాణాల భద్రతే ప్రాధాన్యంహైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వేలాది మంది ప్రయాణికులు, వాహనదారులకు నిత్యం కీలక రవాణా మార్గంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ మార్గంలో ప్రమాదాలను తగ్గించి, ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యంగా విస్తరణ పనులను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని స్పష్టం చేశారు. రహదారుల అభివృద్ధి అంటే కేవలం ప్రయాణ సౌకర్యాలను పెంచడమే కాకుండా, ప్రజల ప్రాణాలను కాపాడటం, వాణిజ్య కార్యకలాపాలకు ఊతమివ్వడం, తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా అనుసంధానాన్ని బలోపేతం చేయడం కూడా అని మంత్రి పేర్కొన్నారు. ఎన్‌హెచ్65 విస్తరణ పనులు సకాలంలో పూర్తయ్యేలా కేంద్ర సంస్థలతో నిరంతరం సమన్వయం చేసుకుంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు.

# ఎపిపి ఫలితాల విడుదల

### పోలీసు వెబ్‌సైట్‌లో వివరాలు

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** గత యేడాది పోలీసు నియామక మండలి చేబట్టిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎపిపి) పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు నియామక మండలి ఛైర్మన్ శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసు వెబ్‌సైట్‌లో ఫలితాలతో పాటు అభ్యర్థులు సాధించిన మార్కులను అందుబాటులో వుంచారు. అభ్యర్థులు తమ ఓఎంఆర్ షీట్లతో పాటు డిజిటల్ కాపీలను వెబ్‌సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకునే అవకాశం నియామక మండలి కల్పించింది.

కాగా పేపర్ 1, పేపర్ 2 విభాగాల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 17వ తేదీన నధ్రువపత్రాల పరిశీలన వుంటుంది. పోలీసు వెబ్‌సైట్ నుంచి కాల్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఇందులోనే ధృవపత్రాల పరిశీలన వేదికల వివరాలు వుంటాయని నియామక మండలి ఛైర్మన్ తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లతోపాటు రెండు సెట్ల జిరాక్స్ పత్రాలను సమర్పించాల్సి వుంటుందని ఆయన తెలిపారు.

# ఖరీఫ్ నష్టం రూ.20 వేల కోట్లు

### రాష్ట్రంలో భారీగా దెబ్బతిన్న వరి, పత్తి పంటలు

### 25 శాతం తగ్గిన సాగు విస్తీర్ణం

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితు నేపథ్యంతో లోటు వర్షపాతం కారణంగా ఖరీఫ్ (వానాకాలం) సీజనులో తెలంగాణలో ప్రధానంగా వరి, పత్తి తదితర పంటలకు రూ.20 వేల కోట్ల మేర నష్టం సంభవించింది. ఎల్‌నినో అంచనావల ప్రకారం నీటి లభ్యతను బట్టి ఖరీఫ్, రబీ వరి పంటల సంయుక్త ఉత్పత్తి 198 నుండి 219 లక్షల టన్నులుగా ఉంటుందని అంచనా వేసింది. ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణంలో 25 శాతం మేర తగ్గుదలతో పాటు, తక్కువ వర్షపాతం కారణంగా ప్రస్తుతం సాగు చేసిన పంటలు, అలాగే వర్షాభావ పరిస్థితులతో పంటలు వేయకుండా వదలివేసిన విస్తీర్ణం తదితర వాటిని పరిగణనలోకి తీసుకుని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సాగు నష్టాలను అంచనా వేసింది. తెలంగాణలో అత్యధిక ప్రాంతాల్లో ఎక్కువ మంది రైతులు పత్తి పండిస్తుండటంతో ఈ పంటలో నష్టాలు అధికంగా ఉన్నట్లు నివేదికలో పేర్కొంది. అలాగే సాధారణంగా రబీ (యాసంగి) సీజనులో సాధారణ విస్తీర్ణం 1.3 కోట్ల ఎకరాల నుండి 70 లక్షల ఎకరాలకు పడిపోయే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ నెలలో ఈశాన్య రుతుపవనాలపై ఆధారడి ఉండే రబీ సీజనులో కూడా వర్షపాతానికి సంబంధించి ఆందోళనలు కొనసాగున్నందున, సాగు విస్తీర్ణం సాధారణ స్థాయి నుండి దాదాపు సగానికి తగ్గుతుందని వెల్లడించింది.

రబీ సీజనులో సాధారణ విస్తీర్ణం దాదాపు 1.3 కోట్ల ఎకరాల్లో సుమారు 60 లక్షల ఎకరాల్లో వరి సాగు ఉంటుందని లెక్కలు వేసింది. ఈ విధంగా వరి సాగు విస్తీర్ణం కనీసం 40 శాతం తగ్గుతుందని అంచనాలు తెలిపాయి. గత సీజన్లలో కూడా ఇలాంటి పరిస్థితులే ఏర్పడగా, అయితే ఈ సారి పంటల వైవిధ్యం దాదాపు 30 శాతానికి చేరుకునే ప్రమాదం ఉంది. కాగా తగినంత నీటి లభ్యత భరోసా లేకుండా పంటలు వేయడం కంటే నష్టాన్ని తగ్గించుకునే విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులకు స్పష్టం చేసింది. విత్తనాలు, ఎరువులు, ఇతర సాగు సాధనాలపై పెట్టుబడి పెట్టే ముందు రైతులు నేలలో అందుబాటులో ఉన్న తేమను, నీటి వనరులను అంచనా వేసుకోవాల్సి ఉంటుందని చెబుతోంది. రైతులు ఒక పంటలో పెట్టుబడి పెట్టే ముందు, దాన్ని విజయవంతంగా పండించగలరా, అది రాబడిని ఇస్తుందసా అనే అంచనాలు వేసుకోవడం తప్పనిసరని సూచించింది. తక్కువ వనరులు అవసరమై, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పప్పుధాన్యాలు, పచ్చిరొట్ట పంటలను సాగు చేయాలిన రైతులకు సూచించింది. తగినంత వర్షపాతం లేదా నీటిపారుదల లేకుండా నీటి ఎక్కువగా వినియోగించే పంటలను వేయం వల్ల రైతులకు అదనపు ఖర్చు కావడంతో పాటు, పెట్టిన పెట్టుబడి తిరిగి రాబట్టుకునే అవకాశాలు కూడా తగ్గిపోతుందనే అంచనాలు వెల్లడించింది.

# పోలీసింగ్‌లోను మార్పులు రావాలి

### డిఎస్పీల దీక్షాంత్ పెరేడ్‌లో డిజిపి ఆనంద్

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** తెలంగాణ పోలీసు అకాడమీలో తొలిసారిగా 112 మంది డిఎస్పిల దీక్షాంత్ పెరేడ్ సోమవారం ఘనంగా జరిగింది. డిజిపి సి.వి.ఆనంద్ దీక్షాంత్ పెరేడ్‌కు ముఖ్య అతిథిగా హాజరై యువఅధికారుల నుంచి గౌరవవందనం స్వీకరించి అనేక అంశాలపై వారికి దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో నేరాల స్వరూపం పూర్తిగా మారిపోయిందని, ఈ నేపథ్యంలో పోలీసింగ్ కూడా మారాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసు ఉద్యోగం అంటే ఆషామాషీ వ్యవహారం కాదని, యూనీఫాం ధరించడం ఎంతో అదృష్టంతో కూడుకున్నదని డిజిపి తెలిపారు. నాలుగు కోట్ల జనాభా కలిగిన తెలంగాణలో 90 వేల మందికి పోలీసు యూనీఫాం ధరించే అవకాశం లభించిందని, ఇది కేవలం 0.3 శాతమే అన్న విషయం గుర్తుంచు కోవాలన్నారు. ఉద్యోగ ధర్మంలో పోలీసులు ఏనాడు నైతిక విలువలకు దూరం కాకూడదని కోరారు. తెలంగాణ ఏర్పాటయ్యాక తొలిసారిగా 112 మంది డిఎస్‌పిల పాసింగ్ పెరేడ్ జ రగడం గొప్పవిషయన్నారు. వీరికి డిఎస్‌పిలకు యేడాదిపాటు అనేక అంశాలలో శిక్షణ ఇచ్చి ఉత్తములుగా తీర్చిదిద్దిన అకాడమీ అధికారులను డిజిపి అభినందించారు. దీక్షాంత్ పెరేడ్ రోజున చేసే ప్రతిజ్ఞ యువ పోలీసులు తమ సర్వీసు ముగిసే వరకు మరువకూడదని ఆనంద్ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణలో అధునాతన టెక్నాలజీని వాడాలని ఆయన హితవు పలికారు. నేరాల తీరు మారిందని, పోలీసులు కూడా తమ పోలీసింగ్‌ను మార్చుకుని ముందుకు సాగాలని ఆయన కోరారు. ఈ క్రమంలోనే పోలీసు శాఖలో సంస్థాగత మార్పులు చేబట్టామని, గ్రేహౌండ్స్ వంటి విభాగాలను పునర్వ్యవస్థీకరించడంతో పాటు ఈగల్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, టిజి ఫాస్ట్, టిజి స్పార్క్ వంటి విభాగాలను బలోపేతం చేశామని డిజిపి తెలిపారు. పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ అకాడమీలో తొలిసారిగా 112 మంది యువ అధికారులు శిక్షణ పూర్తి చేసుకోవడం గొప్పగా ఉందని తెలిపారు. ఇందులో 38 మంది మహిళా అధికారులుండడం సంతోషించదగ్గ అంశ మన్నారు. శిక్షణలో ఉండగానే ఇద్దరు యుపిఎస్‌సి పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు అందుకున్నారని ఆమె అన్నా రు. కాగా పెరేడ్ కమాండర్‌గా నేహా అగర్వాల్ వ్యవహరించగా ఆమెకు సిఎం రివాల్వర్‌తో పాటు తొమ్మిది విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచినందుకు ట్రోఫీలను డిజిపి ఆనంద్ అందజేశారు.



పోలీసు అకాడెమీలో సోమవారం జరిగిన దీక్షాంత్ పెరేడ్‌లో యువ అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డిజిపి సి.వి.ఆనంద్

# అంతర్జాతీయ వేదికపై సిరిసిల్ల నేతన్న కళానైపుణ్యం

### దుబాయ్ పాలక కుటుంబ చిత్రాలతో ప్రత్యేకం చేనేత శాలువా

### 16వ బతుకమ్మ వేడుకల్లో ఘనంగా ఆవిష్కరణ

**సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త:** తెలంగాణ చేనేత కళా వైభవానికి అంతర్జాతీయ స్థాయిలో విశేష గుర్తింపు లభించింది. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రముఖ చేనేత కళాకారుడు వెల్దీ హరిప్రసాద్ సంప్రదాయ మగ్గంపై అద్భుతంగా రూపొందించిన ప్రత్యేక చేనేత శాలువా దుబాయ్ వేదికగా సందడి చేసింది. దుబాయ్ పాలక కుటుంబ సభ్యుల చిత్రాలతో కళాత్మకంగా రూపుదిద్దుకున్న ఈ శాలువాను ఈ నెల 11న దుబాయ్‌లో నిర్వహించిన 16వ బతుకమ్మ వేడుకలు-2026 సందర్భంగా ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరించారు. సిరిసిల్ల నేత కార్మికుల సృజనాత్మకతను, గల్ఫ్ ప్రవాస తెలంగాణవాసుల సాంస్కృతిక అనుబంధాన్ని, యూఏఈ పాలక వర్గంపై ఉన్న గౌరవాభిమానాలను చాటేలా ఈ శాలువాను రూపొందించడం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. సాదారణంగా వస్త్రాలు నేయడమే శ్రమతో కూడుకున్న పని కాగా మగ్గంపై చిత్రాలు రూపుదిద్దుకునేలా శాలువాను నేయడం నేతన్న నైపుణ్యానికి, ఓర్పుకు తార్కాణంగా నిలిచింది. సిరిసిల్ల నేతన్నలు మగ్గంపై చూపుతున్న వినూత్న ప్రయోగాల్లో బాగంగానే హరిప్రసాద్ ఈ కళాకాండాన్ని మలచగా అంతర్జాతీయ వేదికపై లభించిన ప్రాధాన్యం స్తానిక కళాకారుల ప్రతిభకు గుర్తింపుగా నిలిచింది. దుబాయ్‌లోని భారత కాన్సుల్ జనరల్ డాక్టర్ ఇమ్మడి విష్ణువర్ధన్ రెడ్డి ఈ వేడుకలకు ముఖ్య అతిథి గా హాజరయ్యారు. తెలంగాణ మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, జీవన్ రెడ్డి, బిగాల గణేష్ గుప్తా, సురేందర్ , షకీల్ అహ్మద్‌లతోపాటు వేలాది గల్ఫ్ సంఘాల ప్రతినిధులు, ఈసిటిపి వ్యవస్థాపక అద్యక్షుడు పిచ్చిర కిరణ్ కుమార్, అద్యక్షుడు జగదీష్ రావు తదితరులు పాల్గొని ఈ శాలువను ఆవిష్కరించారు.




సంప్రదాయ మగ్గంపై అద్భుతంగా రూపొందించిన ప్రత్యేక చేనేత శాలువాను దుబాయ్‌లో నిర్వహించిన 16వ బతుకమ్మ వేడుకల్లో ఆవిష్కరించిన దృశ్యం

**దుబాయ్ పాలక కుటుంబానికి బహుమతిగా ఇచ్చేందుకు యత్నాలు**

తమకు ఉపాధి కల్పిస్తున్న యూఏఈ దేశం పట్ల, అక్కడి పాలక వ్యవస్థ పట్ల కృతజ్ఞాతాపూర్వక గౌరవాన్ని చాటడమే ఈ శాలువా రూపకల్పన ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈటిసిపి ప్రతినిధులు ఈ ప్రత్యేక శాలువాను దుబాయ్ పాలక కుటుంబానికి అధికారికంగా బహుమతిగా అందజేసేందుకు తగిన ప్రయత్నాలు చేస్తున్నారు.

# ఒఆర్ఆర్‌పై ఘోర ప్రమాదం

### ప్రముఖ మిమిక్రీ కళాకారుడు సత్యనారాయణ దుర్మరణం

### ఒయు మార్చురీకి భౌతికకాయం తరలింపు

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** 15 యేళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో రెండు వేలకుపైగా ప్రదర్శనలు ఇచ్చి ప్రముఖ మిమిక్రీ, వెంట్రిలాక్విజం, మ్యాజిక్ కళాకారుడిగా, ఆర్గనైజర్‌గా సుపరిచితులైన సత్య నారాయణ (40) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. గత రాత్రి బతుకమ్మ ఈవెంట్‌ను విజయవంతంగా ముగించుకుని తన కారులో తిరిగి వస్తుండగా ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఔటర్ రింగ్‌రోడ్డుపై హకీంపేట నుంచి హయత్‌నగర్ వైపు వెళ్తుండగా.. మార్గమధ్యంలో వెనుక నుంచి వచ్చిన ఒక గుర్తుతెలియని వాహనం సత్యనారాయణ కారును వేగంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ అకస్మాత్తు స్పందనతో కారు అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో సత్యనారా యణకు తీవ్రగాయాలయ్యాయి. రాత్రి సమయం కావడంతో అటుగా వెళ్లే వారు ఎవరూ వెంటనే గమనించకపోవడం, తీవ్ర రక్తస్రావం కావడం వల్ల ఆయన అక్కడికక్కడే తుదిశ్వాస విడిచారు. కొంతసేపటి తర్వాత ఆ మార్గంలో వెళ్తున్న వాహనదారులు గుర్తించి పోలీసులకు, అంబులెన్స్‌కు సమాచారం అందించారు. పోలీసులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరు కునేసరికి రాత్రి 1:30 గంట అయింది. కారు నుంచి సత్యనారాయణను బయటకుతీసి పరిశీలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాత్రి 1:30 నుంచి 2:30 గంటల మధ్యలో క్లూస్ టీమ్ పోలీసులు ప్రమాదస్థలాన్ని పరిశీలించి, ఘటనకు సంబంధించిన వివరా లను సేకరించారు.

**ఉస్మానియా మార్చురీకి భౌతికకాయం**

ప్రస్తుతానికి సత్యనారాయణ భౌతికకాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. విదేశాల్లో ఉంటున్న ఆయన అన్నయ్య స్వగ్రామానికి లేదా ఇల్లు చేరుకోవడానికి సమయం పట్టే అవ కాశం ఉండటంతో, కుటుంబసభ్యుల నిర్ణయం మేరకు అంత్యక్రియలను రేపు నిర్వహించనున్నారు.

**కళారంగానికి తీరనిలోటు**

15 సంవత్సరాలుగా మిమిక్రీ, మ్యాజిక్ కళాకారుడిగా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తిరుగులేని గుర్తింపు తెచ్చుకున్న సత్యనారాయణ.. అనేక అవార్డులు, రివార్డులను గెలుచుకున్నారు. ఆయన అకస్మిక మృతి పట్ల పలువురు కళాకారులు, సాంస్కృతిక సంఘాల ప్రతినిధులు తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కళాకారులు సామల వేణు, మల్లం రమేష్ ప్రగాఢసానుభూతి తెలిపారు.

# వైఎస్ వివేకా హత్య కేసులో కొనసాగుతున్న ఇడి దర్యాప్తు

### రూ.40 కోట్ల చెల్లింపులో శివశంకర్‌రెడ్డి సుదీర్ఘ విచారణ

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) విచారణ కొనసాగుతోంది. వివేకా హత్యకు 40 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగినట్లు నిర్ధా రణ కావడంతో మనీలాండరింగ్ కోణంలో దీనిపై ఈడీ వేరుగా విచారిస్తుండడం తెలిసిందే. ఈ కేసులో నిందితులెవరు...? ఎందుకు ఈ నేరాని కి పాల్పడ్డారనే అంశాలను సిబిఐ విచారిస్తుండగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ సాగుతోంది. ఇందుకు సంబంధించి 20 రోజుల వ్య వధిలో ఎ1 ముద్దాయి ఎర్ర గంగిరెడ్డి, ఎ2గా వున్న సునీల్ యాదవ్, అప్రూవర్‌గా మారిన దస్తగిరిని ఈడీ అధికారులు పలుమార్లు విచారించ గా సోమవారం నాడు ఎ5గా వున్న దేవిరెడ్డి శివశంకర్ రెడ్డిని సుధీర్ఘంగా విచా రించి 40 కోట్ల రూపాయల లావాదేవీల గురించి భిన్న కోణాల్లో ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. బషీర్‌బాగ్ లోని ఇడఇ ఈడీ కార్యాలయంలో ఈ విచారణ సాగింది. వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితులకు 40 కోట్ల రూపాయలను చెల్లించినట్లు వెలుగులోకి రావడంతో ఈ డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయి...? ఎవరు సమకూర్చారు...? ఎందుకు ఇ చ్చారు...? అనే అంశాలపై ఈడీ అధికారులు శివశంకర్ రెడ్డిని ప్రశ్నించారు. 2019లో జరిగిన వివేకానంద రెడ్డి హత్యకు సంబంధించి 40 కో ట్ల రూపాయల ఫండింగ్ వ్యవహారాలు, ఫోన్ కాల్స్, డిజిటల్ ఆధారాలపై దృష్టి సారించిన ఈడీ అధికారులు ఇతర నిందితులను విచారించిన ట్లుగానే శివశంకర్ రెడ్డిని ప్రశ్నించినట్లుగా సమాచారం. ఈ విచారణలో సునీల్ యాదవ్ సహా ఇతర నిందితులతో జరిపిన ఫోన్ సంభాషణలపై శివశంకర్‌రెడ్డిని ప్రశ్నంచినట్లు తెలిసింది.

వీరితో మాట్లాడిన కాల్ డేటా రికార్డును అతని ముందు వుంచి వివరాలను రాబట్టినట్లు తెలిసింది. సాంకేతిక సాక్ష్యాలుగా వున్న గూగుల్ టెక్ అవుట్‌ను కూడా అతని ముందు ఈడీ అధికారులు వుంచినట్లు తెలిసింది. శివశంకర్ రెడ్డి బ్యాంకు లావాదేవీలను 2019 నుంచి ఈడీ అధికారులు పరిశీలించి అనుమానిత వ్యవహారాలపై ప్రశ్నించినట్లు తెలిసింది. వివేకానంద రెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరికి కోటి రూపాయలు ఇచ్చిన విషయం గురించి ఈడీ అధికారులు శివశంకర్ రెడ్డిని ప్రశ్నించినట్లు తెలిసింది. వివేకా నంద రెడ్డి హత్య వెనుక గల ఆర్థిక లావాదేవీల నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు ఈడీ మరింత లోతుగా విచారించేందుకు ఈ కేసులో నిందితులుగా వున్న వారిని వరుసగా విచారిస్తోంది.

ఇందుకు సంబంధించి కడప ఎంపి అవినాష్ రెడ్డితో పాటు ఆయన తండ్రి భాస్కర్ రెడ్డి, దేవిరెడ్డి శివశం కర్ రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్ ఇళ్లలో ఈడీ అధికారులు ఇటీవలే ఏకకాలంలో సోదాలు నిర్వహించి కీలక పత్రాలు జప్తు చేయడం తె లిసిందే. హైదరాబాద్‌లోని అవినాష్ రెడ్డి ఇంట్లోనూ ఈ సోదాలు జరిగాయి. కాగా ఇదే కేసులో కడప ఎంపి అవినాష్‌రెడ్డిని ఈ నెల 14న ఇడి విచారించనున్నది.

### ఫార్ములా ఇ కార్ రేస్ కేసు

# ఎసిబి కోర్టులో కెటిఆర్ డిశ్చార్జ్ పిటిషన్

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా ఈ కార్ రేస్ కేసుకు సంబంధించి మరో కీలక పరిణామం చో టుచేసుకుంది. ఈ కేసు విచారణలో భాగంగా ఏసీబీ అధికారులు కోర్టుకు ఛార్జిషీట్ దాఖలు చేసి ఇతరత్రా అన్ని ఆధారాలు సమర్పించి, దర్యాప్తును వేగవంతం చేస్తున్న తరుణంలో ఇందులో మొదటి ముద్దాయిగా వున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ నాంపల్లి ఏసీబీ కోర్టులో సోమవారం నాడు డిశ్చార్జి పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ఏసీబీ అధికారులు దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో తన పేరును తొలగించాలని కెటిఆర్ తన పిటిషన్‌లో కోరారు.

ఫార్ములా ఇ కార్ రేస్ కేసు విచారణ ఏకపక్షంగా వుందని, ఈ క్రమంలో నిందితుల జాబితా నుంచి తన పేరు ను తొలగించాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో కెటిఆర్ ఎ1గా వుండగా సీనియర్ ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్ ఎ2గానూ, హెచ్‌ఎండిఎ మాజీ సీఈ బిఎల్‌ఎన్ రెడ్డి ఎ3గానూ మరికొందరు ఇతర నిందితులుగానూ వుండడం తెలిసిందే. కాగా కెటిఆర్ దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌ను ఏసీబీ కోర్టు విచారణకు స్వీకరించింది. నవంబరు నెలలో దీనిపై విచారణ జరిగే వీలుందని తెలిసింది.

# రిజర్వేషన్లతో సంబంధం లేకుండా మహిళలకు 50 శాతం సీట్లు

### బతుకమ్మ వేడుకల్లో టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** ఇతర రాజకీయ పార్టీలు ఎలా ఉన్నా.. రిజర్వేషన్లు అమలు చేసినా, చేయకున్నా తమ పార్టీ రిజర్వేషన్లతో సంబంధం లేకుండా 50 శాతం సీట్లను మహిళలకు ఇస్తుందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఈ మేరకు సోమవారం బంజారా హిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన బతు కమ్మ వేడుకల్లో పాల్గొని మహిళలు, కార్యకర్తలతో ఆడిపాడారు సందర్భంగా బతుకమ్మ విశిష్టత, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో ఈ పండుగ ద్వారా మహిళలను ఒక్కతాటిపైకి తీసుకురావడానికి ఎంతలా కృషి చేశామో వివరించారు. అనంతరం గౌరమ్మకు పూజలు చేసి మహిళా నాయకులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈసందర్భంగా కవిత మాట్లా డుతూ బహుజనుల కోసం పాటు పడుతున్న తనను ఆశీర్వదించాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మహిళా నాయకత్వాన్ని పెంపొందించడానికి తాను కృషి చేస్తున్నానని అన్నారు. రాజకీయ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత పార్టీ ఆఫీస్ లో బతుకమ్మ సంబురాలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రపంచంలో ఎవరికీ లేని అత్యంత విశిష్టమైన బతుకమ్మ పండుగ మన తెలంగాణ సొంతమని అన్నారు. ప్రపంచానికి చాటేలా ఈ పండుగను జరుపు కుందామని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ బతుకమ్మ పాటలు నేర్చుకొని భవిష్యత్ తరాలకు అందజేయాలని సూచించారు. ఆరోజు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి బతుకమ్మ ప్రతీకగా నిలిచిందని గుర్తు చేశారు. గౌరమ్మ తల్లి ఆశీర్వాదంతో తెలంగాణ ఆడబిడ్డలందరూ ఆనందంగా ఉండాలని ఆకాంక్షి ంచారు.



సోమవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

# థర్మల్ ప్లాంట్లకు బొగ్గు సరఫరా వేగవంతం

### రోజుకు సగటున 456 రేకుల సప్లై

### విద్యుదుత్పత్తి యూనిట్లకు పడిపోయిన నిల్వలు

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** విద్యుత్ ప్లాంట్ల వద్ద బొగ్గు నిల్వలు తక్కువ స్థాయికి పడిపోవడంతో భారతదేశంలో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం పెరుగుతోంది. మరోపక్క ఎల్‌నినో ప్రభావంతో వివిధ రాష్ట్రాల్లో విద్యుత్‌కు డిమాండ్ పెరుగుతున్న దృష్ట్యా ప్లాంట్లు నిర్దేశించిన ప్రామాణిక నిల్వ పరిమితి కంటే తక్కువ నిల్వను కలిగి ఉన్నాయి. ఈ నేపథ్యంలో బొగ్గు సరఫరాను వేగవంతం చేయాలని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ చర్యలు చేపట్టింది. సంబంధిత అధికారవర్గాల వివరాలు ప్రకారం వాస్తవ ఇంధన కొరత లేదా ఉత్పత్తి నష్టం సంభవించే ముప్పు ముంచుకొస్తున్న దరిమిలా దాన్ని అధిగమించేందుకు చర్యలు చేపట్టింది. సెప్టెంబర్ నెలలో సరఫరాలు అత్యంత కనిష్ట స్థాయికి పడిపోయినప్పటి నుండి వచ్చిన మెరుగుదలతో పాటు, బొగ్గు నిల్వల పరిస్థితిని కూడా పరిగణనలోకి తీసుకుని విద్యుత్ రంగానికి రోజువారీ సరఫరాలు పెంచుతోంది. సెప్టెంబర్ కనిష్ట స్థాయి నుండి సుమారు 36 శాతం పెరగ్గా, ఈ నెలలో సగటున సెప్టెంబర్ కంటే 9 శాతం అధికంగా ఉన్నాయి. నిల్వలు తరిగిపోయే రేటు కూడా గణనీయంగా తగ్గిం. దీనికి అనుగుణంగా రైలు లోడింగ్ కూడా యుద్ధప్రాతిపదికన జరుగుతోంది. దీంతో ఈ నెలలో రోజుకు సగటున 465 రేకులకు పైగా లోడ్ అవ్వగా, వరుసగా మూడు రోజుల పాటు 470 రేకుల లక్ష్యాన్ని సాధించినట్లు బొగ్గు మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించారు. రోడ్డుతో సహా ఇతర రవాణా మార్గాల ద్వారా కూడా సరఫరాలు మెరుగుపడ్డాయి. స్టాక్ తరుగుదల గణనీయంగా మందగించింది, రోజువారీ తగ్గుదల సెప్టెంబర్‌లో 0.243 మెట్రిక్ టన్నుల నుండి ఈ నెలలో అది 0.116 మెట్రిక్ టన్నులకు సగానికంటే ఎక్కువగా తగ్గింది. అందువల్ల థర్మల్ కేంద్రాల్లో బొగ్గు కొరత లేకుండా పరిస్థితి స్థిరపడుతోందని కేంద్రం చెబుతోంది. మరోపక్క తగినంత సరఫరా, నిరంతరాయ విద్యుత్ ఉత్పత్తిని నిర్ధారించడానికి, అవసరాన్ని బట్టి బొగ్గును ప్రమాదంలో ఉన్న స్టేషన్లకు పునఃపంపిణీ చేస్తూ, క్లిష్టమైన నిల్వలు ఉన్న ప్లాంట్ల పెరుగుదలను నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించింది. రుతుపవనాలు తగ్గుముఖం పడుతున్నందున ఈ నెల మధ్య నాటికి గరిష్ట డిమాండ్ తగ్గుతుందని అంచనా వేస్తోంది, రోజుకు 465-475 రేకుల నిరంతర లోడింగ్ మరింత స్థిరీకరణకు తోడ్పడుతుంది. ఇది పండుగ, శీతాకాలం మరియు తదుపరి వేసవి డిమాండ్ కాలాలకు ముందు నిల్వలను తిరిగి నిర్మించుకోవడానికి వీలు కల్పిస్తోంది. తద్వారా క్లిష్టమైన వర్గంలోని ప్లాంట్ల సంఖ్యను తగ్గిస్తుందని కేంద్రం స్పష్టం చేసింది.

# నవరాత్రి బ్రహ్మోత్సవాన బంగారుతిరుచ్చిపై భగవంతుడు

**తిరుమల, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరు మల శ్రీవేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మో త్సవాలు అంగరంగవైభవంగా సోమవారం ఉద యం మొదలయ్యాయి. ఉదయం ఆలయంలో నిత్యకైంకర్యాలు ముగించుకున్న శ్రీదేవిభూదేవిమ లయప్పస్వామి బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాఢవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శన మిచ్చారు. భక్తులను కటాక్షించారు. సాయంత్రం 6గంటల నుండి 7గంటల వరకు ఊంజల్‌సేవ జరిగింది. బ్రహ్మోత్సవ శోభ ఉట్టిపడేలా వి ద్యు త్‌దీపాలంకరణలు, పుష్పాలంకరణలు టిటిడి విస్తృ తంగా చేపట్టింది. ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర దంపతులు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఎస్‌విబిసి ఛైర్మన్ బి.శ్రీధర్‌వర్మ, బోర్డు సభ్యులు శాం తారామ్, జ్యోతుల నెహ్రూ, ఆలయ డిప్యూటీ ఇ ఒ భయ్యాల భాస్కర్, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి, అర్చకులు పాల్గొన్నారు.

వార్త

మహాత్ములు సంపద కలిగినప్పుడు వికసించిన తామరపువ్వులా ఉంటారు. ఆపదలను ఎదుర్కొనేటప్పుడు పెద్ద గండశిలవలె ధైర్యం చెడక ఉంటారు.

- భర్తృహరి

# 'జెన్‌జీ' మారుతం!

పిచ్చుక మీద బ్రహ్మాస్త్రమా? అనే ధోరణిలో సుప్రీంకోర్టు ధర్మాసనం క్రాకోచ్ జనతాపార్టీ, కాంగ్రెస్ ఆందోళనలపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును తప్పు పట్టింది. శుక్రవారం 'ఈగను చంపడానికి సుత్తిని ఉపయోగించకూడదని సుప్రీం ప్రభుత్వ చర్యలను ఎద్దేవా చేస్తూ మందలించింది. దేశ రాజధాని ఢిల్లీలో శనివారం సిఇసి రాజీనామా కోరుతూ వివిధ వర్గాలు, పార్టీల నేతృత్వంలో జరిగిన నిరసన సభలతో, ప్రదర్శనలతో న్యూఢిల్లీ అట్టుడికిపోయిన సంఘటన గురించి సుప్రీంకోర్టు ధర్మాసనం మండిపడింది. మెట్రోస్టేషననమూసివేత కోర్టు ధిక్కారణే అని ధర్మాసనం చెప్పింది. సిజెపి ఆందోళనలతో మెట్రో సర్వీసు, మరికొన్ని రైలు సర్వీసులను రద్దు చేయడంతో దేశ ప్రజలంతా దృష్టి అటువైపు మళ్లింది. ఇందులో ఉద్యమంతో కానీ ప్రభుత్వ నిర్ణయాలతో ఏమాత్రం సంబంధం లేని ఢిల్లీ ప్రజలు బాగా ఇబ్బంది పడ్డారు. ఈ నిరసన ప్రకంపనలు దేశవ్యాప్తంగా మిన్నుముట్టాయి. లక్షలాది మంది నిరసన కారులను మార్గమధ్యంలోనే అడ్డగించి అదుపులోకి తీసుకున్నారు. సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అశుతోష్ రాంకాలను అదుపులోకి తీసుకున్నారు. దాదాపు రాజధాని నగరం దిగ్బంధానికి గురైంది. ఒక రాజ్యాంగ అధిపతి ఏకపక్ష నిర్ణయాలకు, ఓటు హక్కుపై గొంతెత్తిన విపక్షాలు, విద్యార్థులు తదితర యువత మధ్య సాగుతున్న 'నిరసన ఘోష' రాజకీయ ప్రత్యర్థుల మధ్య జరిగే ఎత్తులు పై ఎత్తుల స్థాయిలో సాగుతోంది. నిన్నగాకమొన్న సిఇసికి అనుకూలంగా పూర్వ న్యాయమూర్తులు, తాజాగా మాజీ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులువత్తాసు పలికారు. సాధారణంగా 'ఓటు హక్కు' అంశంపై కన్నా సిఇసి హోదాలో ఉన్న జ్ఞానేష్‌కుమార్ వ్యక్తిగత హోదాకే వారి మద్దతు ఇచ్చినట్లు అనిపిస్తోంది. 'ఓటు హక్కు' కోల్పోయిన వారి విషయంలో కూడా వారి మద్దతు అవసరముంది. ఒకప్రక్క ప్రధాని నరేంద్రమోడీ సైతం ప్రపంచానికి ప్రస్తుతం ఎంతో అవసరాలను అందించేశక్తి సామర్థ్యాలు 'జెన్‌జీ' యువతకే ఉందంటూనే మరోపక్క వారి మీద దాష్టీకాలు జరిగినా నోరు మెదపడం లేదనే అపప్రధనెదుర్కొంటున్నారు. చెప్పాలంటే ప్రశ్నించే హక్కును కాలరాస్తున్నారా అని అనిపిస్తోంది. వీటన్నిటినీ చూస్తే 'జెన్‌జీ' ఏ పేరున పిలిచినా ఎక్కడైనా యువతరానిదే పెచేయి అనే పరిస్థితులను పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఒకసారి చేపట్టిన తొలినాటి ఉద్యమంలో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ రోజున కూడా 'జెన్‌జీ' ఉద్యమాన్ని తక్కువ అంచనా వేయడం వలనే పరిస్థితులు చేతులు దాటిపోతున్న పరిస్థితుల్లో ప్రభుత్వం లొంగక తప్పలేదు. తదుపరి జార్ఖండ్ ప్రభుత్వంపై కూడా విద్యార్థిలోకం ధ్వజమెత్తింది. సాధించింది. ప్రభుత్వాలు తమకున్న ఆధిపత్య ధోరణిలో ఎలాపడితే అలా కార్యాచరణ చేపడితే తాము కూడా అదే దారిలో బీష్మించుకు కూర్చోగలమని, ఉద్యమించగలనని యువత తేల్చి చెప్పింది. ఇప్పుడు 'జెన్‌జీ' మరో ఉద్యమాన్ని నెత్తిన వేసుకుంది. ఆది నుంచి 'సర్' ఉద్యమాన్ని నిలబెట్టిందీ, పట్టువిడుపులు లేకుండా ముందుకురుకుతున్న ప్రధాన విపక్షం కాంగ్రెస్‌కు తోడుగా ఇతర విపక్షాలు, నీడగా జెన్‌జీ యువత, విద్యార్థిలోకం కూడా ఇప్పుడు అగ్నికి ఆజ్యం పోసిన చందాన సిఇసి జ్ఞానేశ్‌కుమార్ పదవీ త్యాగం చేయాల్సిందేనంటూ 'జెన్‌జీ' గొంతు కలిపింది. దేనికైనా తెగించేందుకు సిద్ధంగానే ఉంది. ప్రభుత్వ నిర్ణయాల్లో పారదర్శకత లేనందున్న యువత అసంతృప్తికి గురై తిరగబడుతోందన్న నిజాన్ని అన్యులు గ్రహించినంతగా కేంద్రప్రభుత్వం గ్రహించలేకపోవడం వలనే యువతలో అశాంతి ప్రబలింది. ఎన్ని వ్యూహాలు పన్నినా యువతకు అందాల్సిన భరోసా ఏదీచిక్కడం లేదు. పైగా ఉద్యమిస్తున్న యువతపై బలప్రయోగం చేయడం ఏ ఇతర వర్గాలకూ నచ్చడంలేదు. యువత ప్రస్తుతం క్రాకోచ్ జనతాపార్టీ నేతృత్వంలో ఉద్యమాలకు ఆకర్షితులౌతోంది. నిరసనకారులు జంతర్‌మంతర్ వైపు వెళ్తేనే పోలీసు గణం సహించలేకపోతోంది. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఐఎస్ఎ, కాంతికారి యువత సంఘటన్ (కెవైఎస్) సభ్యులతోపాటు క్రాకోచ్ జనతా పార్టీ కార్యకర్తలను సైతం ఢిల్లీ పోలీసులు తీవ్రంగా ఆటంకపరిచారు. ఇవన్నీ యువతను ఆగ్రహావేశుల్ని చేసిన సంఘటనలే. ఒకనాడు కేవలం విశ్వవిద్యాలయాలు కళాశాలలకేపరిమితమైన విద్యార్థి ఉద్యమాలు 'జంతర్ మంతర్' వరకు దారితీసాయంటే పాలకుల పట్ల యువతలో ఉన్న అసంతృప్తి విషయం ఆలోచించాల్సిందే. రాజధాని నగరం అట్టుడికి పోతోందని పత్రికల పతాక శీర్షికలనెక్కుతున్నాయి. సామాజిక మాధ్యమాల ద్వారా ఢిల్లీలో ఏదో జరుగుతోందనే విషయం పౌరులకు దాదాపుగా చేరిపోయింది. అన్నివర్గాల నుంచి నిరసనలు మిన్నుముట్టాయి. 'సర్' ప్రక్రియ లోపభూయిష్టంగా ఉండటమే ఈ ఉద్యమాలకు అగ్గిరాజేసింది. 'సర్' ఉద్యమాల నేపథ్యాన్ని గ్రహించి దాని ప్రక్రియలో మార్పులు తేవడంగానీ 'సర్' ప్రక్షాళన గానీ పూర్తిగా జరుగలేదనే చెప్పాలి. ఎన్నిసార్లు 'సర్' విషయంలో సుప్రీంకోర్టు మెట్టెక్కినా సరైనఊరట రాలేదని ప్రఖ్యాత న్యాయకోవిదుడు కపిల్‌సిబాల్ సైతం చేతులెత్తేసారు. కానీసుప్రీంకోర్టు ధర్మాసనాధినేతలు మాత్రం ప్రజలకు న్యాయం ప్రసాదించడంలోనూ, న్యాయం కలిగించామన్న నమ్మకం కలిగించడంలోనూ తాము ముందుంటామని ఎంతో హుందాగా కపిల్‌సిబాల్ ఆవేదనకు సమాధానంగా వివరించారు. ఏదిఏమయినా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా కోరుతూ విపక్షాలు చేపట్టిన నిరసనోద్యమంలో ప్రధాన భాగస్వామ్యంగా ఉన్న 'జెన్‌జీ' యువతను ప్రశాంతపరచడమొక్కటే పాలకుల ముందున్న తక్షణ కర్తవ్యం. యువతను నిర్మాణాత్మక కార్యక్రమాలవైపు మళ్లించాలన్న కేంద్రప్రభుత్వ యోచన మంచిదే అయినా అటువైపుగా కార్యాచరణ జరగడం అవశ్యం.

ప్రతి మనిషి కావలసినవాడే. కాకపోతే ఏ మనిషీ ఎక్కువ కావలసిన వాడు కాదు.



ఎమర్సన్

ఎలా పొందాలో తెలుసుకుంటే, అనంతమైన శక్తి మనిషికి అందుబాటులో ఉంది.



ఆడమ్స్ బెక్

# ప్రజావాక్కు



### శాంతియుతంగా పరిష్కరించుకోవాలి

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్‌ను 'సర్' అనే ఓటర్ల జాబితాలో అనేక అవకతవకల వల్ల కోట్లాది ఓట్లు గల్లంతయ్యాయని, ఆ కారణంగా సి.ఇ.సి.వెంటనే రాజీనామా చేయాలని లేక అభిశంసన ద్వారా తొలగించాలని క్రాక్రోచ్ జనతా పార్టీ వారితోబాటు ఇండియా కూటమి పార్టీలవారు ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నాలు చేస్తూ పరిస్థితిని ఉధృతం చేస్తున్నారు. ప్రభుత్వం ఓ పరిష్కారం కనుగొనకుండా సుమారు ఏడువేలమంది ఉద్యమకారులను అరెస్టు చేయడం జరిగింది. ఇది చినికి చినికి హింసాత్మక రూపందాలుస్తుందేమోనని సందేహాలు కలుగుతున్నాయి. కొన్నిబిజెపేతర ఉత్తర, దక్షిణరాష్ట్రాల మంత్రులు, ముఖ్యమంత్రులు కూడా ఆందోళనకారులకు మద్దతివ్వడంతో ఈ వ్యవహారం ముదిరి పాకాన పడుతోంది. పరిస్థితి చేయదాటకుండా ప్రభుత్వం మౌనాన్ని వీడి ఆందోళనను శాంతియుతంగా పరిష్కరించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ఎఐ అనుభవాన్ని అధిగమిస్తుందా?

నేడు కార్యాలయాలు, పరిశ్రమలు, వ్యాపార రంగాల్లో తరచుగా వినిపిస్తున్న చర్చకృత్రిమ మేధసు(ఏఐ) అనుభవాన్నిఅధిగమిస్తుందా అనే ప్రశ్న. అయితే ఈచర్చను అనుభవం వర్సెస్ ఏఐగా చూడడం సరైన దృక్పథం కాదు. ఎందుకంటే ఈ రెండింటిలో ఏదీఒంటరిగా సంపూర్ణ పరిష్కారం అందించలేవు. ఇరవై లేదా ముప్పై సంవత్సరాల అనుభవం కలిగిన ఒక సీనియర్ అధికారి వ్యాపార నిర్ణయాల్లో లోతైన అవగాహన కలిగిఉండవచ్చు. కానీ ఆధునిక ఏఐ వ్యవస్థలు ఎలా పని చేస్తాయో తెలియకపోతే, కొత్త అవకాశాలను పూర్తిగా వినియోగించుకోలేరు. అదే సమయంలో అత్యాధునిక డిజిటల్ సాధనాలపై పట్టు ఉన్న యువ నిపుణుడు, అనుభవంతో వచ్చేవిచక్షణ, దీర్ఘకాలిక దృష్టి లేకపోతే సరైన నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బంది పడవచ్చు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### రైలు ముఖచిత్రాన్ని మార్చాలి

వచ్చేయేడాది మే, జూన్‌లలో బుల్లెట్ రైలు పట్టాలెక్కనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. దేశీయంగా తయారవుతున్న తొలి హైస్పీడు రైలు బాడీ ఫ్రేం పూర్తయిందని తెలిపారు. పత్రికల్లో వచ్చిన చిత్రంలో దూసుకుపోతున్నట్లు కనిపిస్తోంది. కానీవరాహం ముఖచిత్రం అమిర్చేరు. వరాహం బదులు అశ్వాన్ని రూపొందించాలి.

-వి.ఆర్.ఆర్. ఎ.రాజు, హైదరాబాద్

### మద్యం మత్తులో డ్రైవింగ్ వద్దు

ప్రైవేటు బస్సులు, లారీలు నడిపే డ్రైవర్లు రహదారి భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలి. కొందరు డ్రైవర్లు అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో పాటు మద్యం మత్తులో వాహనాలు నడపడంవల్లప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల కారణంగా అమాయక ప్రయాణికులు, ఇతర వాహనదారులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. కొన్నిసార్లు డ్రైవర్లు సైతం ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారు. కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవ హరించాలి. ప్రయాణ సమయంలో డ్రైవర్లు మద్యం సేవించకూడదు. ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూవాహనాలను నడపాలి. నిర్ణీత వేగపరిమితులను పాటిస్తూ, వాహనాల పరిస్థితినిఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి. ప్రయాణానికి ముందు డ్రైవర్ల ఆరోగ్య పరిస్థితి, అప్రమత్తతపై యాజమాన్యాలు కూడా శ్రద్ధ చూపాలి. రహదారి భద్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు, మద్యంసేవించి వాహనాలు నడపకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. మన జాగ్రత్తే మన ప్రాణాలకు రక్ష, ఇతరుల ప్రాణాలకు భరోసా.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### యువతతోనే దేశాభివృద్ధి సాధ్యం

ఢిల్లీ మొత్తం బంధు అయిపోయింది. అక్కడకక్కడ బారికేడ్లు దర్శనంఇస్తున్నాయి. ఒకవేల ప్రభుత్వంనుండి తప్పు జరగలేదు అనుకుంటే ఇన్ని ఆంక్షలు ఎందుకు? ఇంత నిర్బంధం ఎందుకు? అర్థరాత్రి ఇన్స్టారీల్స్ చేయాల్సిన అవసరం ఏముంది? ఈపరిణామాలు అన్ని గమనిస్తున్నావారికి అర్థం అయ్యేది ఒకటే ప్రభుత్వం ఆత్మ రక్షణలో ఉందని. జ్ఞానేష్ సెలువులపై వెళ్లారని చెపుతున్న ఆయన రాష్ట్రాలా పర్యటనలు రద్దు చేసుకుంటున్నారు. అంటేనే బొద్దింకలు అనబడే యువతకు ప్రభుత్వంకానీ ఆయన కానీ బయపడిపోయారు అని ఇప్పుడే దేశం అర్థం చేసుకుంటుంది. ఇన్ని జరుగుతున్నా ప్రభుత్వం చేస్తున్న తప్పులను సరిదిద్దు కోవాలి. లేకపోతే యువతకు మొత్తమే దూరం అయిపోయే ప్రమాదం ఉంది.

- భారత అవినాష్, జనగామ

### భక్తి శ్రద్ధలతో చేసుకుందాం

రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న దుర్గామాత వేడుకలను అత్యంత భక్తిభావంతోవేడుకలను నిర్వహించుకోవాలి. రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ ఒకేచోట సామరస్య బద్ధంగా సజావుగా ముందుకు సాగాలి. నిర్వహణ సమయంలో తగు జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# విద్యార్థుల ఆత్మహత్యలకు అంతం లేదా?

**ఫిర్యాదు చేస్తే తమ కెరీర్ నాశనమవుతుందనే భయం విద్యార్థులను నీడలా వెంటాడుతోంది. విచారణ కమిటీల్లో ఆయా సంస్థల అధిపతులే ఉండటంతో పాటు విచారణను ప్రభావితం చేసే అవకాశం ఉండడంవల్లే బాధితులకు న్యాయం జరగడంలేదనే అభిప్రాయం కూడా ఉంది. రోహిత్ వేముల చట్టంఅమలు కోసం విద్యార్థి సంఘాలు చేస్తున్న డిమాండ్‌ను ఇకనైనా ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించాలి. ప్రతి ఉన్నత విద్యాసంస్థలో స్వతంత్ర, విద్యార్థి ప్రాతినిధ్యం కలిగిన ఫిర్యాదు పరిష్కార సెల్, బయటి నిపుణులతో కూడిన విచారణ వ్యవస్థ, తప్పనిసరి మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్, ఫ్యాకల్టీలకు సామాజిక న్యాయ సున్నితత్వ శిక్షణ ఏర్పాటు చేయాలి. వీటికి అదనంగా తల్లిదండ్రులు సైతం తమ డాలర్ల కలలను నిజం చేసుకునే తొందరలో తమ పిల్లల పై అనవసరమైన మానసిక ఒత్తిళ్లకు పూనుకోరాదు.**



డాక్టర్ నీలం సంపత్

మనిషికి విద్యతో వివేకం, వివేకంతో మానసిక పరివర్తన, తద్వార మనిషి మానవీయ విలువలు గల పౌరుడిగా తీర్చిదిద్దబడతాడనే సత్యం లోకవిదితమే. ఐతే ఔత్సాహికులైన విద్యార్థులకు ఆ శాస్త్రీయ విద్యను అందించాల్సిన విద్యాలయాలే వారిని మానసిక ఒత్తిళ్లకు గురయ్యేలా చేస్తున్న నేపథ్యంలో అభివృద్ధి పథంలో ఆకాశ మంత ఎత్తు ఎదగాల్సిన ఆ విద్యార్థులే అర్ధాంతరంగా అసువులుబాస్తున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. భారతరాజ్యాంగంలోని ఆర్టికల్ 21ప్రతి పౌరుడికి జీవించే హక్కును ప్రసాదిస్తే, దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అనేక ఉన్నత విద్యాసంస్థలు మాత్రం కొంతమంది యువతకు ఆ హక్కును దూరం చేస్తున్న వైనం గుండెలను ద్రవింప జేస్తోంది. ఉన్నత విద్యారంగంలో విద్యార్థులను మహోన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దాల్సిన ఐఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు, ఎయిమ్స్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో ఏ ఏటికా ఏడు నిరంతరంగా కొనసాగుతున్న యస్.సి, యస్.టి, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల ఆత్మహత్యల పరంపర సమకాలీన సమాజాన్ని కలవరపెడుతోంది. దేశవిద్యావ్యవస్థమౌలిక స్వరూపంలో ఉన్న లోపమో? లేదా లోప భూయిష్టమైన విద్యావిధానాల ఫలితమో? లేదా సదరు ఉన్నత విద్యా సంస్థల పాలకుల వివక్షతో కూడిన పాలనో? మరే కారణమో కాని పేదరికంలో పుట్టి పేదరికంలో పెరిగినా అనేక రకాల సామాజిక వివక్షలకు ఎదురొడ్డి దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఉన్నత విద్యా సంస్థలలో ప్రవేశం పొందినఎంతో మంది అణగారిన కులాలు, వర్గాలకు చెందిన దళిత బహుజన విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న వైనం ఆధునిక సమాజంపై మాయనిమచ్చగా భావించక తప్పదు. పదేళ్ల క్రితం, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీ.హెచ్.డి. స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్య ఒక్కసారిగా మొత్తం దేశాన్ని కుదిపేయడమే కాకుండా ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించింది. ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్‌గా పరిగణించే తన లేఖలో 'నా పుట్టుకే నా ప్రాణాంతక యాక్సిడెంట్'అని రాసిన ఆ యువ శాస్త్రవేత్త హృదయ ఘోష, అధికశాతం ఉన్నత విద్యా సంస్థల క్యాంపస్‌లను క్యాన్సర్‌లా పీడిస్తున్నకుల వివక్ష క్రూరత్వాన్ని వెలుగులోకి తెచ్చిన వైనంజాతీయ చర్చకు దారితీసింది. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో షరా మామూలుగా ఆనాటి ప్రభుత్వం సదరు దురదృష్టకర సంఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించింది. మరింత లోతుగా అధ్యయనం చేయడం కోసం ఉన్నత విద్యారంగ నిపుణులతో కమిటీలు వేసింది. కుల వివక్ష మూలాలలోకి వెళ్లి దానిని సమగ్రంగా అధ్యయనం చేసి సమూలంగా నిర్మూలిస్తామని పుంఖాను పుంఖాలుగా హామీలు గుప్పించింది. రోహిత్ వేముల పేరుతో ఓ ప్రత్యేక చట్టాన్ని కూడా రూపొందించింది. తదనంతరం పదేళ్ల కాలం గడిచినా పరిస్థితిలో ఎలాంటి మార్పులేదు, ఉన్నత విద్యాసంస్థలు మారలేదనడానికి నిలువెత్తు నిదర్శనంగా నిన్నటికి నిన్న ఐ.ఐ.టీ ఢిల్లీలో దళిత విద్యార్థి సాహిల్ మరణం అదే ఘోర దురంతాన్ని మళ్లీ గుర్తు చేసింది. రోహిత్ వేముల నుండి పాయల్ తడ్వీ (ముంబై), ఫాతిమా లతీఫ్ (ఐ.ఐ.టీ మద్రాస్), అనిల్ కుమార్ (ఐ.ఐ.టీ హైదరాబాద్), దర్శన్ సోలంకి (ఐ.ఐ.టీ బాంబే) వరకు, ఇప్పుడు సాహిల్ వరకు మరణించిన వారిలో అత్యధికులు దళిత, బహుజన, ఆదివాసీ, మైనారిటీ సామాజిక వర్గాల నుండి వచ్చినవారు కావడం యాదృచ్ఛికం కాదు, అది ఒక వ్యవస్థాగత వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనమేననే బుద్ధిజీవుల అభిప్రాయాలు ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. ఈ ఆత్మహత్యలను కేవలం వ్యక్తిగత మానసిక సమస్యగా చూడలేం. వీటి వెనుక మూడు ప్రధాన కారణాలు ఉన్నాయనిపిస్తోంది. ఉన్నత విద్యారంగంలో రాజ్యాంగ బద్ధమైన రిజర్వేషన్ ద్వారా అత్యున్నత విద్యా సంస్థలలో క్యాంపస్‌లో ప్రవేశాన్ని సంపాదించుకున్న నిరుపేద యస్.సి, యస్.టి విద్యార్థులు అత్యంత క్రూరమైన కుల వివక్షను ఎదుర్కొంటున్నారు. 'నువ్వు కోటా ద్వారా వచ్చావు' అనే హేళన, మెస్‌లలో, హాస్టళ్లలో వేర్పాటు, లైంగిక వేధింపులు, పరిశోధనా రంగంలో గైడ్‌ల నుండి సరైన మార్గదర్శకత్వం లేకపోవడం, స్కాలర్ షిప్‌లు సకాలంలో అందకపోవడం వారిని ఒంటరి వాళ్లుగా మారుస్తున్నాయేమోనని పిస్తోంది. ఉన్నత విద్యాసంస్థల్లో ఫ్యాకల్టీ వివక్ష, పరిపాలన యంత్రాంగంలో సామర్థ్య లోపం, లోపభూయిష్టమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, కేవలం కార్యాలయాల్లో కాగితాలకే పరిమితం కావడం, తోటి విద్యార్థులతో అనవసరమైన, అనారోగ్యకరమైన పోటీ, అకడమిక్ ఒత్తిడి, మూల్యాంకనంలో పారదర్శకత లేకపోవడం, ఆరుగాలం కష్టపడి తమ కుటుంబాలను కష్టాల కడలిలోకి తోసి ఫీజుల భారాన్ని భరించి ఉన్నత చదువుల కోసం ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో చేర్పించిన తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలు నెరవేర్చే స్థాయిలో మార్కులనూ, ర్యాంకులనూ సంపాదించి క్యాంపస్ ఉద్యోగాలను సంపాదించి వారి డాలర్ల కలలను నెరవేర్చలేమోననే తీవ్రమైన మానసిక భావనలు విద్యార్థులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయి. తీవ్రమైన ఒత్తిళ్లలో ఉన్న సమయంలో బాధిత విద్యార్థులకు అవసరమైన స్వాంతనను సమకూర్చి వారికి అవసరమైన మనోధైర్యాన్ని నింపేమద్దతు వ్యవస్థ అందుబాటులో లేకపోవడం. అత్యంత వెనుకబడిన గ్రామాలు, తండాలు, ఏజన్సీ ఏరియా లతో పాటు చిన్న చిన్న పట్టణాల నుండి వచ్చిన మొదటి తరంగ్రాడ్యుయేట్లకు క్యాంపస్ సంస్కృతికి అలవాటు పడటానికి, ఇంగ్లీష్ భాషా బెరుకును అధిగమించడానికి తగిన శిక్షణను, కౌన్సెలింగ్‌ని ఇవ్వడం ద్వారా ఆ విద్యార్థులకు అవసరమైన మానసిక సామర్థ్యాన్ని అందించే మెంటార్ షిప్ వ్యవస్థ లేకపోవడం ఆ సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులను మానసికంగా బలహీనులుగా మారుస్తోంది. దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన ఉన్నత విద్యా సంస్థలలో జరుగుతున్న ప్రతి ఆత్మహత్య తర్వాత ప్రభుత్వాల తీరు ఒకేలా ఉంటుంది. ఎమ్మెల్యేలు, యం.పి.లు, మంత్రులూ, ముఖ్యమంత్రులూ, ప్రధాన మంత్రి, రాష్ట్రపతి వరకు పాలకులంతా అత్యంత బాధాకరమైన ఆత్మహత్యలపట్ల తీవ్రమైన విచారాన్ని ప్రకటించడం, మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతినీ, సంతాపాన్ని తెలియజేయడంతోపాటు ఎంతో కొంత నష్ట పరిహారాన్ని అందించడం ఆనవాయితీగా కొనసాగుతుంది. తదనంతరం ఒక విచారణ కమిటీ, ఒక టాస్క్ ఫోర్స్, కొన్ని మార్గదర్శకాలు. యూజీసీ 2012 లోనే కులవివక్ష నిరోధానికి రెగ్యులేషన్స్ తెచ్చింది. సుప్రీంకోర్టు సైతం పలు మార్లు ఎన్నోప్రామాణిక ఆదేశాలు ఇచ్చినా, వాటిని అమలు పరచాల్సిన అధికార యంత్రాంగంలో చిత్తశుద్ధి లోపించి ఆత్మహత్యలు ఆగడంలేదేమోననే భావన సర్వత్ర వెల్లువెత్తుతోంది. ఫిర్యాదుచేస్తే తమ కెరీర్ నాశనమవుతుందనేభయం విద్యార్థులను నీడలా వెంటాడుతోంది. విచారణ కమిటీల్లో ఆయా సంస్థల అధిపతులే ఉండటంతో పాటు విచారణను ప్రభావితం చేసే అవకాశం ఉండడంవల్లే బాధితులకు న్యాయం జరగడంలేదనే అభిప్రాయం కూడా ఉంది. రోహిత్ వేముల చట్టంఅమలు కోసం విద్యార్థి సంఘాలు చేస్తున్న డిమాండ్‌ను ఇకనైనా ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించాలి. ప్రతి ఉన్నత విద్యాసంస్థలో స్వ తంత్ర, విద్యార్థి ప్రాతినిధ్యం కలిగిన ఫిర్యాదు పరిష్కార సెల్, బయటి నిపుణులతో కూడిన విచారణ వ్యవస్థ, తప్పనిసరి మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్, ఫ్యాకల్టీలకు సామాజిక న్యాయ సున్నితత్వ శిక్షణ ఏర్పాటు చేయాలి. వీటికి అదనంగా తల్లిదండ్రులు సైతం తమ డాలర్ల కలలను నిజం చేసుకునే తొందరలో తమపిల్లల పై అనవసరమైన మానసిక ఒత్తిళ్లకు పూనుకోరాదు. ●



# ప్రకృతి విపత్తుల పట్ల అప్రమత్తత అవసరం

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

ప్రకృతి వైపరీత్యాలు జరుగుతూనే ఉంటాయి. కనీసం శతాబ్దానికి ఒకసారి కరోనా లాంటి మహమ్మారులు చుట్టు ముడుతూనే ఉండవచ్చని వింటున్నాం. ప్రకృతి వైపరీత్యాలను ముందు ఊహించడం చాలా సందర్భాలలో వీలు కాదు. మానవ తప్పిదాలతో ప్రాణ ఆస్తినష్టాలు తరుచుగా చూస్తున్నాం. గతంలో విశాఖపట్నం సమీప వెంకటాపురం గ్రామంలో యల్‌జి పాలిమర్స్ పరిశ్రమ నుండివిడుదలైన స్టైరిన్ వాయు లీకేజీ కారణంగా 11మంది మరణించగా, 1000కి పైగా ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలైనారు. ఈ మానవ నిర్లక్ష్యానికి 3 కిమీ పరిధిలోని ఐదు గ్రామాలు ప్రభావితం కాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోటి రూపాయల పరిహారంతో పాటు పునరావాసానికి 30 కోట్లు కేటాయించాల్సి వచ్చింది. ఇలాంటి సహజ, మానవ కారణ విపత్తులు జరిగినప్పుడు ఆస్తి ప్రాణనష్టాలను తగ్గించే ప్రయత్నాలు చేయడం, ఉపశమన చర్యలు తెలుసుకోవడం, క్షతగాత్రులను రక్షించి వైద్యసదుపాయాలు కల్పించడం, విపత్తుప్రమాద నిర్వహణలో సుశిక్షితులైన బలగాలు సత్వరమే స్పందించడం మాత్రమే మన అధీనంలో ఉంటుంది. 2011లో ప్రపంచవ్యాప్తంగా జరిగిన 302 విపత్తుల్లో 80,000 మరణాలు, 206 మిలియన్ల ప్రజలు ప్రభావితం అయినారు. ఈ విపత్తులు మిగిల్చిన నష్టం 2ట్రిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. సహజ (నాచురల్), మానవ కారణ (మ్యాన్ మేడ్) విపత్తులు జరిగినప్పుడు వెంటనే స్పందిస్తూ తీసుకోవలసిన చర్యలను, నష్ట నివారణ పద్దతులు, విపత్తు నిర్వహణ గూర్చి కనీస పరిజ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రతి ఏటా ఐక్యరాజ్యసమితి నేతృత్వంలో ప్రపంచ దేశాల్లో 13 అక్టోబర్‌న 'అంతర్జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు దినం' పాటించడం జరుగుతోంది. 1989 ఐరాస పిలుపు మేరకు విపత్తుల తీవ్రతను తగ్గించడం, నివారించడం, స్పందించడం, ధైర్యాన్నినూరిపోయడం, తిరిగి యథాస్థితి కి తీసుకురావడం, ఎదుర్కొనే సంసిద్ధత కలిగి ఉండడంలాంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని విపత్తు ప్రమాద నియంత్రణ మార్గాలను శోధించే వేదికగా అంతర్జాతీయ విపత్తు తగ్గింపుదినాన్ని తీసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు దినం 2026నినాదంగా స్థిత ప్రజ్ఞత ఇంటి నుంచే ప్రారంభం కావాలి అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల్లో భూకంపాలు, వరదలు, తుఫానులు, సునామీలు, సూక్ష్మమహమ్మారి కల్లోలాలు, జునోటిక్ వ్యాధులు, వడగాలులు, మంచు తుఫానులు, ఇసుక తుఫానులు, అగ్ని పర్వత విస్పోటనాలు, అసాధారణ సముద్ర అలలు, నేల కోతలు, కరువులు, మంటలు, రేడియోధార్మిక వాయువుల వ్యాప్తి, హిమపాతాలు, కొండచరియలు విరిగి పడడం లాంటివి వస్తాయి. మానవ కారణ విపత్తుల్లో భోపాల్ వాయు దుర్ఘ టన లాంటివి, సముద్రజలాల్లో పెట్రోలియం లీకేజ్, చెర్నో బిల్ అణువిస్పోటనం, భూతాపంతో మంచుకొండలు కరగటం లాంటివి వస్తాయి. వైపరీత్యాల తీవ్రత ఎక్కువగా ఉన్నపుడు ప్రాణనష్టం వేలల్లో, గాయపడిన వారు లక్షల్లో, ఆస్తి నష్టం కోట్లల్లో ఉంటుంది. విపత్తు నిర్వహణలోప్రజల ప్రాణాలను కాపాడడం ప్రధానమైంది. క్షతగాత్రులకుసత్వర వైద్య సదుపాయాల కల్పన, నిరాశ్రయులకు తాత్కాలిక శిబిరాల ఏర్పాటు, జంతువుల పరిరక్షణ, ఆస్థులను కాపాడుతూ నష్టాన్ని తగ్గించడం, అత్యవసర సరుకుల రవాణా వ్యవస్థలను నెలకొల్పడం లాంటి చర్యలను తీసుకోవాలి. విశ్వమహమ్మారులైన సూక్ష్మజీవుల విజృంభన, వాతావరణ ప్రతికూలతలు, ప్రకృతి వైపరీత్యాలు, జరిగినప్పుడు సత్వర పౌర స్పందనతో అపార ప్రాణఆస్థి నష్టాన్ని తగ్గించవచ్చు. అగ్ని ప్రమాదాలు, తుఫాన్లు, సునామీల, భూకంపాలు లాంటివిపత్తులు జరిగినప్పుడు మానవ, జంతు ప్రాణనష్టం, ఆస్థిధ్వంసం, ప్రకృతి వినాశనం పెద్ద ఎత్తున స్వల్ప వ్యవధిలోనే జరిగిపోతుంది. ఇండియాకు ఒక ప్రత్యేకమైన జాతీయ విపత్తు నియంత్రణ ప్రణాళిక ఉండాలని, దానిని 2016లో రూపొందించిన ఘనత ప్రస్తుతకేంద్ర ప్రభుత్వానికేదక్కింది. దీనిలోభాగంగా ప్రత్యేకమైన జాతీయ విపత్తు స్పందనదళం సహాయం తీసుకోవడం జరుగుతోంది. విపత్తు ప్రమాదఅవగాహన, విపత్తుప్రమాద నిర్వహణ, పర్యవేక్షణ యంత్రాంగం, విపత్తు నష్టాన్ని తగ్గించడానికి పెట్టుబడులు, విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటూ ముందస్తు హెచ్చరికలు చేయడం అనేనాలుగు సూత్రాల మీద భారతవిపత్తు నిర్వహణ ప్రణాళికను అభివృద్ధి చేశారు. ప్రకృతి వైపరీత్యాలు జరగకూడదని, జరిగినా ముందస్తు హెచ్చరికలతోజరగబోయే అపారనష్టాన్ని తగ్గించగల విపత్తు నిర్వహణయంత్రాంగంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ●

# ఓటు వాక్కే ప్రజాస్వామ్యానికి పునాది!



కాలగిరి శ్రీనివాసరెడ్డి

ఎన్నికల్లో ఎవరు గెలిచారు? ఎవరు ఓడిపోయారు? అన్నదానికంటే ముందు ఒక ప్రశ్నకు సమాధానం ఉండాలి. ఎవరు ఓటువేయగలిగారు? ఎందుకంటే ఓటరు జాబితాలో పేరు లేకపోతే ప్రజాస్వామ్యంలో పౌరుడి గొంతుకకు గొళ్లెం వేసినట్లే. అది పౌరుడి రాజకీయ హక్కుకు పునాది. ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణపై సాగుతున్న వివాదం ఎన్నికల సంఘం విశ్వసనీయతతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థ పారదర్శకతపైనా కీలక ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ వివాదం సుప్రీం కోర్టు ముందుకు వెళ్లింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కొన్ని నిర్ణయాలను ఇతర ఎన్నికల కమిషనర్ల సమ్మతి లేకుండానే తీసుకున్నారన్న ఆరోపణలపై దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్‌మాల్య బాగ్చి, వి.మోహనాలతో కూడిన ధర్మాసనం విచారించింది. అయితే కోర్టు ఈ దశలో ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను సస్పెండ్ చేయలేదు. ఆరోపణలను నిజమని గానీ, అబద్ధమని గానీ తేల్చలేదు. బదులుగా కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి తదితరుల నుంచి సమాధానాలు కోరింది. ఇదే విచారణలో అత్యంత ముఖ్యమైన అంశం. పిటిషనర్లవాదన మాత్రం తీవ్రంగా ఉంది. గత పది నెలల్లో ఎన్నికల జాబితాలు, కొత్త ఓటర్ల నమోదు, సాంకేతిక వ్యవస్థలకు సంబంధించిన పలు నిర్ణయాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారని వారు చెబుతున్నారు. బహుళ సభ్యుల ఎన్నికల సంఘంలో నిర్ణయాలు సామూహికంగా తీసుకోవాల్సి ఉండగా, ఒక వ్యక్తి ఆధిపత్యంలో నిర్ణయాలు జరిగాయా? అన్నదే వారి ప్రధాన ప్రశ్న. అయితే ఇవి పిటిషనర్ల ఆరోపణలే తప్ప సుప్రీంకోర్టు ధృవీకరించిన వాస్తవాలు కావు. అసలు రికార్డులు బయటకు వచ్చిన తర్వాతే నిజానిజాలు స్పష్టమవుతాయి. ఫారం-6 వ్యవహారం కూడా ఈ వివాదంలో మరో కీలక అంశంగా మారింది. కొత్తఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం-6లో మార్పులు చేశారన్న అభ్యంతరాలపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు తన అనుమతి లేకుండా మార్చిన ఫారం-6ను తాను ఆమోదించలేదని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియలో ఉపయోగించే ప్రతి పత్రానికి చట్టపరమైన ఆధారం ఉండాలి. నియమాలు మార్చితే ఆ మార్పుకు ఎవరు అనుమతి ఇచ్చారు? ఏ నిబంధన ఆధారంగా మార్చారు? నిర్ణయం తీసుకున్న విధానం ఏమిటి? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం ఉండాలి.




ఎన్నికల సంఘం మాత్రం తన నిర్ణయాలు చట్టబద్ధంగానే జరిగాయని చెబుతోంది. ముసాయిదా దశలో అధికారుల మధ్య అభిప్రాయ భేదాలు ఉండటం సహజమని, అవి తుది నిర్ణయాలపై సంస్థాగత విభేదాలుగా పరిగణించరాదని వివరిస్తోంది. ఎస్ఐఆర్ షెడ్యూల్ వంటి కీలక నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఇసి వాదిస్తోంది. అంటే ఒకవైపు పిటిషనర్ల ఆరోపణలు, మరోవైపు ఎన్నికల సంఘం వివరణ. ఈ రెండింటి మధ్య అసలు నిజాన్ని నిర్ణయించాల్సింది రాజకీయ వేదికలు కాదు. రికార్డులు, చట్టం, న్యాయపరమైన పరిశీలనే. ఇదే సమయంలో ఓటర్ల పేర్ల తొలగింపుపై దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. భారీ సంఖ్యలో పేర్లుతొలగించబడ్డాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నికల సంఘం మాత్రం చెల్లని, పునరావృత, మరణించినలేదా ఇతర కారణాలతో అనర్హమైన నమోదులను తొలగించడం అవసరమని చెబుతోంది. రెండు వాదనల్లోనూ ఒక వాస్తవం ఉంది. ఓటరు జాబితా శుద్ధి చేయకపోతే ఎన్నికల విశ్వసనీయత దెబ్బతింటుంది. కానీ శుద్ధిపేరుతో ఒక్కఅర్హుడి పేరు తప్పుగా తొలగినా అతని ఓటు హక్కు ఆ ఎన్నికకే శాశ్వతంగా కోల్పోయినట్టే. అందుకే పేరు తొలగించడం కంటే ముందు పౌరుడికి సమాచారం ఇవ్వడం, అభ్యంతరం చెప్పే అవకాశం కల్పించడం, అప్పీల్‌హక్కు ఇవ్వడం అత్యవసరం. డిజిటల్ వ్యవస్థలో మార్పుజరిగితే దానికి స్పష్టమైన ఆడిట్ ట్రయిల్ ఉండాలి. ఎప్పుడు ఎవరు ఏ మార్పు చేశారో రికార్డులోఉండాలి. ఎన్నికల వ్యవస్థలో సాంకేతికత పెరుగుతున్నకొద్దీ జవాబుదారీతనం కూడా పెరగాలి. ఎన్నికల సంఘంపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తడం ప్రజాస్వామ్యంలో సహజం. అదే సమయంలో ఎన్నికల సంఘంపై వచ్చిన ప్రతి ఆరోపణను నిజమని భావించడం కూడా సరైందికాదు. ఎన్నికల సంఘం రాజ్యాంగసంస్థ కాబట్టి దాని స్వతంత్రతను కాపాడటం ఎంతముఖ్యమో, దాని నిర్ణయాల్లో పారదర్శకతను నిర్ధారించడం కూడా అంతే ముఖ్యం. సంస్థపై విశ్వాసం కేవలం రాజ్యాంగ హోదాతో రాదు. ప్రజలకు కనిపించే పారదర్శక చర్యలతోవస్తుంది. సుప్రీంకోర్టు ఈరోజుతీసుకున్న వైఖరి కూడా ఇదే విషయాన్ని గుర్తుచేస్తోంది. కోర్టు వెంటనే ఎవరినీ దోషిగా తేల్చలేదు. తక్షణ సస్పెన్షన్ కూడా విధించలేదు. కానీ ఆరోపణలను పక్కన పెట్టకుండా సంబంధిత సంస్థల నుంచి సమాధానాలు కోరింది. అంటే ఇకపై రాజకీయ నినాదాల కంటేఆధారాలు, ఫైల్ నోటింగ్స్, సమావేశాల రికార్డులు, నిర్ణయ ప్రక్రియ, చట్టపరమైన నిబంధనలే కీలకం కానున్నాయి. ప్రజాస్వామ్యంలో ఓటు కేవలం ఒకబటన్ నొక్కడం కాదు. అది ఒక పౌరుడిస్వరం. ఆ స్వరం వినిపించడానికి ముందే ఓటరుజాబితాలో అతని పేరు సురక్షితంగా ఉండాలి. అదే సమయంలో నకిలీ ఓట్లు, ద్వంద్వ నమోదులు, అనర్హులపేర్లు కొనసాగకుండా చూడటం కూడాఎన్నికల సంఘం బాధ్యతే. కాబట్టి లక్ష్యం ఎక్కువ పేర్లు తొలగించడం కాదు, అర్హుడైన ప్రతిపౌరుడి పేరు కాపాడుతూ, అనర్హ నమోదులను చట్టబద్ధంగా తొలగించే విశ్వసనీయ వ్యవస్థను నిర్మించడం. ఎన్నికల్లో గెలిచే పార్టీ మారవచ్చు. ప్రభుత్వాలు మారవచ్చు. నాయకులు మారవచ్చు. కానీ ఓటుపై ప్రజల నమ్మకం మాత్రం దెబ్బతినకూడదు. ఎందుకంటే ఎన్నికల ఫలితాన్ని ఓడిపోయిన పార్టీ ప్రశ్నించడం ఒక రాజకీయ పరిణామం కావచ్చు. కానీ ఓటరు తన ఓటు సురక్షితమేనా అని ప్రశ్నించడం ప్రజాస్వామ్యానికి హెచ్చరిక. ●

# 200 మంది అధికారులు టచ్‌లో ఉన్నారు!

## జ్ఞానేశ్‌కుమార్ నుంచి ఎస్ఎంఎస్‌లు వస్తున్నాయి

## విపక్ష కూటమి నేత రాహుల్‌గాంధీ సంచలన ప్రకటన





**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన తనకు సందేశాలు పంపిస్తున్నారని వెల్లడించారు. మీరు చేసిన తప్పును అంగీకరించి అప్రూవర్‌గా మారండి. మీరు ప్రధాన నేరస్తుడు కాదు. మీ వెనక అసలు సూత్రధారులు ఉన్నారు అని జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సోమవారం సుప్రీంకోర్టు వైపు ప్రతిపక్ష కూటమి చేపట్టిన మార్చ్‌కు ముందు మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. జ్ఞానేశ్ కుమార్ తనను సంప్రదించారా సందేశాలు పంపారా అని ఓ విలేకరి అడగ్గా రాహుల్ అవునని సమాధానమిచ్చారు. తాను నిర్వహిస్తున్న మీడియా సమావేశాన్ని కూడా ఆయన చూస్తున్నారని వ్యాఖ్యానించారు. తనకు వచ్చిన సందేశాల్లోని వివరాలను మాత్రం వెల్లడించలేదు. జ్ఞానేశ్ కుమార్‌పై ప్రభుత్వం రక్షణ కవచంలా నిలుస్తోందని రాహుల్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ఒత్తిడితోనే సీఈసీ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఆయన ఆధారాలను మీడియా ముందు వెల్లడించలేదు. ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇండియా కూటమి సోమవారం సుప్రీంకోర్టు వైపు మార్చ్ చేపట్టింది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ రాహుల్ గతంలోనూ ఆరోపణలు చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత దెబ్బతింటోందని విమర్శించారు. సీఈసీని తొలగించాలని, ఎన్నికల వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంలోని సుమారు 200 మంది అధికారులు ప్రతిపక్ష నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారని రాహుల్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), విదేశాంగ శాఖకు చెందిన అధికారులు కూడా ఇందులో ఉన్నారని పేర్కొన్నారు. వారే తమకు సమాచారం అందిస్తున్నారని తెలిపారు. ఈ వాదనకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తాను ఎన్నికల నిష్పాక్షికతపై ఆందోళన వ్యక్తం చేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశామని రాహుల్ చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడే వారికి రాజకీయాలకు అతీతంగా మద్దతిస్తామని స్పష్టం చేశారు. జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు తమ ఆందోళన ఆగదని రాహుల్ ప్రకటించారు.

### సిఇసి నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు: రాహుల్

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఓట్ల చోరీ ఆరోపణలపై కొనసాగుతున్న నిరసనలతో ఆయనకు నిద్రలేని రాత్రులు గడుస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఈ ఉద్యమం ద్వారా సీఈసీ రాజీనామా చేసేలా చేస్తామని స్పష్టం చేశారు. జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కాపాడుతోందని రాహుల్ ఆరోపించారు. ఢిల్లీలో నిరసనలు జరుగుతున్న ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరించడం వెనుక ఉద్దేశం అదే అని పేర్కొన్నారు. మా వ్యూహం వేరు. అక్కడ పోలీసు వలయం ఉండాలని మేం కోరుకుంటున్నాం. జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని మోదీ రక్షిస్తున్నారనే విషయం దేశానికి తెలియాలి అని వ్యాఖ్యానించారు. నిరసన ప్రాంతాల్లో 20 వేల నుంచి 30 వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించినా తమకు అభ్యంతరం లేదని రాహుల్ అన్నారు. ఇంత భారీగా బలగాలను మోహరించడం ద్వారా ప్రభుత్వం సీఈసీకి అండగా నిలుస్తోందనే సందేశం ప్రజల్లోకి వెళ్తుందని పేర్కొన్నారు.

# జంతర్‌మంతర్ వద్ద ప్రదర్శనలపై నిషేధం

## కొత్తగా మూడు ప్రాంతాలు ఎంపిక




**న్యూఢిల్లీ,అక్టోబరు 12:** దేశ రాజధాని ఢిల్లీలో ఇప్పటి వరకు నిరసనలకు వేదికగా ఉన్న జంతర్ మంతర్‌ను ఇకపై దాని కోసం వినియోగించడానికి వీలు లేదు. నిరసనల కోసం మూడు కొత్త ప్రాంతాలను నిర్దేశించారు. తూర్పు ఢిల్లీలోని రామ్‌లీలా గ్రౌండ్, బురారీ గ్రౌండ్, సీబీడీ గ్రౌండ్ నిరసనల వేదికలు కానున్నాయి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని ఒక కమిటీ సిఫార్సుల ఆధారంగా వీటిని ఖరారు చేశారు. జంతర్ మంతర్‌ను నిరసనలకు నిర్దేశిత ప్రదేశంగా గుర్తించే హోదాను రద్దు చేస్తూ ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ సిఫార్సుల ఆధారంగా, నిరసన వేదికగా జంతర్ మంతర్‌కు ఉన్న గుర్తింపును రద్దు చేశారు. నిరసనలు లేదా ప్రదర్శనలు నిర్వహించడానికి రామ్‌లీలా మైదానం, బురారీ మైదానం, సీబీడీ మైదానం అనే మూడు కొత్త ప్రదేశాలను నిర్దేశించారని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ మూడు కొత్త ప్రదేశాలలో నిరసనలు నిర్వహించడానికి సంబంధించిన ప్రామాణిక కార్యనిర్వహణ విధానాలను వేర్వేరుగా జారీ చేస్తామని ఢిల్లీ పోలీసులు తెలిపారు. మరోవైపు ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ వివాదంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధాన ప్రతిపక్షాలతో పాటు కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలను ఉధృతం చేశాయి. దీంతో గత రెండు రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. అక్కడకు చేరుకుంటున్న వారిని ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇప్పటి వరకు నిరసనలకు వేదికగా ఉన్న జంతర్ మంతర్‌కు ఆ గుర్తింపును రద్దు చేయడం ప్రాధాన్యత సంతరించుకున్నది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకించే అవకాశమున్నది. ఆందోళనకారులు పాటించాల్సిన భద్రతా నియమాలు, ముందస్తు అనుమతుల ప్రక్రియ, సౌండ్ పరిమితులు, హాజరయ్యే నిరసనకారుల సంఖ్య, సమయం.. వంటి గైడ్‌లైన్స్ అన్నీ కూడా వీటిల్లో పొందుపరచనున్నారు. ఢిల్లీ నడిబొడ్డున ఉండటం, పార్లమెంట్ భవనం, ప్రధాన మంత్రిత్వ శాఖల కార్యాలయాలకు అతి సమీపంలో ఉండే జంతర్ మంతర్ వద్ద నిరంతరం ధర్నాలు జరగడం వల్ల రవాణా సమస్యలు తలెత్తుతున్నాయని కేంద్రం భావిస్తోంది.

# ఆమోదమూ లేదు.. తిరస్కరణా లేదు

## ఫాం - 6పై స్పష్టత ఇచ్చిన సుప్రీంకోర్టు




**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితాల సవరణ కార్యక్రమం సందర్భంగా కొత్త ఓటర్లను చేర్చేందుకు ఉద్దేశించిన ఫామ్ 6లో మార్పులు చేశారు. ఈ మార్పులపై కేంద్ర ఎన్నికల సంఘంలో ఎన్నికల కమిషనర్లు వివేక్ జోషీ, సుఖ్ బీర్ సింగ్ సంధూ అభ్యంతరం తెలిపారు. దీంతో ఎన్నికల సంఘం వాటిని సుప్రీంకోర్టు ఆమోదంతోనే చేపట్టినట్లు వివరణ ఇచ్చింది. అయితే ఆ తర్వాత ఫామ్ 6 మార్పులపై దాఖలైన పిటిషన్ పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు గతంలో ఫామ్ 6 మార్పులను తాము కేవలం ఆమోదించలేదని మాత్రమే చెప్పిన సుప్రీంకోర్టు అలాగని వాటిని తిరస్కరించలేదని సోమవారం ప్రకటించింది. ఈసీ పనితీరులో జరిగిన అవకతవకల ఆరోపణలపై సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ దాఖలైన మరో పిటిషన్‌పై గతంలో జరిగిన విచారణలో భారత ప్రధాన న్యాయమూర్తి చెప్పిన విషయాన్నే జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి మౌఖికంగా పునరుద్ఘాటించారు. ఫారం 6కు చేసినట్లు చెబుతున్న ఏ మార్పులనూ తాము ఆమోదించలేదని ఆయన అన్నారు. తమ తీర్పులో ఫారం 6కు చేసిన అటువంటి ఏ మార్పునూ మేము ఆమోదించలేదని సీజేఐ చెప్పారని గుర్తుచేశారని పిటిషనర్ ప్రియా మిశ్రా తరఫున ఈసీ పనితీరులో సీఈసీ జ్ఞానేష్ కుమార్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలను సవాలు చేసిన న్యాయవాది నరేంద్ర మిశ్రాతో జస్టిస్ బాగ్చి అన్నారు. మొత్తం మీద ఇవాళ సుప్రీంకోర్టు మరో జడ్జి చేసిన వ్యాఖ్యలతో ఈసీకి కొంత మేర ఊరట దక్కినట్లయింది.

# కపిల్‌సిబల్ విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకే ఉన్నాం

## జంతర్‌మంతర్ అరెస్టులపై స్పందించిన సుప్రీం



**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** న్యాయవ్యవస్థపై సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ వ్యక్తం చేసిన అసంతృప్తిపై సుప్రీంకోర్టు అసాధారణ రీతిలో స్పందించింది. ఈ వ్యవస్థపై సిబల్ విశ్వాసాన్ని పునరుద్ధరించడానికే మేమిక్కడున్నామని వ్యాఖ్యానిస్తూ, ఆయన నమ్మకాన్ని తిరిగి నిలబెడతామని స్పష్టం చేసింది. ఢిల్లీలో పోలీసుల ఆంక్షలకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై ఆదివారం ప్రత్యేకంగా విచారణ జరిపిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడం, పలువురిని నిర్బంధంలోకి తీసుకోవడంపై కపిల్ సిబల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనకు ముందు ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ఓటర్ల జాబితాలో అవకతవకలపై పదేపదే సుప్రీంకోర్టును ఆశ్రయించి అలసిపోయానని, ఇక కోర్టుకు వెళ్లడం వల్ల ప్రయోజనం లేదనిపిస్తోందని అన్నారు. ఇది తన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని, ప్రజల హక్కుల కోసం న్యాయవాదులు పోరాడుతూనే ఉండాలని స్పష్టం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపితే ప్రభుత్వానికే ప్రమాదం ఉన్నట్టుందనిపిస్తోందని సిబల్ విమర్శించారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహితలోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు విధించడాన్ని ఆయన ప్రశ్నించారు. కర్ణాటక, పశ్చిమ బెంగాల్ నుంచి రైళ్లు, విమానాల్లో వస్తున్న వారిని కూడా మార్గమధ్యంలోనే అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు.

# జంతర్‌మంతర్ నిరసనలకు 24 గంటల్లో అనుమతించండి

## లేదంటే తదుపరి నిర్ణయం ప్రకటిస్తాం: సిజెపి హెచ్చరిక




**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనకు అనుమతి ఇవ్వాలని కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ కార్యకర్తలు సోమవారం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. నిరసన తేదీ, సమయాన్ని పోలీసులే నిర్ణయించాలని కోరారు. దీనిపై స్పందించేందుకు 24 గంటల గడువు విధించారు. పోలీసులు సాధారణంగా నిరసనకు కనీసం పది రోజుల ముందే దరఖాస్తు చేసుకోవాలని చెబుతుంటారని, ఈసారి మాత్రం తేదీ, సమయాన్ని పోలీసులే ఖరారు చేయాలని కోరుతున్నట్లు సీజేపీ కార్యకర్త సౌరవ్ దాస్ తెలిపారు. ఈ మేరకు పోలీసులకు 24 గంటల అల్టిమేటం ఇచ్చినట్లు వెల్లడించారు. నిరసన తేదీపై పోలీసుల నుంచి సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నట్లు పార్టీ నేత అశుతోష్ రంకా అన్నారు. అధికారులు స్పందించకపోతే 24 గంటల్లో మరో నిర్ణయం తీసుకుంటామని రంకా స్పష్టంచేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని సౌరవ్ దాస్ చెప్పారు. ప్రజలు ఇప్పటికే ఆ హక్కును వినియోగించుకుంటున్నారని అన్నారు. నిరసనకు పదిరోజుల ముందే సమాచారం ఇవ్వాలంటూ పోలీసులు పదేపదే చెబుతున్నారని తెలిపారు. అందుకే ఈసారి నిరసన తేదీ, సమయాన్ని నిర్ణయించే బాధ్యతను పోలీసులకే అప్పగిస్తున్నట్లు చెప్పారు. అయితే ఈ వ్యవహారాన్ని నిరవధికంగా పెండింగ్‌లో ఉంచేందుకు అంగీకరించబోమని దాస్ స్పష్టంచేశారు. పోలీసులు స్పందించేందుకు 24 గంటల సమయం ఇస్తున్నామని తెలిపారు. గడువు ముగిసిన తర్వాత తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని పార్టీ నేతలు వెల్లడించారు.

# అగ్రరాజ్యాల్లో పేదల ఆదాయమే ఎక్కువ!

**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** ఒక దేశంలో అత్యంత పేదలుగా ఉన్నవారి ఆదాయం మరో దేశంలో అత్యంత సంపన్నులుగా ఉన్నవారి ఆదాయం కంటే ఎక్కువగా ఉంది. ప్రపంచ బ్యాంకు గణాంకాలప్రకారం అమెరికా, కెనడా, జర్మనీ వంటి సంపన్న దేశాల్లో దిగువ 10 శాతం ప్రజల ఆదాయ స్థాయి భారత్‌లో ఎగువ 10 శాతం ప్రజల స్థాయిని మించిపోయింది. దేశాల మధ్య జీవన ప్రమాణాల్లో ఉన్న వ్యత్యాసాన్ని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు 2026 పేదరికం, అసమానతల గణాంకాల ప్రకారం భారత్‌లో దిగువ 10 శాతం ప్రజల రోజువారీ ఆదాయం లేదా వినియోగ స్థాయి ఒక్కో వ్యక్తికి సుమారు 3 డాలర్లు. అదే ఎగువ 10 శాతం ప్రజల విషయంలో ఈ స్థాయి రోజుకు 10 డాలర్లుగా ఉంది. భారత ఆర్థిక సర్వే ప్రకారం నెలకు రూ.80 వేల ఆదాయం ఉన్న వ్యక్తి కూడా దేశంలోని అత్యధిక ఆదాయం పొందుతున్న 10 శాతం మందిలో ఉంటారు. అమెరికాలో దిగువ 10 శాతం ప్రజల రోజువారీ ఆదాయం లేదా వినియోగ స్థాయి 25 డాలర్లు. కెనడాలో 31 డాలర్లు కాగా జర్మనీ, ఆస్ట్రేలియాలో 28 డాలర్లుగా ఉంది. అంటే భారత్‌లో అత్యధిక ఆదాయం పొందుతున్న వర్గం స్థాయి కంటే ఈ దేశాల్లో దిగువ ఆదాయ వర్గాల స్థాయి కూడా ఎక్కువగా ఉంది.

అయితే ఇవి దేశాల మధ్య జీవన వ్యయాల తేడాలను సర్దుబాటు చేసిన గణాంకాలు. పేదరికాన్ని తగ్గించడం మాత్రమే సరిపోదని ఆర్థికాభివృద్ధి నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. దేశ వ్యాప్తంగా ఆదాయాలు, ఉత్పాదకత పెరగాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. కొత్త ఆలోచనలకు అవకాశాలు కల్పించడం, వ్యాపా రాల విస్తరణకు అడ్డంకులు తగ్గించడం, మెరుగైన వేతనాలతో ఉద్యోగాలు పెంచడం కీలకమని పేర్కొంటున్నారు.

అప్పుడే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడి సంపన్న దేశాలతో ఉన్న అంతరం తగ్గే అవకాశం ఉంటుంది.

# అమెరికాలో పెరుగుతున్న రుణ ఎగవేతలు!

**వాషింగ్టన్, అక్టోబరు 12:** అమెరికన్ కుటుంబాల ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. ఆదాయం, సంపద పెరుగుతున్నప్పటికీ, అధిక వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం కారణంగా అప్పుల భారం తీవ్రమవుతోంది. 2025 చివరి నాటికి, ప్రతి ఐదు అమెరికన్ కుటుంబాల్లో ఒకటి (దాదాపు20) రుణచెల్లింపుల్లో వెనుకబడినట్లు తేలింది. 2007-08 ఆర్థిక మాంద్యం తర్వాత 2010లో నమోదైన స్థాయికి మించి, రుణ ఎగవేతలు ఇంతటి గరిష్ఠ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. ఫెడరల్ రిజర్వ్ తాజాగా విడుదల చేసిన 2025 సర్వే ఆఫ్ కన్స్యూమర్ ఫైనాన్సెస్ (ఎస్‌సీఎఫ్) నివేదిక ఈ చేదు వాస్తవాలను వెల్లడించింది. 2022లో రుణచెల్లింపుల్లో వెనుక బడిన కుటుంబాల వాటా సుమారు 12 శాతంగా ఉండగా, మూడేళ్లలో ఇది 20 శాతానికి చేరింది. రెండు నెలలకు పైగా చెల్లింపులు చేయని వారి సంఖ్య 5 శాతం నుంచి 8 శాతానికి పైగా పెరిగింది. తమ ఆదాయంలో 40 శాతానికి పైగా రుణాలకే చెల్లించే కుటుంబాల వాటా 6.5 శాతం నుంచి 8.6 శాతానికి పెరిగింది. ఇది 2013 తర్వాత ఇదే అత్యధికం. ఆశ్చర్యకరంగా, ఇదే సమయంలో అమెరికన్ల సగటు ఆదాయం ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేసిన తర్వాత కూడా 7 శాతం పెరిగి 82,200 డాలర్లకు, సగటు నికర సంపద 2 శాతం పెరిగి 2,15,900 డాలర్లకు చేరుకుంది. అయితే, పెరిగిన వడ్డీ రేట్లు, అధిక ధరల పెరుగుదల వారి ఆనందాన్ని ఆవిరిచేశాయి. రుణాల చెల్లింపులు భారంగా మార డంతో ఆర్థిక ఒత్తిడి పెరిగింది. సుమారు 77 శాతం కుటుంబాలు ఏదో ఒక రూపంలో అప్పులు కలిగి ఉన్నాయి. ఈ ఆర్థిక అసమానతలు అన్ని వర్గాల పై ఒకేలా ప్రభావం చూపడం లేదు. అధిక ఆదాయ వర్గాల వారి సగటు నికర సంపద 31 శాతం పెరిగితే, 35 ఏళ్లలోపు వయసున్న యువ కుటుంబాల సగటు సంపద ఏకంగా 23 శాతం తగ్గి 33,000 డాలర్లకు పడిపోయింది. మరోవైపు, 75 ఏళ్లు పైబడిన వారి సంపద 37 శాతం పెరిగింది. దీంతో యువత తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ ఆర్థిక ఒత్తిడి నేపథ్యంలో అమెరికన్లు బై నౌ పే లేటర్ వంటి కొత్త తరహా రుణాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీని వినియోగం 7 శాతం నుంచి 12 శాతానికి పెరిగింది. బీఎన్‌పీఎల్ రుణం ఉన్న కుటుంబాల్లో సగటు బ్యాలెన్స్ 400 డాలర్లుగా ఉంది. క్రెడిట్ కార్డుల వినియోగం, వాటిపై ఉన్న బ్యాలెన్సులు కూడా పెరిగాయి. మొత్తంమీద, స్థూల ఆర్థిక గణాంకాలు సానుకూలంగా కనిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ముఖ్యంగా యువత, మధ్యతరగతి కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. భవిష్యత్తులో ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్న నమ్మకం ప్రజల్లో తగ్గుతున్నట్లు ఇతర సర్వేలు సూచిస్తున్నాయి.

# ఖైబర్‌ఫఖ్తూన్‌ఖ్వాలో అత్యవసరపరిస్థితి

## మంటల్లో గవర్నర్‌హౌస్

**పెషావర్, అక్టోబరు 12:** పాకిస్థాన్‌లో రాజకీయ సంక్షోభం తీవ్రరూపం దాలుస్తోంది. ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో అత్యవసర పరిస్థితి విధించడంతో మొదలైన నిరసనలు హింసాత్మకంగా మారాయి. గవర్నర్ హౌస్ మంటల్లో చిక్కుకున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. మరోవైపు, పలు నగరాల్లో పోలీసులు కాల్పులు జరుపుతున్నట్లు కనిపిస్తున్న వీడియోలు కలకలం రేపుతున్నాయి. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో రాష్ట్రంలో శాంతిభద్రతలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జైలులో ఉన్న మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పాకిస్థాన్ తెహ్రీక్‌ఎఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ నేతృత్వంలోని ప్రావిన్షియల్ ప్రభుత్వాన్ని పక్కనపెడుతూ కేంద్ర ప్రభుత్వం అత్యవసర పరిస్థితి విధించింది. దీంతో ఆదివారం పెద్ద సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారు. ఇస్లామాబాద్‌కు పీటీఐ తలపెట్టిన ర్యాలీకి కూడా భద్రతా చర్యలతో ఆటంకం ఏర్పడింది. గవర్నర్ హౌస్ మంటల్లో చిక్కుకున్న దృశ్యాలు ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాయి. ప్రావిన్స్‌లోని పలు ప్రాంతాల్లో పోలీసులు కాల్పులు, షెల్లింగ్ జరుపుతున్నట్లు మరో వీడియోలో కనిపిస్తోంది. అయితే గవర్నర్ హౌస్‌కు మంటలు ఎలా అంటుకున్నాయి ఎంతమేర ఆస్తి నష్టం జరిగింది ఎవరైనా ప్రాణాలు కోల్పోయారా అనే వివరాలు ఇంకా తెలియరాలేదు. ప్రభుత్వ అణచివేత చర్యల్లో భాగంగా స్వాబీలో పీటీఐ కార్యకర్తలు 59 మందిని, ఖైబర్ జిల్లాలో మరో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసినట్లు స్థానిక మీడియా తెలిపింది. మాజీ ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిది, పీటీఐ ప్రావిన్షియల్ అధ్యక్షుడు జునైద్ అక్బర్‌ను కూడా అదుపులోకి తీసుకున్నట్లు కథనాలు పేర్కొన్నాయి. మరో మాజీ ముఖ్యమంత్రి అలీ అమీన్ ఖాన్ గండాపూర్ తనను డేరా ఇస్మాయిల్ ఖాన్‌లోని నివాసంలో గృహనిర్బంధం చేశారని వెల్లడించారు. ప్రావిన్స్‌లోని ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులపై భద్రతా బలగాలను మోహరించారు. స్వాబీలో మొబైల్ ఫోన్, పీటీసీఎల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేసినట్లు వార్తలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ప్రావిన్షియల్ పాలనపై పట్టు సాధించేందుకు చర్యలు చేపట్టిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. గవర్నర్ పాలన విధించడాన్ని ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇది ప్రజాస్వామ్యంపై దాడి అని అభివర్ణించాయి. ఈ నిర్ణయాన్ని న్యాయస్థానాలతో పాటు ప్రజాక్షేత్రంలోనూ సవాలు చేస్తామని ప్రకటించాయి. ఎన్నికైన నాయకత్వాన్ని బలహీనపరిచేందుకే కేంద్రం ఈ చర్యలకు దిగిందని పీటీఐ ఆరోపించింది. అరెస్టయిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

# బాలిస్టిక్ క్షిపణులు పరీక్షించిన ఉత్తరకొరియా

**సియోల్, అక్టోబరు 12:** ఉత్తర కొరియా తన ఆయుధ సంపదను పెంచుకుంటోంది. తాజాగా పలు బాలిస్టిక్ క్షిపణులను ఆ దేశం పరీక్షించింది. తూర్పు సముద్ర జలాలపై వైపు ఇవాళ క్షిణులను పరీక్షించినట్లు దక్షిణ కొరియా మిలిటరీ ఆరోపించింది. కొరియా దేశాల మధ్య ప్రస్తుతం ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. దక్షిణకొరియా సంయుక్త దళాల ప్రతినిధి జాంగ్ డో యుంగ్ మాట్లాడుతూ ఉత్తర కొరియా రాజధాని ప్యోంగ్యాంగ్ నుంచి పలు రకాల క్షిపణులను పరీక్షించినట్లు చెప్పారు. ప్రధాన విమానాశ్రయాన్నే గత కొన్నేళ్ల నుంచి కీలక లాంచింగ్ సైట్‌గా ఉత్తర కొరియా వాడుకుంటోంది. ఉత్తర కొరియా పరీక్షించిన ఓ క్షిపణి సుమారు 900 కిలోమీటర్ల దూరం ప్రయాణించినట్లు జాంగ్ వెల్లడించారు. అయితే ఎన్ని క్షిపణులను డిటెక్ట్ చేశారన్న విషయాన్ని మాత్రం చెప్పలేదు. జపాన్ డిప్యూటీ రక్షణ మంత్రి తకాశి కోయరి మాట్లాడుతూ 17 నిమిషాల తేడాతో రెండు క్షిపణులను డిటెక్ట్ చేసినట్లు చెప్పారు. ఎకనామిక్ జోన్ బయటి ప్రదేశంలో ఉన్న జలాల్లో ఆ క్షిపణులు పడినట్లు తెలుస్తోంది. తొలి క్షిపణి సుమారు 220 కిలోమీటర్ల దూరం ప్రయాణించి, రెండో క్షిపణి సుమారు 910 కిలోమీటర్ల దూరం ప్రయాణించినట్లు జపాన్ అధికారి చెప్పారు. బహుశా హైపర్‌సోనిక్ ఆయుధాన్ని పరీక్షించి ఉంటారని ఆయన అన్నారు. ఎయిర్‌క్రాఫ్ట్ కానీ నౌకలకు కానీ ఎటువంటి ఇబ్బందికాలేదన్నారు. అణు సామర్థ్యం కలిగిన ఆయుధాలను సిద్ధం చేసేందుకు ఉత్తర కొరియా సుదీర్ఘకాలంగా ప్రయత్నిస్తోంది.

# కుప్పకూలిన పాక్ ఆర్మీ శిక్షణ హెలికాప్టర్ : ఇద్దరు పైలట్లు మృతి



**క్వెట్టా, అక్టోబరు 12:** పాకిస్థాన్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. బలూచిస్థాన్ ప్రావిన్స్ రాజధాని క్వెట్టా సమీపంలో పాకిస్థాన్ ఆర్మీకి చెందిన శిక్షణ విమానం కూలిపోవడంతో ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగినట్లు పాకిస్థాన్ సైన్యం వెల్లడించింది. విమానంలో సాంకేతిక లోపం తలెత్తడం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలిపింది. క్వెట్టా జిల్లాలోని నవాన్ కిల్లీ ప్రాంతం సమీపంలో పాకిస్థాన్ ఆర్మీ ఏవియేషన్‌కు చెందిన ముష్షాక్ శిక్షణ విమానం కూలిపోయింది. మధ్యాహ్నం సమయంలో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సైన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ఘటనలో ఇన్‌స్ట్రక్టర్ పైలట్ మేజర్ హుస్సైన్ షెహజాద్ హుమాయూన్, శిక్షణ పొందుతున్న పైలట్ కెప్టెన్ అబ్దుల్ సమద్ మరణించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలపై మరింత సమాచారం వెలువడాల్సి ఉంది. పైలట్ల మృతిపై అధ్యక్షుడు, ప్రధాని సంతాపం ఇద్దరు సైనిక పైలట్లు మరణించడంపై పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అధ్యక్షుడు జర్దారీ సోషల్ మీడియా వేదిక ‘ఎక్స్’లో స్పందిస్తూ, మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

# సంక్షిప్త వార్తలు

## నిరసనల్లో తీవ్రంగా గాయపడిన అమీర్‌ఖాన్ మేనకోడలు!

**ముంబయి, అక్టోబరు 12:** ఆర్థిక రాజధాని నగరంలోజరిగిన సీజేపీ నిరసనలో పాల్గొని పోలీసుల అదుపులోకి వెళ్లిన బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ మేనకోడలు, నటి జైన్ మేరీ ఖాన్ తనకు అయిన గాయాలను చూపిస్తూ సోషల్ మీడియాలో ఒక వీడియోను పంచుకున్నారు. ఈ పరిణామం ఒకవైపు చర్చనీయాంశం కాగా, మరోవైపు ఇదే నిరసనలో పాల్గొన్న అమీర్ ఖాన్ మేనల్లుడు, నటుడు ఇమ్రాన్ ఖాన్‌పై కేసు నమోదు చేయాలని బీజేపీ నేత కిరీట్ సోమయ్య పోలీసులను ఆశ్రయించడం సంచలనంగా మారింది.

## సిఇసి జ్ఞానేశ్‌ను తొలగించాలంటూ కేరళ అసెంబ్లీ తీర్మానం



**తిరువనంతపురం, అక్టోబరు 12:** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కోరుతూ కేరళ శాసనసభ సోమవారం తీర్మానాన్ని ఆమోదించింది. దేశంలో ఓటు హక్కుల పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఎన్నికల సంఘం నిష్పక్షపాతంపై ఆందోళనలు వ్యక్తం చేస్తూ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. 140 మంది సభ్యులున్న కేరళ శాసనసభలో 16వ అసెంబ్లీ రెండో సమావేశాల తొలిరోజున ఈ తీర్మానం ఆమోదం పొందింది. భారత ఎన్నికల ప్రక్రియ సమగ్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తీర్మానం స్పష్టం చేసింది.

## నేపాల్, బంగ్లా తరహాలో అస్థిరతకు కుట్ర

**న్యూఢిల్లీ,అక్టోబరు 12:** భారతదేశంలో నిరసనల పేరుతో నేపాల్, బంగ్లాదేశ్‌లో మాదిరిగా అస్థిరతను సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సీనియర్ అడ్వకేట్, భారత మాజీ సొలిసిటర్ జనరల్ హరీశ్ సాల్వే సంచలన ఆరోపణలు చేశారు. దేశంలో అశాంతిని రెచ్చగొట్టడంలో విదేశీ శక్తుల పాత్ర ఉండొచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. మీడియా ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కొన్ని నిరసన కార్యక్రమాలకు విదేశాల నుంచి నిధులు అందుతున్నాయని తాను విశ్వసిస్తున్నట్లు సాల్వే తెలిపారు.

## 144 యేళ్ల తర్వాత బర్దా అడవుల్లోకి ఆసియా సింహాలు



**అహ్మదాబాద్, అక్టోబరు 12:** గుజరాత్‌లోని సౌరాష్ట్ర ప్రాంతంలో ఉన్న బర్దా వన్యప్రాణుల అభయారణ్యంలో 144 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆసియా సింహాలు మళ్లీ అడుగుపెట్టాయి. ఒకప్పుడు సింహాల జాడలేని ఈ ప్రాంతం ఇప్పుడు 17 సింహాలతో కళకళలాడుతోంది. ఆసియా సింహాల సంరక్షణలో ఇదొక చారిత్రక విజయంగా పర్యావరణవేత్తలు అభివర్ణిస్తున్నారు. గిర్ అడవులకు మాత్రమే పరిమితమైన సింహాలకు, బర్దా అభయారణ్యం రెండో సురక్షిత ఆవాసంగా మారనుంది. బర్దా వైల్డ్‌లైఫ్ శాంక్చురీ యాజ్ ఏ పొటెన్షియల్ స్ట్రాంగ్‌హోల్డ్ ఫర్ ఏషియాటిక్ లయన్స్ పేరుతో ప్రఖ్యాత ప్లోస్ వన్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, బర్దా అభయారణ్యం సింహాల దీర్ఘకాలిక మనుగడకు అత్యంత అనుకూలమైన ప్రాంతమని తేలింది.

## ఢిల్లీలో ఆరు మెట్రోస్టేషన్ల మూసివేత

**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ నిరసనల నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. విపక్ష ఇండియా కూటమి సోమవారం సుప్రీంకోర్టు వైపు నిరసన మార్చ్ చేపట్టంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. 12న ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆరు మెట్రో స్టేషన్లలో ప్రవేశం, నిష్క్రమణ ద్వారాలను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. పటేల్ చౌక్, జన్‌పథ్, రాజీవ్ చౌక్, మండీ హౌస్, సెంట్రల్ సెక్రటేరియట్, బరాఖంబా రోడ్ మెట్రో స్టేషన్లు మూసేసింది.

# ఆర్టీసీ-మెట్రో ఉమ్మడి పాస్ చార్జీల పునఃపరిశీలన

### బిజెపి డ్రామాలు, డైవర్షన్‌లు పక్కనపెట్టి అర్హులైన పౌరులకు ఓటుహక్కు ఇవ్వండి

### రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



సోమవారం న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి పొన్నం

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన ఆర్టీసి-మెట్రో ఉమ్మడి పాస్ చార్జీలను పునఃపరిశీలించడానికి నిర్ణయించామని తెలంగాణ రవాణ, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు ఆర్టీసీ-మెట్రో ఉమ్మడి పాస్ చార్జీలు సామాన్యుడికి అందుబాటులో లేవని వరుసగా వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో సమీక్ష చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కామన్‌పాస్ ధర 8500 రూపాయలు కాగా అందులో ఏడువేలు మెట్రోకు ఆర్టీసికి 15వందలు వాటాగా నిర్ణయించామని అదే విధంగా ఉమ్మడి మెట్రో-ఆర్టీసి డెయిలీ పాస్ ధర రూ.400 కాగా అందులో రూ.300 మెట్రోకు రూ.100 ఆర్టీసికి వాటా ఇస్తారని వివరించారు. మెట్రోఆర్టీసి ఉమ్మడి పాసు ధర నిర్ణయంచే అంశంపై త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆర్టీసి మెట్రో సేవలను ప్రజలు విస్తతంగా ఉపయో గించా లని ఆర్థికంగా వారికి ప్రయోజనం పొందడంతో పాటు సౌకర్యవంతంగా ప్రయాణం చేయడం పర్యావరణ హితం కోసం కామన్‌పాస్ విధానం అమలు చేస్తామని తెలిపారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా మెట్రోఆర్టీసి ఉమ్మడి పాస్ ధర పునఃపరిశీలన చేయాలని సూచిం చారని మంత్రి పొన్నం వివరించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సర్‌పై వివాదస్పద వ్యాఖ్యలతో రాజకీయ డ్రామాలు, డైవర్షన్ రాజకీయాలు చేయడం పక్కనపెట్టి అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించేందుకు కృషి చేయాలనీ హితవు చెప్పారు. ఎన్నికల సంఘం అధికారాలను మీ జేబు సంస్థలా భావించి మాట్లాడటం మానుకోవాలి ఓటర్ల జాబితా తయారీ, సవరణలు, ఓట్ల తొలగింపు పూర్తిగా భారత ఎన్నికల సంఘం పరిధిలోని రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని అన్నారు. ఓటర్ల జాబితా సవరణల్లో ఫామ్6, ఫామ్ 7 దరఖాస్తుల వినియోగంపై వచ్చిన ఆరోపణలను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సమగ్రంగా పరిశీలించాలనీ డిమాండ్ చేశారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో బిజెపి కార్యకర్తలు ఫామ్7 ద్వారా ఓట్ల తొలగింపునకు ఫిర్యాదులు చేశారా లేదా? రాష్ట్రబిజెపి అధ్యక్షుడు స్పష్టంగా సమాధానం చెప్పాలనీ కోరారు. ఓటర్ల జాబితా సవరణల్లో పారదర్శకతపై ప్రజలకు నమ్మకం కలిగించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎన్నికల వ్యవస్థపై అనుమానాలు కలిగించిన పరిస్థితులపై స్పష్టత ఇవ్వాలి. ఓటు హక్కు గురించి ప్రశ్నిస్తే ఎంఐఎం, ఓవైసీ పేర్లను తెరపైకి తెచ్చి సమస్యను మతపరమైన కోణంలోకి మళ్లించడం బిజెపి రాజకీయ ప్రతిదాడి వ్యూహం అమలు చేస్తోందని విమర్శించారు.

ఓటు హక్కు ఏ ఒక్క మతానికో, రాజకీయ పార్టీకో పరిమితమైనది కాదు.. అది ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. ఓట్ల తొలగింపు, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత వంటి అసలు సమస్యలపై సమాధానం చెప్పకుండా ప్రజల దృష్టిని మళ్లించలేరనీ కేంద్రంలో పదేళ్లకు పైగా అధికారంలో ఉన్న బిజెపి తెలంగాణకు, రాష్ట్ర రైతాంగానికి ఏం సాధించిందో ప్రజలకు సమాధానం చెప్పాలి. రాష్ట్ర విభజన హామీలు, రైతుల సంక్షేమం వంటి అంశాలపై కేంద్రం నుంచి తెలంగాణకు అందిన సహకారంపై స్పష్టత ఇవ్వాలనీ కోరారు.

# పర్యావరణహిత నగరాల నిర్మాణానికి ప్రాధాన్యత

### పార్లమెంటరీ స్థాయీ సంఘం తొలి సమావేశానికి హాజరైన ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** పర్యావరణహిత నగరాల నిర్మాణంకు ప్రాధన్యాత ఇవ్వాలని ఆధునిక అవసరాలకు అనుగుణంగా రోడ్లకు ఇరువైపుల చెట్లు ఉండేలా అండర్‌గ్రౌండ్ కేబుల్ సిస్టమ్‌తో మౌలిక వసతుల అభివృద్ధి చేయాలని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. 2026 సంవత్సరానికి నూతనంగా ఏర్పాటు చేసిన పార్లమెంటరీ గృహనిర్మాణం పట్టణ వ్యవహారాల స్థాయీ సంఘం తొలి సమావేశానికి భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి సోమవారం న్యూఢిల్లీలో హాజరయ్యారు. విద్యుత్ లైన్ల కోసం చెట్లను కొట్టివేస్తున్నామని పర్యావరణంలో ఆక్సిజన్ లోపిస్తోందని ప్రాణవాయువు పెంపుకు అనుకూలంగా నగరాలు నిర్మించాలని దీనికి కేంద్రం రాష్ట్రాలకు ఇతోధికంగా తోడ్పాటు అందించాలనికోరారు. ఈ సమావేశంలో కమిటీ పరిశీలనకు తీసుకోవాల్సిన అంశాల ఎంపికపై చర్చించారు. నూతన కమిటీ ఏర్పాటైన సందర్భంగా కమిటీ ఛైర్మన్ గౌరవ మాగుంట శ్రీనివాసులు రెడ్డికి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అభినందనలు తెలియజేసి, కమిటీ విజయవంతంగా పనిచేయాలని ఆకాం క్షించారు. దేశంలో గృహనిర్మాణ రంగం అభివృద్ధి, పట్టణ మౌలిక సదుపా యాల విస్తరణ, ప్రజలకు మెరుగైన పట్టణ సేవలు అందించడం వంటి కీలక అంశాలపై కమిటీలో నిర్మాణాత్మక చర్చలు జరిపి, ప్రజలకు ప్రయోజనం చేకూర్చే సిఫారసులు చేయడానికి కృషి చేస్తానని ఎంపిచామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# ఓటు చోరీని అడ్డుకోవడానికి ఢిల్లీ వైపు కదులుతున్న దేశ ప్రజలు

### పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** ఓటుచోరీని అడ్డుకోవడం కోసం ఉద్యమించడానికి ఇప్పుడు దేశ ప్రజల ఢిల్లీకి కదలిలా కదలి వస్తున్నారని పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌అన్నారు. సోమవారం ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా యువత మోడీ, ఎన్నికల కమిషన్ చేస్తున్న ఓట్ల అక్రమాలపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారనీ చెప్పారు. ఓట్ల చోరితోనే దేశంలో గెలవాలని బిజెపి కుట్రలు చేస్తోందనీ ఆరోపించారు. అందుకు ఎన్నికల కమిషన్ బిజెపి మద్దతు ఇస్తుందని వాపోయారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎఐసిసి అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్ర మార్క తదితరులు ఈ నిరసన ర్యాలీలో పాల్గొన్నారనీ వివరించారు. సుప్రీంకోర్టు మా వాదనలు వినాలనీ సర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని అనేక ఆధారాలు ఉన్నా యనీ చెప్పారు. కేంద్ర ఎన్నికల కమిషనర్‌ను రాజీనామా చేయించాలనీ డిమాండ్ చేశారు. జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయకపోతే కేంద్ర ప్రభుత్వం భర్తరఫ్ చేయాలనీ కోరారు. అప్పటివరకు మా పోరాటం కొనసాగుతుందనీ తేల్చిచెప్పారు. సర్‌కు వ్యతిరేకంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి రాజీనామా చేయాలని దేశ రాజధాని న్యూఢిల్లీలో నినాదాలు చేశారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి పార్టీలు, యువత, పౌర సమాజ ప్రతినిధులు చేపట్టిన సుప్రీంకోర్టు మార్చ్‌లో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. సర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనల గొంతును అణచివేయడం సమంజసం కాదని స్పష్టం చేశారు.

# వ్యవసాయ మార్కెట్లకు సోలార్ విద్యుత్

### రాష్ట్రవ్యాప్తంగా గోదాములకు సైతం ఏర్పాటు

### రూ.1.53 కోట్లతో 289 కిలోవాట్ల ఉత్పత్తి ప్లాంట్లు

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులు, గోదాంల్లో దశలవారీగా సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయించింది. వ్యవసాయ మార్కెట్ యార్డులు, రైతు బజార్లలో విద్యుత్ ఖర్చులను తగ్గించడానికి మరియు పగటిపూట నిరంతర విద్యుత్ అవసరాల కోసం సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రణాళిక అమలైతే వ్యవసాయ మార్కెట్ యార్డులపై పడుతున్న విద్యుత్ బిల్లుల భారం తగ్గుతాయి. తొలి విడతలో రాష్ట్రంలోని వరంగల్, గద్వాల, నిజామాబాద్, సూర్యాపేట మార్కెట్లలో సుమారు రూ.1.53 కోట్ల అంచనా వ్యయంతో సోలార్ విద్యుత్ ఫలకాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. తద్వారా దాదాపు 289 కిలోవాట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా కలిగి ఉంది. నిజామాబాద్‌లో 212 కిలోవాట్లు, సూర్యాపేటలో 69 కిలోవాట్లు, గద్వాల 10 కిలోవాట్ల చొప్పున సోలార్ ప్లాంట్లను అందుబాటులోకి తీసుకురావాలని ప్రతిపాదించింది. అలాగే రెండో దశ(ఫేజ్2)లో షాద్‌నగర్‌లో 64 కిలోవాట్లు,, వరంగల్లో 90 కిలోవాట్లు, మిర్యాలగూడలో 40 కిలోవాట్లు, ఆదిలాబాద్లో 30 కిలోవాట్లు, నకిరేకల్లో 24 కిలోవాట్లు, ఖమ్మం జిల్లా మద్దుపల్లిలో 22 కిలోవాట్లు, తుంగతుర్తిలో 2 కిలోవాట్ల మేర సోలార్ ప్లాంట్లను అందుబాటులోకి తీసుకురానుంది. ఇక హైదరాబాద్ పరిధిలోని మలక్‌పేట్, పటాన్‌చెర్వు, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాలతో కలిపి 21 ప్రాంతాల్లో సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది.

# అగ్రి కోర్సులకు 14, 15న మూడో దశ కౌన్సెలింగ్

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని రెగ్యులర్ కోటా బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల్లో మిగిలిన సీట్లకు మూడో దశ కౌన్సెలింగ్‌ను ఈ నెల 14, 15న నిర్వహించనున్నట్టు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక కోటా బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల్లో మిగిలిన సీట్లకు ఈ నెల 16న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు వివరించారు. ఈ రెండు కౌన్సెలింగ్‌లు రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరుగనున్నాయని తెలిపారు. వివరాలకు తమ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.




సమావేశంలో మాట్లాడుతున్న బండా ప్రకాశ్, బోమ్మరబోయిన కేశవులు, మాజీ న్యాయమూర్తి భవానీప్రసాద్ తదితరులు

# ఖమ్మానికి ఆధ్యాత్మిక వైభవం

### కొలువుదీరనున్న కలియుగ దైవం

### శ్రీవారి ఆలయ నిర్మాణానికి శాస్త్రోక్తంగా భూమిపూజ, శంకుస్థాపన

### భక్తులంతా ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి : చినజీయర్‌స్వామి

### ఆలయ నిర్మాణానికి మంత్రి తుమ్మల కృషి కీలకం : టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు

**ప్రభాతవార్త / ఖమ్మం కల్చరల్, అక్టోబరు 12:** ఖమ్మం నగరానికి ఆధ్యాత్మిక శోభను తీసుకు వచ్చేలా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం శ్రీకారం చుట్టారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీనివాసుడు ఖమ్మంలో కొలువుదీరేందుకు తొలి అడుగు పడిందని త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. ఖమ్మం అర్బన్ మండలం దరుసులా పురం రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 408/2లో నిర్మించనున్న ఆలయానికి వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా భూమిపూజ, శంకుస్థాపన నిర్వహించారు. చినజీయర్ స్వామి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్చకులు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

**రెండు తెలుగు రాష్ట్రాలకు ఆధ్యాత్మిక వారధి**

ఖమ్మం నగరం రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానించే ప్రాంతం గా మాత్రమే కాకుండా ఆధ్యాత్మికంగానూ ప్రత్యేక గుర్తింపు పొందాలని చిన్నజీయర్ స్వామి ఆకాంక్షి ంచారు. ఆశ్వ యుజ మాసం సోమ వారం నాడు శ్రీవారి ఆల యానికి శంకుస్థాపన జరగడం దైవ సంకల్పంగా భావిస్తున్నామని తెలిపారు.

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో ఆలయ నిర్మాణానికి శ్రీకారం**

ఖమ్మంలో శ్రీవారి ఆలయ నిర్మాణం ప్రారంభం కావడానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన కృషి ప్రధాన కారణమని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు.



సోమవారం దరుసులాపురంలో నిర్మించనున్న ఆలయానికి శాస్త్రోక్తంగా భూమిపూజ, శంకుస్థాపన నిర్వహిస్తున్న చినజీయర్‌స్వామి తదితరులు

దేశవ్యాప్తంగా శ్రీవారి ఆలయాల నిర్మాణంతో పాటు సనాతన ధర్మ పరిరక్షణకు టీటీడీ కృషి చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. స్థానిక ఆలయ నిర్మాణానికి టీటీడీ నిబంధనల ప్రకారం 25 శాతం నిధులను స్థానిక భక్తులు సమకూర్చాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఖమ్మంలో సుమారు రూ.100 కోట్ల విలువైన భూమిని ఆలయ నిర్మాణం కోసం కేటాయించడం సంతోషకర మన్నారు. నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

**పూర్వజన్మ సుకృతం: మంత్రి తుమ్మల**

శ్రీవారి ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన చిన్నజీయర్ స్వామికి, ఆలయ నిర్మాణానికి సహకరించిన టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కు

### ప్రభుత్వ వ్యవహారాల్లో పారదర్శకత, అధికారుల్లో జవాబుదారీతనం పెరగాలి

### మండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్

**హైదరాబాద్, అక్టోబరు 12,ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కు అని సమాచారం చెప్పడం ప్రభుత్వ వ్యవస్థల బాధ్యత అని ప్రభుత్వ వ్యవహారాల్లో పారదర్శకత, అధికారుల్లో జవాబుదారీతనం పెరగాలని శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. ఈమేరకు సోమవారం సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ ఛైర్మెన్ డా.బొమ్మరబోయిన కేశవులు ఆధ్వర్యంలో అవగాహన సదస్సుకు నిర్వహించారు. దీనికి బండా ప్రకాశ్ ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ భారత రాజ్యాంగం మనకు ప్రజాస్వామ్య వ్యవస్థను అందించిందని, దానిని మరింత అర్థవంతంగా మార్చుకోవడానికి సమాచార హక్కు చట్టం శక్తి వంతమైన మార్గం అని వివరించారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గ్రంధి భవానీ ప్రసాద్ మాట్లాడుతూసమాచార హక్కు చట్టం అంటే ప్రభుత్వ ప్రజా అధికార వ్యవస్థల వద్ద ఉన్న సమాచారాన్ని చట్ట ప్రకారం పొందే హక్కు అని తెలిపారు. సమాచార హక్కు చట్టం అనేది అధికారులను ఇబ్బంది పెట్టే ఆయుధం కాదని, ప్రజా వ్యవస్థలను బాధ్యతాయుతంగా పనిచేయించే ప్రజాస్వామ్య సాధనం అని వివరించారు. మన ఉద్దేశం ప్రజా ప్రయోజనానికి అనుగుణంగా ఉండాలనీ, మనకు వచ్చిన సమాచారాన్ని బాధ్యతతో ఉపయోగించాలనీ వివరించారు. ప్రజాస్వామ్యం అనేది కేవలం పార్లమెంటులోనో, శాసనసభలోనో ఉండేది కాదనీ, మన వ్యవస్థలో ఉంటుందన్నారు. సమాచార హక్కు అనేది ప్రజల చేతిలో ఉన్న ఒక ప్రజాస్వామ్య ఆయుధం అని పేర్కొన్నారు.

ఈకార్యక్రమంలో తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చొప్పరి శంకర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి శివయ్య ముదిరాజ్ గాడిపల్లి మధు, శివాజీగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, బాలకృష్ణ, మేకల శ్రీహరి, నరసింహా , మధుకర్, జితేందర్, రాజేష్, సోనారాణి, తండ కుమారస్వామి, పుట్ట విజయ్ కుమార్, మెట్టు మధు, కల్వల హరికృష్ణ, కాసుల అజయ్ కుమార్, కారింగు వెంకన్న, పేరిక చందు, వివిధ రాష్ట్రాల , జిల్లాల కన్వీనర్లు, కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# యాసంగిలో వరి సాగుకు దూరం

### ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో యాసంగి సీజనులో వరితో పాటు, ఎక్కువ నీటి వినియోగం అయ్యే పంటలకు దూరంగా ఉండాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన రైతునేస్తం కార్యక్రమంలో మాట్లాడుతూ రైతులను అప్రమత్తం చేయడంతో పాటు, ప్రస్తుత పంటలను కాపాడేందుకు, ఈ యాసంగి సీజన్‌లో నష్టాలను నివారించేందుకు సమన్వయంతో పనిచేయాలన్నారు. వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో లోటు వర్షపాతం, నీటి నిల్వలు పడిపోవడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి ప్రభుత్వం ఏప్రిల్ నుంచే ముందస్తు చర్యలు ప్రారంభించిందని పేర్కొన్నారు. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందుబాటులో ఉన్న నీటి వనరులు, పంటల పరిస్థితుల ఆధారంగా సరైన నిర్ణయాలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ యాసంగిలో వరి సాగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వరి సాగు చేయకుండా, తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలు, స్వల్పకాలిక పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శనగ, పెసర, మినుము, వేరుశనగ, పొద్దుతిరుగుడు, కుసుమ వంటి పంటలను ప్రోత్సహించాలన్నారు. ప్రాంతీయ పరిస్థితులు, నేల స్వభావం, నీటి లభ్యతను పరిశీలించి వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు పంటలను ఎంపిక చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. పప్పుధాన్యాలు, నూనెగింజల విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించడంతోపాటు, వాటికి మార్కెటింగ్ సదుపాయాలు, కొనుగోలు అవకాశాలు ఉండేలా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఒకే విధమైన పరిస్థితులు లేవని, జిల్లా, మండల, గ్రామ స్థాయిలో నీటి లభ్యతను బట్టి పంటల ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు. రైతులు నష్టపోకుండా సరైన పంటల ఎంపిక చేసుకునేలా బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎస్ సంజయ్ జాజు, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# అవసరాలకు అనుగుణంగా అదనపు సర్వీసులు

### మూడు రోజుల్లోనే 1.40 కోట్ల మంది ప్రయాణం

### ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** దసరా పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల రవాణా సౌకర్యార్థం అవసరాలకు అనుగుణంగా అదనపు సర్వీసులను నడపనున్నట్లు ఆర్టీసీ ఎండి వై నాగిరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో సోమవారం అధికారులతో జూమ్ సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ పండుగ వేళ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సర్వీసులను నిరంతరం పర్యవేక్షి ంచాలన్నారు. గత ఏడాది దసరా తొలి మూడు రోజుల్లో 922 అదనపు బస్సులను నడపగా, ఈ నెల 9, 10, 11 తేదీలలో గతంతో పోలిస్తే 495 బస్సులు అదనంగా, అంటే మొత్తం 1,417 ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా దసరా పండుగ వేళ మహిళలకు భారీగా ఆర్థిక ప్రయోజనం చేకూరుతోందన్నారు. గత ఏడాది దసరా సమయంలో రోజుకు సగటున రూ. 13.02 కోట్లు ఆదా కాగా, ఈ ఏడాది దసరా రద్దీ సమయంలో మహిళలు రోజుకు రూ. 13.73 కోట్ల మేర ఆదా చేసుకోగలిగారని చెప్పారు. పండుగ ముందు రద్దీని దృష్టిలో ఉంచుకుని స్వంత ఊర్లకు ప్రయాణమయ్యే వారి కోసం ఈ నెల 15, 16, 17 తేదీల్లో కూడా రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను నడపనున్నట్లు వెల్లడించారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ మరియు ప్రత్యేక బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం యథావిధిగా అమల్లో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ కోసం సంస్థ వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవచ్చని, ఇతర వివరాలు మరియు ప్రయాణ సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 04069440000, 04023450033 లలో సంప్రదించాలని సూచించారు.

# రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన సుదర్శన్‌గౌడ్ కుటుంబానికి రూ.6లక్షల సాయం ప్రకటించిన సిఎం

**హైదరాబాద్,అక్టోబరు12,ప్రభాతవార్త:** రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన జగిత్యాల జిల్లా హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించారు. ఉపాధి కోసం నాలుగు నెలల క్రితం ఉక్రెయిన్‌కు వెళ్లిన సుదర్శన్ గౌడ్ క్షి పణులు, డ్రోన్ దాడుల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోవడం పట్ల ముఖ్యమంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, సంతాపం తెలిపారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. సుదర్శన్ గౌడ్ భార్య విజ్ఞప్తి మేరకు ఈ ఘటనను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి బాధిత కుటుంబానికి రూ.6 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) నుంచి ఈ ఆర్థిక సహాయం అందించేందుకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సుదర్శన్ గౌడ్ భౌతికకాయాన్ని స్వదేశానికి తీసుకురావడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను

# నకిలీ పత్తి విత్తనాల కేసులో మాజీ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ అరెస్ట్

### అక్రమ వ్యాపారంలో కీలక పాత్ర ఉన్నట్లు ఆరోపణలు

### మూడు కేసుల్లో నిందితుడిగా గుర్తింపు

### 2,317 కిలోల నకిలీ విత్తనాలు స్వాధీనం

**కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 12, ప్రభాతవార్త:** జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల అక్రమ కొనుగోలు, విక్రయాలు, రవాణాకు పాల్పడుతున్న వారిపై పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో గతంలో కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో టాస్క్ ఫోర్స్ ఎస్ఐగా పనిచేసిన సేగ్యం వెంకటేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. నకిలీ పత్తి విత్తనాల అక్రమ వ్యాపారంలో సహకరించినట్లు వచ్చిన ఆరోపణలు, ఇతర నిందితుల వాంగ్మూలాలు, సాంకేతిక ఆధారాల ఆధా రంగా ఆయనను ఈ కేసులో మూడో నిందితుడిగా గుర్తించినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ వెల్లడించారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు తెలిపారు.

**రెండు క్వింటాళ్ల నకిలీ విత్తనాలు పట్టివేత**

ఆగస్టు 11న ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు సమీపంలో నకిలీ పత్తి విత్తనాలను అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఆసిఫాబాద్ పోలీసులు, మండల వ్యవసాయ అధికారి సహకారంతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీ 19 బి 1120 నంబరు గల నలుపు రంగు కారులో ప్రయాణిస్తున్న షేక్ సల్మాన్, ఆరె వేణుగోపాల్ రెడ్డిలను తనిఖీ చేయగా నాలుగు పాలిథిన్ సంచుల్లో సుమారు రెండు క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో షేక్ సల్మాన్‌ను మొదటి నిందితుడిగా, ఆరె వేణుగోపాల్ రెడ్డిని రెండో నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం వారిని న్యాయస్థానంలో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

**రూ.20 లక్షలతో 40 క్వింటాళ్ల విత్తనాల సరఫరా?**

పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసిన వివరాల ప్రకారం.. మొదటి నిందితుడు షేక్ సల్మాన్ 2025 నుంచి నకిలీ పత్తి విత్తనాల కొనుగోలు, విక్రయాలకు పాల్పడుతున్నట్లు వెల్లడైంది. గతంలో నకిలీ విత్తనాల కేసులో అప్పటి టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ వెంకటేష్ తనను అదుపులోకి తీసుకున్న సమయంలో పరిచయం ఏర్పడిందని సల్మాన్ తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. అదేవిధంగా నకిలీ విత్తనాల వ్యాపారంలో వెంకటేష్ తనకు సహకరించ డంతోపాటు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఆరె వేణుగోపాల్ రెడ్డిని పరిచయం చేసినట్లు సల్మాన్ వాంగ్మూలంలో పేర్కొన్నట్లు వెల్లడించారు. 2026లో నకిలీ విత్తనాల వ్యాపారం చేసేందుకు వెంకటేష్‌ను సంప్రదిం చగా, ప్రతి కిలో విత్తనానికి రూ.100 కమీషన్ ఇస్తే సహకరిస్తానని చెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. మొదటి, రెండో నిందితుల వాంగ్మూలాల ప్రకారం సుమారు రూ.20 లక్షల విలువైన 40 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను మూడు విడతల్లో సరఫరా చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు. వీటిలో 35 క్వింటాళ్లను మధ్యవర్తులకు విక్రయించి, మిగిలిన ఐదు క్వింటాళ్లను నేన్నెల మండలంలోని ఒక పౌల్ట్రీ ఫారంలో నిల్వ ఉంచినట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆగస్టు 11న మిగిలిన విత్తనాలను తీసుకెళ్లేందుకు వెళ్లిన మొదటి, రెండో నిందితులు సుమారు రెండు క్వింటాళ్ల విత్తనాలను కారులో ఎక్కించుకుంటుండగా పోలీసులకు పట్టుబడ్డారు. న్యాయస్థానం అనుమతితో నిందితులను పోలీసు కస్టడీలోకి తీసుకొని విచారించగా, మరో 200 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.




నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా నితికా పంత్



అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

# అసెంబ్లీ ప్రాంగణంలో బతుకమ్మ సంబురాలు

**చప్పట్లు కొడుతూ భక్తిశ్రద్ధలతో పాటలు పాడిన మహిళలు**

**పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి**

**హైదరాబాద్,అక్టోబరు12,ప్రభాతవార్త:** బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతిని ఆరాధించే గొప్ప సంస్కృతికి ప్రతీక అని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శమని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కొనియాడారు. అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన బతుకమ్మ సంబురాలు అంబరాన్ని తాకాయి. ఈ సంబరాల్లో శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ పాల్గొన్నారు. బంతి, చామంతి, గునుగు, తంగేడు పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను మధ్యలో ఉంచి, మహిళా ఉద్యోగులు, సిబ్బంది చుట్టూ చేరి 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ పాటలు పాడుతూ ఆడి పాడారు. మహిళలంతా బతుకమ్మల చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ భక్తిశ్రద్ధలతో పాటలు పాడారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయత, ఉత్సాహం మధ్య సాగిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణం సోమవారం సాయంత్రం రంగు రంగుల పూలతో, ఆడపడుచుల ఆనంద కోలాహలంతో కళకళలాడింది. బతుకమ్మ వేడుకల్లో శాసనమండలి సెక్రెటరీ డా. నరసింహాచార్యులు, శాసనసభ సెక్రెటరీ ఆర్.తిరుపతి శాసనసభ, శాసనమండలి ఉన్నతాధికారులు, మహిళా ఉద్యోగులు, ఇతర సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## రియాద్‌లో క్షిపణి దాడి..

## కామారెడ్డివాసికి గాయాలు, విషమం

**హైదరాబాద్,అక్టోబరు 12,ప్రభాతవార్త:** సౌదీ అరేబియాలోని రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై శనివారం జరిగిన క్షిపణి దాడుల్లో కామారెడ్డికి చెందిన 36 ఏళ్ల షేక్ సయీద్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఆయన పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. రియాద్‌లోని కింగ్ ఫహద్ ఆర్మ్డ్ ఫోర్సెస్ ఆస్పత్రిలో ఆయనకు చికిత్స కొనసాగుతోంది. కామారెడ్డిలోని సైనీ బాబా కాలనీకి చెందిన షేక్ సయీద్ సుమారు 12 ఏళ్లుగా సౌదీ అరేబియాలో ఉంటున్నాడు. కొన్నేళ్లుగా రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని స్టార్‌బక్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ దాడిలో 13 మందికిపైగా మృతి చెందగా 300 మందికి గాయాలైనట్లు తెలుస్తోంది.




మీడియాతో మాట్లాడుతున్న మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి

## చిన్నారి హత్య కేసులో నిందితుడు అరెస్టు

**24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు**

**హైదరాబాద్ (కంటోన్మెంట్), అక్టోబరు 12, ప్రభాతవార్త:** 5 యేండ్ల చిన్నారి హత్య కేసును 24 గంటల్లో ఛేదించి నిందితున్ని అరెస్ట్ చేశామని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి తెలిపారు. బొల్లారం పోలీస్ స్టేషన్ కౌకూర్‌లోని విల్లా ఆర్కిడ్స్ విల్లా నెం 84లో నివాసం ఉంటున్న సీడ్ వర్క్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థలో రీసెర్చ్‌సైన్‌సిస్ట్‌గా పనిచేస్తున్న మిల్టన్ ఫెర్నాండేస్ మోసెస్ 5 యేళ్ల కుమార్తె అరేలియా (మోను) ఈ నెల 11న సాయంత్రం గేటెడ్ కమ్యూనిటీలోని క్లబ్ హౌజ్‌లో గేమ్స్‌జోన్‌కు సైకిల్‌పై వెళ్లింది. బిహార్‌కు చెందిన విక్రమ్ కుమార్ ఆ చిన్నారిని పట్టుకొని కాళ్లు,చేతులు కట్టి షెల్లార్‌లో ఉన్న నీటి సంపులో వేశాడు. అక్కడి నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చి మీ చిన్నారిని తాను కిడ్నాప్ చేశానని తల్లిదండ్రులకు ఫోన్ చేసి రూ.20 లక్షలు డిమాండ్ చేశాడని తెలిపారు. ఆ పాప తల్లిదండ్రుల నుంచి డబ్బులు డిమాండ్ చేయాలనే ఉద్దేశంతో షెల్లార్‌లోకి తీసుకెళ్లి తాడుతో బందించి నీటి సంపులో వేశానని నిందితుడు వెల్లడించినట్లు ఆమె తెలిపారు. నగరంలోని వివిధ కాలనీల్లోని గేటెడ్ కమ్యూనిటీల్లో పనిచేసే సెక్యూరిటీ, వాచ్‌మెన్, గృహ సహాయకుల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. కిడ్నాప్‌కు గురైన సురక్షితంగా గుర్తించి నిందితున్ని పట్టుకునేందుకు మల్కాజిగిరి జోన్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ),క్రైం స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన సిబ్బందితో 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితున్ని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. అనుమానిత మొబైల్ నెంబర్,కాల్ వివరాలు ,అందుబాటులో ఉన్నసీసీటీవి ఫుటేజీ,సాంకేతిక ఆధారాలను పరిశీలించి కేసును వేగవంతం చేశామన్నారు.

**డిసిపి కార్యాలయం ముందు చిన్నారి తల్లిదండ్రులు, బంధువుల ధర్నా**

కౌకూర్‌లోని విల్లా ఆర్కిడ్స్‌లో హత్య చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ చిన్నారి తల్లిదండ్రులు,బంధువులు,గేటెడ్ కమ్యూనిటీ కాలనీ వాసులు,స్వచ్ఛంద సంస్థలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్లే కార్డులు చేతబూని మల్కాజిగిరి డిసిపి కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. హత్య చేసిన నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ చిన్నారి తల్లిదండ్రులకు,బంధువులకు హామీ ఇచ్చారు. అరెస్ట్ అయినా నిందితుడు విక్రమ్ కేసు దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి చట్టప్రకారం కేసు విచారణను ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ చేసేందుకు కఠినమైన మరణశిక్ష పడేందుకు చర్యలు తీసుకుంటానని సీపీ సుమతి హామీ ఇచ్చారు.చిన్నారి బంధువులు, కాలనీవాసులు ప్లకార్డులు చేతబూని హత్యకు గురైన చిన్నారి అరేలియా (మోను)ను చంపిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ప్లకార్డులు చేతబూని డిసిపి కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు.

## పూంచ్ సెక్టార్‌లో చొరబాటుదారుల ఎన్‌కౌంటర్

**మృతుల్లో లష్కరే కీలక నేత మమ్మద్ ఫైజాన్**

**శ్రీనగర్, అక్టోబరు 12:** భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన లష్కరే తొయిబా కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈసారి ఆ ఉగ్రముఠా కీలక నేతల్లో ఒకరు మృత్యువును తప్పించుకోలేకపోయాడు. జమ్ముకశ్మీర్‌లోని సరిహద్దు రేఖ గుండా దేశంలో అడుగుపెట్టాలనుకున్న ఈ ముష్కర మూకలోని నలుగురు ఇంప్రోవైజ్డ్ ఎక్స్‌ప్లోజిక్ డివైజ్ పేలుడులో హాతమయ్యారు. సోమవారం సంభవించిన ఈ పేలుడులో లష్కరే ప్రధాన నాయకుడు మొహమ్మద్ ఫైజాన్ సహా నలుగురు మరణించారు. ఎల్ఓసీ దరిదాపుల్లో చొరబాట్లను నివారించేందుకు ఏర్పాటు చేసిన మైన్స్ ఉగ్ర కుట్రకు చరమగీతం పాడాయి. సరిహద్దు రేఖ వెంబడి అక్రమంగా భారత్‌లో ప్రవేశించి ఉగ్రదాడులకు పాల్పడాలనుకున్న లష్కరే తొయిబాకు చెందిన ఒక బృందం కథ ముగిసింది. జమ్ముకశ్మీర్‌లో ఎల్ఓసీ గుండా చొచ్చుకు వచ్చేందుకు ప్రయత్నించిన నలుగురు ఇంప్రోవైజ్డ్ ఎక్స్‌ప్లోజిక్ డివైజ్ పేలుడులో హాతమయ్యారు. వీరిలో లష్కరే ప్రధాన నాయకుల్లో ఒకడైన మొహమ్మద్ ఫైజాన్ ఉన్నాడు.

# భారత్-జపాన్ మధ్య స్నేహబంధాలు మరింత బలోపేతం కావాలి

**మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి**

**తెలంగాణ-హిరోషిమా మధ్య పారిశ్రామిక, సాంకేతిక, విద్యా రంగాల్లో సహకారం మరింత పెరగాలి : స్పీకర్ ప్రసాద్‌కుమార్**

**హైదరాబాద్,అక్టోబరు12,ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య వ్యవస్థల బలోపేతానికి అంతర్జాతీయ శాసనసభల మధ్య పరస్పర సహకారం అవసరం అని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. తెలంగాణ అసెంబ్లీని జపాన్ హిరోషిమా ప్రిఫెక్చరల్ అసెంబ్లీ, ప్రభుత్వ ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా సోమవారం అసెంబ్లీలో జపాన్ దేశానికి చెందిన హిరోషిమా ప్రిఫెక్చరల్ అసెంబ్లీ, ప్రిఫెక్చరల్ ప్రభుత్వ ప్రతినిధుల బృందంతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ డా. నర సింహాచార్యులు, శా సన సభ సెక్రెటరీ ఆర్. తిరుపతి, ఇతర ఉన్నతాధికారులు పా ల్గొన్నారు. అంతకు ముందు జపాన్ ప్రతినిధుల బృం దానికి తెలంగాణ శాసనసభ తరపున ఘన స్వాగతం పలికారు. భారతదేశం, జపాన్ దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాలు పరస్పర విశ్వాసం, గౌరవం, సహకారానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. జపాన్ దేశం సాంకేతిక పరిజ్ఞానం, సమావేశంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మండలి సెక్రెటరీ




సోమవారం అసెంబ్లీలో జపాన్‌కు చెందిన హిరోషిమా ప్రభుత్వ ప్రతినిధుల బృందంతో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

పారిశ్రామిక అభివృద్ధి, క్రమశిక్షణ, పరిశోధనలు, ఆవిష్కరణల రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం కూడా సమాచార సాంకేతికత, ఫార్మా, వ్యవసాయం, విద్య, వైద్య రంగాలతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధిలో వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం, జపాన్‌లోని హిరోషిమా ప్రాంతం మధ్య పారిశ్రామిక, సాంకేతిక, విద్యా, సాంస్కృతిక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. హిరోషిమా నగరం ప్రపంచ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని, రెండో ప్రపంచ యుద్ధంలో తీవ్ర విధ్వంసాన్ని ఎదుర్కొన్నప్పటికీ శాంతి, పునర్నిర్మాణం, అభివృద్ధికి ప్రపంచవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. హిరోషిమా ప్రజలు చూపిన ఆత్మవిశ్వాసం, పట్టుదల, శాంతి సందేశం ప్రపంచ దేశాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రపంచంలో శాంతి, సామరస్యం, సుస్థిర అభివృద్ధి సాధించేందుకు దేశాల మధ్య పరస్పర సహకారం అత్యంత అవసరమని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జపాన్ పెట్టుబడులు మరింత పెరగాలని, ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలు ఏర్పాటు చేసేందుకు పరస్పర సహకారం అవసరమని అభిప్రాయపడ్డారు.

# ఓటు చోరీ చేస్తోన్న మోడీ సర్కారు

**మంత్రి శ్రీధర్‌బాబు ధ్వజం**

**హైదరాబాద్,అక్టోబరు12,ప్రభాతవార్త:** సర్(ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియ ద్వారా అర్హులైన ఓటర్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలు కేంద్ర ఎన్నికల సంఘంపై విమర్శలు చేశారు. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పిలుపుతో సోమవారం ఢిల్లీలో నిరసనకు దిగారు. సుప్రీంకోర్టు వరకు మార్చ్ నిర్వహించే ప్రయత్నం చేస్తామని కాంగ్రెస్ నేతలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సర్కారుపై తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్ ఉపయోగించుకొని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించిందని.. అర్హులైన ఓటర్లను తొలగించిందని ధ్వజమెత్తారు. బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీ చేస్తోందని ఫైర్ అయ్యారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న ధర్నాలో తెలంగాణ మంత్రులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు.

'సర్'ను రద్దు చేయాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా పిలుపు నిచ్చారని వ్యాఖ్యానించారు. సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటుందని ఆగ్రహించారు. ఎన్నికల కార్యాలయం పక్షపాతం చూపిస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ తీరును తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాహుల్ గాంధీ మల్లికార్జున ఖర్గే, పిలుపుతో ప్రజాస్వామ్య గొంతును వినిపించేందుకు తాము ఢిల్లీ వచ్చామని తెలిపారు. కేంద్రం, సీఈసీపై తమ నిరసన తెలియజేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీ చేస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్యుడి ఓటు హక్కును కాపాడేలా తాము పోరాటం చేస్తున్నామని వ్యాఖ్యానించారు. ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ పిలుపుమేరకు తాము ఢిల్లీకి వచ్చామని వెల్లడించారు.

'సర్' ద్వారా ఓట్లు తొలగించి.. ఆయా రాష్ట్రాల్లో అధికారంలోకి రావాలని మోదీ సర్కార్ ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. అన్ని చోరీలు అయిపోయాయని.. ఇప్పుడు ఓట్ల చోరీ చేస్తోందని ఆగ్రహించారు. దొంగ దారిన అధికారంలోకి రావాలని బీజేపీ ప్రయత్నిస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి దుయ్యబట్టారు.



# విజయవాడలో కారు దగ్ధం

**నలుగురు సజీవదహనం**

**విజయవాడ, అక్టోబరు 12 ప్రభాతవార్త:** విజయవాడ పశ్చిమ బైపాస్ పై సోమవారం సాయంత్రం కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొన్న సంఘటనలో నలుగురు అక్కడికక్కడే సజీవ దహనం అయ్యారు. నున్నకు చెందిన కొమ్మారెడ్డి రాందేవ్ రెడ్డి(39) తన కుటుంబ సభ్యులతో కలిసి గుంటూరు జిల్లా పెదకాకాని సమీపంలోని నంబూరు గ్రామంలో శుభకార్యానికి హాజరై తిరిగి వస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది. రాందేవ్ తల్లి అరుణ (65), రాందేవ్ రెడ్డి కుమార్తె ఏడాదిన్నర వయస్సున్న కొమ్మారెడ్డి మహాత్ర, భీమవరపు విజయ (48) మృతులలో ఉన్నారు. మరో మహిళ తియ్యగూర అరుణ తీవ్రంగా గాయపడగా స్థానికులు వెంటనే బయటకు తీయడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. తియ్యగూర అరుణ స్వగ్రామం నున్న కాగా, భర్త ఉద్యోగం రీత్యా హైదరాబాద్ (మెహదీపట్నం)లో నివాసం ఉంటోంది. ఈమెది అత్తగారి ఊరు నంబూరు. నంబూరులోని ఒక శుభకార్యం నిమిత్తం మెహదీపట్నం వచ్చి నున్నలోని తల్లిదండ్రులను చూసి వెళ్ళేందుకు రాందేవ్ కారు ఎక్కింది. వీరంతా నంబూరు నుంచి నున్నకు బయలుదేరి వస్తుండగా పాముల కాల్వ సమీపంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొని రోడ్డు రెండవ వైపునకు వెళ్ళి రోడ్డు బారికేడ్‌ను ఢీ కొంది. కారు అత్యధిక వేగంగా ఉండటం, వేగంగా ప్రహరీగోడను ఢీ కొనడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో కారులోని వారు కారులోనే ఇరుక్కుని మంటల్లో చిక్కుకు పోయారు. కారు ప్రమాదాన్ని చూసిన వెంటనే అక్కడి ఉన్న వారు కారులోని వారిని రక్షి ంచేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. వెనుక సీటులో ఉన్న అరుణను మాత్రం రక్షి ంచగలిగారు. విషయం తెలుసుకున్న రాందేవ్ రెడ్డి తండ్రి సుబ్బారెడ్డి గుండెపోటుతో ఆసుపత్రిలో చేరారు. ఆయన పరిస్థితి విషమంగానే ఉంది.

**ప్రమాదం తీవ్రంగా కలచివేసింది: మంత్రి లోకేశ్**

ఈ ప్రమాద ఘటనపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పందించారు. 'విజయవాడ వెస్ట్ బైపాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు సజీవదహనం కావడం తీవ్రంగా కలచివేసింది. మృతులకు నివాళి అర్పిస్తున్నా. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా' అని నారా లోకేశ్ పేర్కొన్నారు.

# కరవుతో రైతులు చస్తుంటే ఢిల్లీకి సిఎం పలాయనం

**ఓట్ల తొలగింపుపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బహిరంగ సవాల్**

**కనీసం సిఇఒ ఆఫీసుకు 10 మందిని తీసుకురాగలరా?**

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శ్రీరాముడి పేరెత్తే అర్హతే లేదు : బిజెపి రాష్ట్ర చీఫ్ ఎన్.రాంచందర్‌రావు**

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** :రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో తీవ్ర కరవు ముంచుకొచ్చి, తాగునీరుసాగునీరు లేక రైతులు అల్లాడుతూ ఆత్మహత్యలు చేసుకుంటుంటే, బాధ్యతా రాహిత్యంగా అత్యవసర కేబినెట్ భేటీని రద్దు చేసుకుని సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రత్యేక విమానాల్లో ఢిల్లీకి పారిపోయారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎన్. గౌతంరావు, వీరేందర్ గౌడ్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి మీడియా ఇన్‌ఛార్జ్ ఎన్.వి. సుభాష్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అభిషేక్ జిగిని, సురేష్, వెంకట్ రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు. ప్రజా జీవితంలో నరేంద్ర మోడీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ బిజెపి పక్షాన ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, నిన్న రాష్ట్ర కార్యాలయంలో ప్రత్యేక తీర్మానం ఆమోదించామని రాంచందర్ రావు తెలిపారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా 12న్నర సంవత్సరాలు, దేశ ప్రధానమంత్రిగా 12 సంవత్సరాలుగా నిస్వార్థ ప్రజాసేవ అందిస్తున్న మోడీ సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రశంసిస్తూ ఈ తీర్మానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. 2014కు ముందు దేశంలో ఎన్నో స్కాములు, కుంభకోణాలు జరిగి, విదేశీ మారకద్రవ్యం క్షీణించి, యువత నిరాశలో కూరుకుపోయి దేశం 22వ స్థానానికి పడిపోయిందని గుర్తుచేశారు. మోడీ అధికారంలోకి వచ్చాక దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా పేదల ఖాతాల్లోకే సంక్షేమ పథకాల నిధులు జమచేస్తూ దేశ రూపురేఖలు మార్చారన్నారు.

తెలంగాణ అభివృద్ధికి గత 12న్నర ఏళ్లలో కేంద్రం రూ.13 లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించిందని, అమృత్ భారత్ కింద 41 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, నేషనల్ హైవేలు, వరంగల్ ఎయిర్‌పోర్ట్, అదిలాబాద్ డిఫెన్స్ ఎయిర్‌పోర్ట్ వంటి ఎన్నో ప్రాజెక్టులు ఇచ్చారని పేర్కొన్నారు. 2047 నాటికి దేశం వికసిత భారత్‌గా మారడంతో పాటు తెలంగాణ కూడా వికసిత తెలంగాణగా మారాలంటే ఇక్కడ బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని తీర్మానించామని, ఇదే అంశాన్ని ప్రధానికి నివేదిస్తామని చెప్పారు. ఓట్లు మిస్ అయ్యాయంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన



సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎన్. రాంచందర్‌రావు

ఛాలెంజ్‌ను తాను స్వీకరిస్తున్నానని ఎన్.రాంచందర్ రావు స్పష్టం చేశారు. మీరు వేలమందిని తీసుకురానక్కర్లేదు, స్టేట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ దగ్గరకు మీ వెంట మీ మజ్లిస్ దోస్తులు అసదుద్దీన్, అక్బరుద్దీన్ ఓవైసీలను తీసుకొచ్చినా పర్లేదు..కనీసం ఓట్లు పోయిన 10 మందిని సిఈఓ ఆఫీసుకు తీసుకురండి. నేనూ వస్తాను. కంప్యూటర్లలో రికార్డులు పరిశీలిద్దాం. నోటీసు ఇవ్వకుండా, విచారణ జరపకుండా ఏ ఒక్క ఓటూ డిలీట్ కాదు. అర్హులైన వారి ఓటు డిలీట్ అయిందని నిరూపిస్తే అక్కడికక్కడే నమోదు చేయించే నిబంధనల ప్రకారం పని చేద్దాం అన్నారు. నిరూపించలేకపోతే క్షమాపణ చెప్పాలని సవాల్ విసిరారు.

# 41 కొత్త బార్లకు భారీగా దరఖాస్తులు

**హైదరాబాద్,అక్టోబరు 12,ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా 41 కొత్త బార్లకు దరఖాస్తుల సమర్పణకు సోమవారం చివరి రోజు కావడంతో ఆబ్కారీ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తులు వేయడానికి వ్యాపారులు బారులు తీరారు. క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ) పరిధిలోని 14 బార్లకు, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలో 27 కొత్త బార్లకు దరఖాస్తులు ఇవ్వడానికి కమిషనర్ కార్యాలయానికి వ్యాపారులు తరలిరావడంతో క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. 41 బార్లకు సుమారుగా 4,950 వరకు దరఖాస్తులు వచ్చినట్టుగా తెలిసింది. సోమవారం చివరి రోజు కావడంతో దరఖాస్తులు భారీగా వస్తాయని ఎక్సైజ్ శాఖ అధికారులు భావించారు. అందులో భాగంగా వ్యాపారుల రద్దీ మేరకు కమిషనర్ కార్యాలయంతో పాటు గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు.

# దివ్యాంగులకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించాలి

**బిజెపి రాష్ట్ర దివ్యాంగుల విభాగం డిమాండ్**

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో ప్రయాణించే దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, వారికి మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించాలని బిజెపి రాష్ట్ర దివ్యాంగుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కొల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు టిజిఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డికి రాష్ట్ర కన్వీనర్ కొల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించి, దివ్యాంగుల సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. బస్సుల్లో దివ్యాంగులకు కేటాయించిన ప్రత్యేక సీట్లు వారికి అందుబాటులో ఉండేలా చూడాలని, వీల్‌ఛైర్ వినియోగించే దివ్యాంగులకు అనుకూలమైన ప్రయాణ సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా దివ్యాంగులకు అందించే బస్ పాసులు, ప్రయాణ రాయితీలు, ఇతర సదుపాయాలపై స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉంచాలని కోరింది.దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించడం దయ కాదు, అది వారి హక్కు. దివ్యాంగుల సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, వినతిపత్రంలో పేర్కొన్న అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్ర దివ్యాంగుల విభాగం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో దివ్యాంగుల రాష్ట్ర కో కన్వీనర్ బెస్త యాదగిరి, గొల్లి ప్రభాకర్, ఎదుల శ్రీనివాస్, క్రోసూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతులను గాలికొదిలేసి ఢిల్లీలో ధర్నాల డ్రామాలు

**బోగస్ ఓట్లు తీసేయాలని గతంలో వారే డిమాండ్ చేశారు**

**ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ ద్వంద్వనీతి బట్టబయలు: ఎంపి కె.లక్ష్మణ్**

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** ఎన్నికల్లో ప్రజా మద్దతు పొందలేక, రాజ్యాంగ బద్ధమైన ఎన్నికల సంఘం, న్యాయ వ్యవస్థలపై నిరాధార ఆరోపణలు చేస్తూ వ్యవస్థలను నిర్వీర్యం చేసే కుట్రలకు కాంగ్రెస్ పార్టీ, ఇండి కూటమి తెరలేపాయని బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యులు, రాజ్యసభ ఎంపి డా. కె. లక్ష్మణ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని, ఎన్నికల వ్యవస్థ పట్ల ఆ పార్టీకి ఉన్న నల్ల చరిత్రను ఎండగట్టారు. దేశవ్యాప్తంగా అక్రమ ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేసింది కాంగ్రెస్ పార్టీ నాయకులేనని లక్ష్మణ్ గుర్తుచేశారు. మధ్యప్రదేశ్‌లో 60 లక్షల బోగస్ ఓట్లు ఉన్నాయని కమల్‌నాథ్, గుజరాత్‌లో 40 లక్షల దొంగ ఓట్లను తొలగించాలని పిసిసి అధ్యక్షుడిగా శక్తిసింగ్ గోయిల్, ఢిల్లీలో 10 లక్షల నకిలీ ఓట్లున్నాయని అర్విందర్ సింగ్ లవ్లీ, అలాగే 11 లక్షల బోగస్ ఓట్లను ఈసీ తొలగించాలని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ స్వయంగా ఎన్నికల సంఘానికి గతంలో వినతిపత్రాలు ఇచ్చారని తెలిపారు. కేరళలో సిపిఎం దొంగ ఓట్లను తొలగించినందుకు కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాల ఎన్నికల సంఘానికి బహిరంగంగా కృతజ్ఞతలు తెలిపారని ప్రస్తావించారు. అక్రమంగా నివసించే వారి ఓట్లను తొలగించాలని సచిన్ పైలట్ సైతం గతంలో డిమాండ్ చేశారని గుర్తుచేశారు. ఆనాడు తొలగించాలని డిమాండ్ చేసి, ఇప్పుడు చట్టబద్ధంగా సమగ్ర సవరణ చేపట్టి దొంగ ఓట్లను ఏరివేస్తుంటే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందంటూ వీధుల్లోకి రావడం వారి అవకాశవాద రాజకీయాలకు పరాకాష్ట అని మండిపడ్డారు. సుప్రీంకోర్టు స్వయంగా ఓటర్ల సవరణ ప్రక్రియను సమర్థించినప్పటికీ, దాదాపు 42 మంది రిటైర్డ్ న్యాయమూర్తులు బహిరంగ లేఖ ద్వారా కాంగ్రెస్ నిరాధార ఓట్ చోరీ ఆరోపణలను తప్పుపట్టినప్పటికీ కాంగ్రెస్ తీరు మారలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన అమలులో విశిష్ట సేవలకు నారాయణపేట జిల్లాకు జాతీయస్థాయి గుర్తింపు

**న్యూఢిల్లీలో వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో**

**అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ ప్రియాంక**

**హైదరాబాద్,అక్టోబరు12,ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలో ప్రధాన మంత్రి ధన్‌ధాన్య కృషి యోజన కార్యక్రమం అమలులో విశిష్ట సేవలు అందించి నందుకు జిల్లా కలెక్టర్ ప్రియాంక సోమవారం న్యూఢిల్లీలో వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలులో జిల్లా యంత్రాంగం చేసిన కృషికి ఈ గుర్తింపు లభించడం విశేషం. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ..ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడం, వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాల్లో అధికారులు అంకితభావంతో పనిచేయడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తూ, సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.




ఈ అవార్డు సాధనలో భాగస్వాములైన జిల్లా అధికారు లందరికీ, వారి బృందాలకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరి సహకారం, కృషి, బాధ్యతాయుతమైన పనితీరు ఈ విజయానికి పునాది అని పేర్కొ న్నారు. భవిష్యత్తులోనూ ఇదే బృంద స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు జిల్లా అభివృద్ధిలో మరిన్ని మైలురాళ్లను సాధించాలని ఆకాంక్షి ంచారు. నారాయణపేట జిల్లాకు లభించిన ఈ గుర్తింపు జిల్లా యంత్రాంగానికి మరింత బాధ్యతను పెంచిందని, రానున్న రోజుల్లో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈ అవార్డు ప్రేరణగా నిలుస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# డెన్మార్క్ ఓపెన్‌లో సింధుకు ఆన్ సేయంగ్ సవాల్

## సత్విక్-చిరాగ్‌ల పునరాగమనం



**ఒడెన్స్:** మంగళవారం డెన్మార్క్ ఓపెన్ 2026 లో భారత్ తన ప్రచారాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో తొలి రౌండ్‌లోనే ప్రపంచ నంబర్ 1 ఆన్ సే యంగ్‌తో పీవీ సింధుకు గట్టి సవాలు ఎదురుకానుంది. ఈ బీడబ్ల్యూఎఫ్ సూపర్ 750 టోర్నమెంట్‌లో సత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టిల పురుషుల డబుల్స్ జోడి పునరాగమనం కూడా ఒక ప్రధాన చర్చనీయాంశం కానుంది. ఈ టోర్నమెంట్‌లో బలమైన అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొంటున్నారు. సింగిల్స్ మరియు డబుల్స్ విభాగాలలో తమదైన ముద్ర వేయడానికి భారతదేశం ఇప్పటికే పేరుపొందిన స్టార్లు మరియు వర్ధమాన ప్రతిభావంతులపై ఆధారపడుతోంది. ఈ ఏడాది ఆరంభంలో జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్ గెలుచుకున్న సింధ , తొలి రౌండ్‌లో రిపబ్లిక్ ఆఫ్ కొరియాకు చెందిన ఒలింపిక్ ఛాంపియన్ ఆన్ సే యంగ్‌తో తలపడనుంది. ప్రస్తుతం ప్రపంచంలో 10 వ ర్యాంక్‌లో ఉన్న రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత అయిన సింధు, వీరిద్దరి మధ్య జరిగిన గత 10 ముఖాముఖి పోరులో ఆన్‌ను ఇంకా ఓడించలేదు. మహిళల బ్యాడ్మింటన్‌లో అత్యంత ఆధిపత్యం చెలాయించే క్రీడాకారిణులలో ఒకరితో ఉన్న కఠినమైన హెడ్ టు హెడ్ రికార్డును అధిగమించాలని సింధు చూస్తున్నందున ఈ ప్రారంభ పోరు ఆమె టైటిల్ ఆశలకు తొలి పరీక్షగా నిలుస్తుంది. భారత మహిళల సింగిల్స్ జట్టులో తన్వి శర్మ, అష్మిత చలిహా, దేవికా సిహాగ్ మరియు ఉన్నతి హూడా కూడా ఉన్నారు.




# రంజీ ట్రోఫీ.. 135 రన్స్ ఆధిక్యంతో మధ్యప్రదేశ్

## జమ్మూ కాశ్మీర్‌పై పైచేయి

**శ్రీనగర్:** జమ్మూ కాశ్మీర్‌ను 120 పరుగులకే ఆలౌట్ చేసి తొలి ఇన్నింగ్స్‌లో 76 పరుగుల ఆధిక్యం సాధించిన మధ్యప్రదేశ్, రెండో రోజు ఆట ముగిసేనాటికి నాలుగు వికెట్ల నష్టానికి 59 పరుగులు చేసింది. అఖిబ్ నబీ చివరిలో కొట్టిన వికెట్లు ఆతిథ్య జట్టును పోటీలో నిలబెట్టడంతో, మొత్తం మీద 135 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. మధ్యప్రదేశ్‌కు ఆధిక్యం ఉన్నప్పటికీ, గ్రూప్ ఎ రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో జమ్మూ కాశ్మీర్‌కు కూడా పట్టు లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో జమ్మూ కాశ్మీర్‌ను 120 పరుగులకే ఆలౌట్ చేసి 76 పరుగుల ఆధిక్యం సాధించిన మధ్యప్రదేశ్, రెండో రోజు ఆట ముగిసేనాటికి నాలుగు వికెట్ల నష్టానికి 59 పరుగులు చేసింది. అఖిబ్ నబీ చివరిలో కొట్టిన వికెట్లు ఆతిథ్య జట్టును పోటీలో నిలబెట్టడంతో, మొత్తం మీద 135 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. సోమవారం షేర్‌ఇకాశ్మీర్ స్టేడియంలో నెలకొన్న మేఘావృత వాతావరణాన్ని సద్వినియోగం చేసుకున్న ఆవేశ్ ఖాన్, తన మొదటి ఓవర్‌లోనే నైట్‌వాచ్‌మ్యాన్ వంశజజ్ శర్మను అవుట్ చేసి, జమ్మూ కాశ్మీర్‌కు ఆ రోజు కష్టంగా గడవడానికి నాంది పలికాడు. రౌండ్ ది వికెట్ బౌలింగ్ చేస్తూ, ఆవేశ్ (29 పరుగులకు మూడు వికెట్లు) మరియు ఆర్యన్ పాండే (44 పరుగులకు మూడు వికెట్లు) క్రమశిక్షణతో కూడిన లైన్ అండ్ లెంగ్త్‌ను కొనసాగిస్తూ, క్రమం తప్పకుండా వికెట్లు తీశారు. పిచ్‌లో ఎలాంటి లోపాలు లేనప్పటికీ, అనుభవజ్ఞులైన ఖమ్రాన్ ఇక్బాల్ మరియు పరాస్ దోగ్రా కూడా బంతిని ముందుకు తీసుకెళ్లడానికి చాలా కష్టపడ్డారు.

# షాంఘై నుండి అల్కరాజ్ నిష్క్రమణ

## జ్వెరెవ్ తొలిసారిగా నంబర్ 1 స్థానం

**షాంఘై:** సోమవారం షాంఘై మాస్టర్స్‌లో స్పెయిన్‌కు చెందిన కార్లోస్ అల్కరాజ్ అనూహ్య ఓటమిని చవిచూడటంతో, అలెగ్జాండర్ జ్వెరెవ్ తన కెరీర్‌లో తొలిసారిగా ఏటీపీ ఇయర్



ఎండ్ నెంబర్ 1 ర్యాంకింగ్‌ను కైవసం చేసుకుని తన అద్భుతమైన 2026 సీజన్‌లో ఒక ప్రధాన మైలురాయిని సాధించాడు. రౌండ్ ఆఫ్ 32 లో బెల్జియంకు చెందిన జిజౌ బెర్గ్స్ చేతిలో 7-5, 7-6 ( 4 ) తేడాతో అల్కరాజ్ నిష్క్రమించాడు. అంతకు ముందు జరిగిన రౌండ్ ఆఫ్ 32 పోరులో ఫ్రాన్స్‌కు చెందిన ఆర్థర్ గియా చేతిలో ఓడిపోయిన అమెరికన్ బెన్ షెల్టన్ నిష్క్రమించడంతో ఈ ఫలితం సంవత్సరాంతపు ర్యాంకింగ్స్‌లో జ్వెరెవ్ అగ్రస్థానాన్ని ఖరారు చేసింది. ఎటిపి యొక్క సంవత్సరాంతపు నంబర్ 1 గా ఒక సీజన్‌ను ముగించిన మొదటి జర్మన్ ఆటగాడిగా జ్వెరెవ్ నిలవనున్నాడు. జ్వెరెవ్ షాంఘై మాస్టర్స్‌లో తన ఆటను కొనసాగిస్తున్నాడు మరియు మంగళవారం నాడు రౌండ్ ఆఫ్ 16 లో అలెగ్జాండర్ బుబ్లిక్‌ను ఎదుర్కోనున్నాడు.





# వైట్‌వాష్ నుండి తప్పించుకున్న భారత్

## ఆస్ట్రేలియా ఓడినా 2-1తో సిరీస్ కైవసం

**పుదుచ్చేరి:** మూడవ మరియు చివరి50 ఓవర్ల మ్యాచ్‌లో, గుర్జప్‌నీత్ సింగ్, యశ్ ఠాకూర్, నిశాంత్ సింధు నేతృత్వంలో జరిగిన బౌలింగ్ ప్రదర్శనతో ఇండియా జట్టు ఆస్ట్రేలియాను 49 పరుగుల తేడాతో ఓడించి సిరీస్ వైట్‌వాష్‌ను తప్పించుకుంది. 276 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో, ఇండియా 46.2 ఓవర్లలో ఆస్ట్రేలియాను 226 పరుగులకే ఆలౌట్ చేసింది. 177/3 స్కోరు వద్ద నిలిచిన ఆస్ట్రేలియ కేవలం 49 పరుగులకే తమ చివరి 7 వికెట్లను కోల్పోయి నాటకీయంగా కుప్పకూలింది. అయినప్పటికీ, ఆస్ట్రేలియా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2 -1 తేడాతో కైవసం చేసుకుంది. అంతకుముందు ఇండియా 49.3 ఓవర్లలో 275 పరుగులకే ఆలౌట్ అయింది. సూర్యాంశ్ షెడ్గే 66 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టగా, విప్రజ్ నిగమ్ 40 పరుగులు చేసి టాప్ ఆర్డర్ పతనం నుండి ఆతిథ్య జట్టును ఆదుకున్నాడు. ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్‌ల ద్వారా ఇండియా వేగవంతమైన ఆరంభాన్ని అందుకుంది . వీరిద్దరూ తొలి వికెట్‌కు 83 పరుగుల భాగస్వామ్యా న్ని నెలకొల్పారు. 11వ ఓవర్‌లో ప్రభ్‌సిమ్ర న్ 39 పరుగులు చేసి అవుటవడంతో ఆ జట్టు పతనం ప్రారంభమైంది. దీంతో ఇండియా 35 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి 118/5 స్కోరుకు పడిపోయింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, షెడ్గేతో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టేందుకు ప్రయత్నించి 33 పరుగులు చేశాడు. అయితే మిచెల్ ఓవెన్ గైక్వాడ్‌ను అవుట్ చేయడంతో ఇండియా 159/6 తో కష్టాల్లో పడింది. ఆ తర్వాత షెడ్గే, నిగమ్ తో కలిసి ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించగా, వారి ఏడవ వికెట్ భాగస్వామ్యం ఇండియాకు ఊపునిచ్చింది. ఈ జంట యొక్క 85 పరుగుల భాగస్వామ్యం స్కోరును 275 కు చేర్చి బౌలర్లకు కాపాడుకోవడానికి ఒక పోటీ లక్ష్యాన్ని అందించింది. దీనికి ప్రతిగా ఆస్ట్రేలియా జోష్ ఫిలిప్ 82 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పి, చక్కటి అర్ధశతకం సాధించాడు. ఫిలిప్‌ను అవుట్ చేసి నిగమ్ ఆ భాగస్వామ్యాన్ని విడగొట్టగా, ఆ తర్వాతి ఓవర్‌లోనే లియామ్ స్కాట్ కూడా అవుటవడంతో ఇండియా మ్యాచ్‌పై తమ పట్టును మరింత బిగించింది. 39 పరుగులు చేసిన నాథన్ మెక్‌స్వీనీ, 31 పరుగులు చేసిన లాచ్లాన్ షా కలిసి మూడో వికెట్‌కు 58 పరుగులు జోడించి ఆస్ట్రేలియాను పోటీలో నిలిపారు. అయితే గుర్జప్నీత్, ఠాకూర్, సింధు క్రమం తప్పకుండా వికెట్లు తీయగా , నిఖిల్‌ని సరైన సమయంలో రనౌట్ చేయడం మరింత బలహీనపరిచింది. చివరకు ఆస్ట్రేలియా 226 పరుగులకే ఆలౌట్ కావడంతో ఇండియాకు ఓదార్పు విజయం లభించింది.

## వెస్టిండీస్‌తో హైదరాబాద్ మ్యాచ్‌లో.. టీమిండియాలో

# ముగ్గురు బెంచ్‌కే పరిమితం



**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇప్పటివరకు 3 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. భారత్ రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించగా, వెస్టిండీస్ ఒక మ్యాచ్‌లో గెలిచింది. వెస్టిండీస్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో నాలుగో మ్యాచ్ ఈ నెల 14న హైదరాబాద్‌లో జరగనుంది. ఈ నాలుగో ఫలితమే సిరీస్‌పై కీలక ప్రభావం చూపనుంది. ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ ఓడిపోతే భారత్ సిరీస్‌ను 3-1తో కైవసం చేసుకుంటుంది. చివరి మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండా సిరీస్ సొంతం చేసుకుంటుంది. ఈ మ్యాచ్‌లో ముగ్గురు ఆటగాళ్లకు ప్లేయింగ్ 11లో అవకాశం ఇవ్వకపోవచ్చు. మరోసారి ఈ ముగ్గురు బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశముంది. ఆల్‌రౌండర్ శివమ్ దూబేకు వెస్టిండీస్‌తో తొలి రెండు టీ20ల్లో అవకాశం లభించింది. అయితే అతను ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. దీంతో మూడో మ్యాచ్‌లో అతడిని ప్లేయింగ్ 11 నుంచి తప్పించిన సంగతి తెలిసిందే. దూబె స్థానంలో నితీశ్ కుమార్‌ని జట్టులోకి తీసుకున్నారు. అతను చూపించిన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో తదుపరి హైదరాబాద్‌లో కూడా శివమ్ బెంచ్‌కే పరిమితం అయ్యే అవకాశం ఉంది. ఇక వరుణ్ చక్రవర్తి ఫిట్‌గా లేకపోవడంతో కుల్దీప్ యాదవ్‌ను ఎంపిక చేశారు. తొలి మ్యాచ్‌లో 2 వికెట్లు తీసుకుని ఆకట్టుకున్నాడు. అయితే రాంచీ మ్యాచ్‌లో 53 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ మాత్రమే సాధించాడు. మరోవైపు అక్షర్ పటేల్, నమన్ ధీర్ బ్యాటింగ్‌లోనూ సహకారం అందించగలగడంతో పేస్ బౌలింగ్‌ను మరింత బలోపేతం చేసేందుకు కుల్దీప్‌ను పక్కన పెట్టింది. అతడి స్థానంలో ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం ఇచ్చారు. నాలుగు ఓవర్లలో 37 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ కూడా తీయలేకపోయినా కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు. దీంతో తదుపరి మ్యాచ్‌లోనూ ప్రిన్స్‌కు అవకాశం దక్కవచ్చు. అదే జరిగితే కుల్దీప్ మరోసారి బెంచ్‌పైనే ఉండాల్సి రావచ్చు. కాగా లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్‌కు ఈ నాలుగో మ్యాచ్‌లోనూ అవకాశాలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. తొలి మూడు మ్యాచ్‌ల్లోనూ అతడు తుది జట్టులో చోటు సంపాదించలేకపోయాడు. ఇదే పరిస్థితి నాలుగో మ్యాచ్‌లోనూ కొనసాగవచ్చు.

# 23నెలల గరిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం

## ఆహారోత్పత్తుల ధరల పెరుగుదలతో 5.54 శాతానికి చేరిక



**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో గణనీయంగా పెరిగి 5.54 శాతానికి చేరుకుంది. దీంతో గత 23 నెలల గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ మోస్పి సోమవారం విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయం వెల్లడైంది. సెప్టెంబర్‌లో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 5.58 శాతంగా ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేయగా, వాస్తవంగా అది 5.54 శాతంగా నమోదైంది. ఆహార పదార్థాల ధరలు పెరగడంతో వరుసగా నాలుగో నెల కూడా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన లక్ష్యాన్ని ద్రవ్యోల్బణం అధిగమించింది. వినియోగదారులపై ధరల భారం పెరుగుతుండగా, ఆహార ద్రవ్యోల్బణం ప్రధాన కారణంగా నిలిచింది. సెప్టెంబర్‌లో ద్రవ్యోల్బణం పెరగడానికి ఆహార ధరలే ప్రధాన కారణమయ్యాయి. వినియోగదారుల ఆహార ధరల సూచీ ఆగస్టులో 5.97 శాతంగా ఉండగా, సెప్టెంబర్‌లో 7.74 శాతానికి పెరిగింది. ఆహారం, పానీయాల విభాగంలో ద్రవ్యోల్బణం ఆగస్టులో 5.66 శాతం నుంచి సెప్టెంబర్‌లో 7.36 శాతానికి చేరుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం ఆగస్టులో 5.97 శాతంగా ఉండగా, సెప్టెంబర్‌లో 6.08 శాతానికి పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో ఇది 4.31 శాతం నుంచి 4.88 శాతానికి చేరుకుంది. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ధరల పెరుగుదల అధికంగా ఉండటం గమనార్హం. దుస్తులు, పాదరక్షల విభాగంలో సెప్టెంబర్‌లో ద్రవ్యోల్బణం 3.93 శాతంగా నమోదైంది. గృహనిర్మాణం, యుటిలిటీస్ విభాగంలో ఇది 2.74 శాతంగా ఉంది. పాన్, పొగాకు, మత్తు పదార్థాల విభాగంలో ద్రవ్యోల్బణం 4.8 శాతంగా నమోదైంది. వ్యక్తిగత సంరక్షణ, ఇతర సేవల విభాగంలో ద్రవ్యోల్బణం ఆగస్టులో 15.17 శాతంగా ఉండగా, సెప్టెంబర్‌లో 13.75 శాతానికి తగ్గింది. రెస్టారెంట్లు, వసతి సేవల విభాగంలో ద్రవ్యోల్బణం 9.36 శాతానికి పెరిగింది. విద్యా సేవల విభాగంలో ద్రవ్యోల్బణం ఆగస్టులో 3.73 శాతంగా ఉండగా, సెప్టెంబర్‌లో 3.94 శాతానికి చేరుకుంది. వినోదం, క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాల విభాగంలో ఇది 2.16 శాతంగా నమోదైంది. సమాచార, కమ్యూనికేషన్ విభాగంలో ద్రవ్యోల్బణం 2.44 శాతంగా ఉంది. ఆరోగ్య సేవల విభాగంలో నెలవారీ ప్రాతిపదికన స్వల్ప పెరుగుదల నమోదై, ద్రవ్యోల్బణం 1.4 శాతానికి చేరుకుంది. గృహోపకరణాలు, ఫర్నిషింగ్స్ విభాగంలో ద్రవ్యోల్బణం 3.11 శాతంగా నమోదైంది. ఆహార ధరల పెరుగుదలతో రిటైల్ ద్రవ్యోల్బణం మరింత వేగం పుంజుకోవడం సామాన్య వినియోగదారులపై ధరల భారాన్ని పెంచుతోంది. రాబోయే నెలల్లో ఆహార ధరల కదలికలు ద్రవ్యోల్బణ ధోరణిని ప్రభావితం చేసే కీలక అంశంగా నిలవనున్నాయి.

## ఆటోమొబైల్ సేల్స్ 'బాలెనో' టాప్‌గేర్..!



**ముంబయి, అక్టోబరు 12:** దేశీయ కార్ల మార్కెట్లో మారుతి సుజుకి బాలెనో దూసుకెళ్లింది. 2026 సెప్టెంబరులో దేశంలోనే అత్యధికంగా అమ్ముడైన ప్యాసింజర్ కారుగా అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. గత ఏడాది సెప్టెంబరుతో పోలిస్తే ఏకంగా 93 శాతం వృద్ధిని నమోదు చేసింది. టాటా నెక్సాన్, పంచ్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. టాప్10 కార్ల జాబితాలో మారుతి సుజుకికి చెందిన ఆరు మోడళ్లు చోటు దక్కించుకున్నాయి. మారుతి సుజుకి బాలెనో 25,392 యూనిట్లను డీలర్లకు పంపించింది. గత ఏడాది ఇదే నెలలో 13,173 యూనిట్లు మాత్రమే నమోదయ్యాయి. వార్షిక ప్రాతి పదికన 93 శాతం వృద్ధి సాధించింది. టాప్ 10 కార్లలో ఇదే అత్యధిక వృద్ధి కావడం విశేషం. టాటా నెక్సాన్ 20,456 యూనిట్లతో రెండో స్థానంలో నిలిచింది. గత ఏడాది ఇదేకాలంలో నమోదైన 22,573 యూనిట్లతో పోలిస్తే అమ్మకాలు 9 శాతం తగ్గాయి. టాటా పంచ్ 20,333 యూనిట్లతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ మోడల్ అమ్మకాలు 28 శాతం పెరిగాయి. టాప్10 జాబితాలో బాలెనో, ఫ్రాంక్స్, వ్యాగనార్, డిజైర్, స్విఫ్ట్, ఎర్టిగా సహా మారుతి సుజుకీకి చెందిన ఆరు మోడళ్లు ఉన్నాయి. ఫ్రాంక్స్ 19,282 యూనిట్లతో 40 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఎర్టిగా 16,911 యూనిట్ల అమ్మకాలతో అదే స్థాయిలో వృద్ధిని కనబరిచింది. టాటా నెక్సాన్, పంచ్ కలిపి 40,789 యూనిట్లను నమోదు చేశాయి. కాంపాక్ట్ ఎస్‌యూవీలకు మార్కెట్లో ఉన్న ఆదరణను ఈ డేతా చెపుతోంది. మరోవైపు హ్యాచ్‌బ్యాక్ కార్లకూ డిమాండ్ తగ్గలేదు. బాలెనో, వ్యాగనార్, స్విఫ్ట్ కలిపి 61 వేలకుపైగా యూనిట్లను నమోదు చేశాయి. టాప్10 జాబితాలో హ్యుందాయ్ క్రెటా ఏడో స్థానంలో నిలిచింది. ఈ మోడల్ 17,657 యూనిట్లను నమోదు చేసింది. మహీంద్రా స్కార్పియో 17,313 యూనిట్లతో తొమ్మిదో స్థానాన్ని దక్కించుకుంది.

## ఆర్బీఐ ఎంట్రీతో రూపాయి క్షీణతకు కట్టడి



**ముంబయి,అక్టోబరు 12:** రూపాయి క్షీణత కట్టడికి ఆర్‌బిఐ తీసుకున్న చర్యలు వెంటనే సానుకూల ఫలితాలనిచ్చాయి. ఫారెక్స్ మార్కెట్ ప్రారంభంలోనే అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఒకశాతానికి పైగా లాభపడి 95.76 వద్ద ట్రేడింగ్ మొద లుపెట్టింది. ఆఫ్‌షోర్ మార్కెట్లోనూ రూపాయి బలంగా పుంజుకుంది. 2013 తర్వాత రూపాయిని నిలబెట్టేందుకు ఆర్బీఐ తీసుకున్న అత్యంత కఠి నమైన చర్యల్లో ఇవి కూడా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. రూ పాయి మారకం విలువ రికార్డు స్థాయి కనిష్ఠమైన 97కు చేరువవు తుండటంతో ఆర్బీఐ రంగంలోకి దిగింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థల డాలర్ అవసరాలను తీర్చడం కోసం ఒక ప్రత్యేక విండోను ఏర్పాటు చేస్తు న్నట్లు తెలిపింది. దీంతో పాటు ఫారెక్స్ డెరివేటివ్ లావాదేవీలపై కొత్త రిజర్వ్ నిబంధనను కూడా ప్రవేశపెట్టింది. అంతకుముందు గత బుధవారం వడ్డీ రేట్లను పెంచిన ఆర్బీఐ, అవసరమైతే మరిన్ని కఠిన నిర్ణయాలు తీసు కుంటామని సంకేతాలిచ్చింది. అక్టోబర్ ఆరంభంలో కూడా ఆర్బీఐ కొన్ని నియంత్రణ చర్యలు తీసుకుంది. అన్‌హెడ్జ్‌డ్ ఫారెక్స్ డెరివేటివ్ లావాదేవీల పరిమితిని 100 మిలియన్ డాలర్ల నుంచి 5 మిలియన్ డాలర్లకు భారీగా తగ్గించింది. దీంతో పాటు కొత్తగా ఫారెన్ ఎక్స్ఛేంజ్ రిస్క్ రిజర్వ్ (ఎఫ్‌ఈఆ ర్‌ఆర్) విధానాన్ని ప్రవేశపెట్టింది. దీని కింద 2 మిలియన్ డాలర్లకు మించిన ఫారెక్స్ డెరివే టివ్ కాంట్రాక్టులపై, కాంట్రాక్ట్ విలువలో 20 మొత్తాన్ని నగదు రూపంలో ఆర్‌బీఐ వద్ద రిజర్వ్‌గా ఉంచాలని అధీకృత డీలర్లను ఆదేశించింది. రద్దు చేసిన డెరివేటివ్ కాంట్రాక్టులను మళ్లీ రీబుక్ చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. మెచ్యూరిటీ సమయంలో కాంట్రాక్టులను రోలోవర్ చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. రూపాయి విలువను కాపాడేందుకు ఆర్బీఐ వరు సగా ఇన్ని చర్యలు తీసుకోవలసి రావడం, పరిస్థితి తీవ్రతను సూచిస్తోందని సోషియేట్ జనరల్ సంస్థకు చెందిన ఎమర్జింగ్ ఆసియా స్ట్రాటజిస్ట్ గాల్విన్ చియా అంచనావేసారు.

# ద్రవ్యోల్బణ డేటాపై ఇన్వెస్టర్ల ఫోకస్..

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు




**ముంబయి,అక్టోబరు 12:** దేశంలో సెప్టెంబర్ నెల ద్రవ్యోల్బణ గణాంకాల విడుదలకు ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగడం, భారత బాండ్ రాబడులు గణనీయంగా పెరగడం మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. రష్యా ఉక్రెయిన్ మధ్య భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గ వచ్చన్న ఆశలతో చమురు ధరలు కొంత వెనక్కి తగ్గినప్పటికీ, బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 105 డాలర్ల పైనే కొనసాగింది. దీంతో దిగుమతి ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాలు, రూపాయి విలువపై ఒత్తిడి వంటి అంశాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారించారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఇటీవల తీసుకున్న ద్రవ్య విధాన కఠిన చర్యలు మార్కెట్లో నగదు లభ్యత, రుణ వ్యయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్న అంశాన్ని కూడా ఇన్వెస్టర్లు పరిశీలించారు. బీఎస్ఈ సెన్సెక్స్ 547.65 పాయింట్లు తగ్గి 71,924.68 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 157.10 పాయింట్లు క్షీణించి 22,363.35 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సూచీ పతనానికి ప్రధానంగా లార్సెన్ అండ్ టూబ్రో (2.05 శాతం), భారతి ఎయిర్‌టెల్ (1.46 శాతం), ఐసీఐసీఐ బ్యాంక్ (1.11 శాతం) షేర్లు ప్రతికూలంగా దోహదపడ్డాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాల్లో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.13 శాతం పెరగగా, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 1.08 శాతం లాభపడింది. రంగాల వారీగా చూస్తే ఆటోమొబైల్, రియల్టీ షేర్లు లాభాల్లో పయనించగా, ఎఫ్ఎంసీజీ, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు నష్టాలను చవిచూశాయి. బీఎస్ఈలో మొత్తం 2,295 షేర్లు లాభపడగా, 1,909 షేర్లు నష్టాల్లో ముగిశాయి. మరో 239 షేర్లలో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు. ప్రధాన సూచీలు నష్టాల్లో ముగిసినప్పటికీ, కమోడిటీ మార్కెట్లో డిసెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధర 88 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 105.60 డాలర్లకు చేరింది. భారతదేశ 10 ఏళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ ఈల్డ్ 7.302 శాతం నుంచి 7.388 శాతానికి పెరిగింది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి కదలికలు కొనసాగాయి. అందించిన మార్కెట్ గణాంకాల ప్రకారం, రూపాయి విలువ 95.7800 స్థాయిలో ఉండగా, గత సెషన్ ముగింపు విలువ 96.7100గా నమోదైంది. ఎంసీఎక్స్‌లో 2026 డిసెంబర్ 4 డెలివరీ బంగారం ఫ్యూచర్స్ ధర 1.05శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,49,910కు చేరింది. అమెరికా 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ ఈల్డ్ 0.23 శాతం పెరిగి 5.256 శాతానికి చేరింది. ఇక వివిధ షేర్లపరంగాచూస్తే హెచ్‌సీఎల్ టెక్నాలజీస్: 0.52 శాతం లాభపడింది. అవెన్యూ సూపర్‌మార్ట్స్ (డీమార్ట్): 4.32 శాతం పడిపోయింది. టెక్ మహీంద్రా: 2.85 శాతం క్షీణించింది. పీటీసీ ఇండస్ట్రీస్ అక్టోబర్ 9న జరిగిన సమావేశంలో షేర్ల కేటాయింపునకు సంబంధించిన ప్రకటన నేపథ్యంలో 5.34 శాతం ఎగబాకింది. స్వరాజ్ ఇంజిన్స్ 9.24 శాతం పెరిగింది. ఏరోఫ్లెక్స్ ఇండస్ట్రీస్ 10.09 శాతం దూసుకెళ్లింది. రాజేష్ పవర్ సర్వీసెస్ 4.44 శాతం లాభపడింది. సియారామ్ రీసైక్లింగ్ ఇండస్ట్రీస్ 1.28 శాతం పెరిగింది. వాటర్‌వేస్ లీజర్ టూరిజం 4.17 శాతం ఎగసింది. సెప్టెంబర్ నెల ద్రవ్యోల్బణ గణాంకాలు, ముడి చమురు ధరల కదలికలు, బాండ్ ఈల్డ్స్‌లో మార్పులు, రూపాయి పనితీరు రానున్న ఈక్విటీ సెషన్లలో దేశీయ స్టాక్ మార్కెట్ల దిశను ప్రభావితం చేసే కీలక అంశాలుగా నిలవనున్నాయి.

## సరికొత్త గరిష్టాలకు సిప్ పెట్టుబడులు..

### ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోనూ భారీ వృద్ధి

**ముంబయి, అక్టోబరు 12:** దేశంలో సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ద్వారా మ్యూచువల్ ఫండ్లలోకి వచ్చే నెలవారీ పెట్టుబడులు సెప్టెంబర్‌లో సరికొత్త ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని నమోదు చేశాయి. ఆగస్టులో రూ.32,297 కోట్లుగా ఉన్నసిప్ పెట్టుబడులు సెప్టెంబర్‌లో రూ.32,490 కోట్లకు పెరిగాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా ఆంఫీ విడుదల చేసిన డేటాతో ఈ విషయం వెల్లడైంది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు సెప్టెంబర్‌లో ఆశాజనకంగాపెరిగాయి. ఆగస్టులో రూ.29,328 కోట్లుగా ఉన్న పెట్టుబడులు సెప్టెంబర్‌లో రూ.38,307 కోట్లకు చేరాయి. అంటే నెలవారీ ప్రాతిపదికన చూస్తే సుమారు 30.6 శాతం వృద్ధి నమోదైంది. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ పథకాల నుంచి పెట్టుబడిదారులు భారీగా నిధులను ఉపసంహరించుకోవడంతో మొత్తం మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలో నికరంగా భారీ పెట్టుబడుల ఉపసంహరణ నమోదైంది. మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తుల విలువ ఆగస్టులో రూ.87.08 లక్షల కోట్లుగా ఉండగా, సెప్టెంబర్‌లో రూ.82.64 లక్షల కోట్లకు తగ్గింది. సెప్టెంబర్‌లో స్మాల్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్లలోకి రూ.9,039 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఆగస్టులో ఈ మొత్తం రూ.7,973 కోట్లుగా ఉంది. అదే సమయంలో మిడ్‌క్యాప్ ఫండ్లలో పెట్టుబడులు రూ.6,989 కోట్ల నుంచి రూ.7,835 కోట్లకు పెరిగాయి. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్లు కూడా పెట్టుబడిదారులను ఆకర్షించాయి. ఆగస్టులో రూ.5,059కోట్లుగా ఉన్న పెట్టుబడులు సెప్టెంబర్‌లో రూ.6,702 కోట్లకు చేరాయి. సెక్టోరల్, థీమాటిక్ ఫండ్లలోకి వచ్చిన పెట్టుబడులు సైతంరూ.1,713 కోట్ల నుంచి రూ.3,640 కోట్లకు పెరిగాయి. లార్జ్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్లలోనూ సానుకూల మార్పు కనిపించింది.

## హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ క్యూ2లో 11శాతం పెరిగిన లాభం

### రూ.12 డివిడెండ్ ప్రకటించిన కంపెనీ

**ముంబయి,అ క్టోబరు 12:** ప్రముఖ ఐటీ సంస్థ హెచ్‌సీఎల్‌టెక్ రెండో త్రైమాసికంలో మెరుగైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. గత త్రైమాసికంతో పోలిస్తే కంపెనీ నికర లాభం 11శాతం పెరిగి రూ.5,132 కోట్లకు చేరుకుంది. మార్కెట్ అంచనాలు రూ.4,875 కోట్లను అధిగమించింది. 2026 మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరంలోని రెండో త్రైమాసికానికి సంబంధించి కంపెనీ ఈ వివరాలను స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. అంతకుముందు ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో సంస్థ రూ.4,624కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత త్రైమాసికంతో పోలిస్తే ఆదాయం 3.01 శాతం పెరిగి రూ.34,579 కోట్లనుంచి రూ.35,620 కోట్లకు చేరింది. మార్కెట్ నిపుణుల అంచనా రూ.35,547 కోట్లు. నికర లాభం రూ.4,624 కోట్ల నుంచి రూ.5,132 కోట్లకు పెరిగింది. మార్కెట్ అంచనా రూ.4,875 కోట్లు. ఎబిడిటా నిర్వహణకు సంబంధించిన లాభం 10.9శాతం పెరిగి రూ.6,465కోట్లకు చేరింది. 2026 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో హెచ్‌సీఎల్‌టెక్ కొత్తవ్యాపార ఒప్పందాలను సాధించింది. ఈ కాలంలో కొత్త ఒప్పందాల మొత్తం కాంట్రాక్ట్ విలువ 3.26 బిలియన్ డాలర్లుగా నమోదైంది. కంపెనీలో మొత్తం ఉద్యోగుల సంఖ్య సుమారు 2.3 లక్షలుగా ఉంది. ఈ త్రైమాసికంలో 6,450 మంది ఫ్రెషర్లను నియమించుకుంది. ఉద్యోగుల అట్రిషన్ రేటు 12.8 శాతంగా నమోదైంది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఒక్కో షేరుకు రూ.12 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ఈనెల 16 రికార్డు తేదీగా వెల్లడించింది ఈనెల 26 రికార్డు తేదీ నాటికి అర్హత కలిగిన వాటాదారులకు ఈ డివిడెండ్ చెల్లించనున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.